

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 21-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 21 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

శ్వేతసౌధంలో మళ్లీ ట్రంప్

అమెరికా నూతన అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు.

అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం

ప్రపంచ నేతల అభినందనలు

మై డియర్ ఫ్రెండ్ ప్రెసిడెంట్ అంటూ విషెస్ చెప్పిన మోడీ

వాషింగ్టన్ డిసి : అమెరికా 47వ అధ్యక్షుడిగా పచ్చి మితవాది డోనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10:30 గంటలకు అమెరికా క్యాపిటల్‌లోని రోటుండాలో అట్టహాసంగా జరిగిన వేడుకలో ట్రంప్ చేత చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణస్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా వాన్స్ చేత సుప్రీంకోర్టు జడ్జి బ్రెట్ కవనౌగ్ ప్రమాణస్వీకారం నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ శ్వేత సౌధంలో అడుగుపెట్టడం ఇది రెండోసారి. అధ్యక్షుడి ప్రమాణస్వీకార కార్యక్రమం రోటుండాలో నిర్వహించడం గత 40 ఏండ్ల ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో అధ్యక్షపదవి నుంచి వైదొలగిన జో బైడెన్‌తో పాటు మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్, ...5లో

కుబేరుల బొజ్జలే నిండుతున్నాయ్

- సంపదే కాదు..పెత్తనమూ పెరుగుతోంది
- దిగజారుతున్న పేదల బతుకులు : ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడి

ట్రిలియనీర్లుగా మారుతున్న బిలియనీర్లు

ప్రపంచంలో కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. 2023తో పోలిస్తే గత సంవత్సరం వారి సంపద పెరిగి పెరిగి పదిహేను లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అంటే 2023లో కంటే 2024లో వారి సంపద మూడు రెట్ల వేగంగా పెరిగిందన్న మాట. ప్రపంచంలోని కుబేరులందరూ సోమవారం కొలరాడోలోని స్కీ రిసార్ట్ పట్టణంలో వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరులపై ఓ ఆసక్తికరమైన అధ్యయనం వెలుగు చూసింది.ప్రతి ఏటా ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సమావేశం ప్రారంభమయ్యే రోజు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ అసమానతలపై ఓ నివేదిక విడుదల చేస్తుంది. 1990 నుండి పేదల సంఖ్యలో ఎలాంటి మార్పు రానప్పటికీ కోటీశ్వరుల సంపద మాత్రం అమాంతం పెరిగిపోతోందని ఈ నివేదిక తెలిపింది. గత సంవత్సరం ఆసియాలో కుబేరుల సంపద ఏకంగా 29,900 కోట్ల డాలర్లు పెరిగిందని, రాబోయే దశాబ్ద కాలంలో కనీసం ఐదుగురు ట్రిలియనీర్లు ఉంటారని ఆక్స్‌ఫామ్ చెబుతోంది.



న్యూఢిల్లీ : ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో గత సంవత్సరం 204 మంది చేరారు. అంటే ప్రతి వారానికి సగటున సుమారు నలుగురు వ్యక్తులు కుబేరులు అవుతున్నారన్న మాట. గత సంవత్సరం ఒక్క ఆసియాలోనే కోటీశ్వరుల జాబితాలో కొత్తగా 41 మంది చేరారు. ఉత్తర అమెరికా, యూరప్‌లోని సంపన్న, శక్తివంతమైన దేశాలలో నివసిస్తున్న ఒక శాతం కుబేరులు 2023వ సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థల ద్వారా యూరప్, ఉత్తర అమెరికా వెలుపల ఉన్న ప్రాంతాల నుండి గంటకు 30 మిలియన్ డాలర్లు కొల్లగొట్టారని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో తెలియజేసింది. కోటీశ్వరుల సంపదలో 60 శాతం వారసత్వం, గుత్తాధిపత్యం, క్రోనీ సంబంధాల నుండి పొందినదేనని 'టేకర్స్...నాట్ మేకర్స్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఆక్స్‌ఫామ్ ఎత్తిచూపింది. అత్యంత సంపన్నులైన వారి ఆర్జనలో ఎక్కువ భాగం గౌరవప్రదంగా పొందిందేమీ కాదని అంటూ ...3లో



ధనిక దేశాల ఆధిపత్యం

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ధనిక దేశాలు 69 శాతం ప్రపంచ సంపద పైన, 77 శాతం కోటీశ్వరుల సంపద పైన పెత్తనం చెలాయిస్తున్నాయి. ప్రపంచ కుబేరుల్లో 68 శాతం సంపన్న దేశాలలో నివసిస్తున్న వారే. అయితే ప్రపంచ జనాభాలో వారి సంఖ్య కేవలం 21 శాతమే. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ప్రతి దేశంలోనూ డబ్బు అవసరమవుతుంది. కానీ ఆ సొమ్ము సంపన్నుల బ్యాంక్ ఖాతాలకు చేరుతోంది. ఇది ఆర్థిక వ్యవస్థకే కాకుండా మానవ జాతికి కూడా నష్టదాయకమేనని బెహర్ తెలిపారు. రోజుకు కేవలం 6.85 డాలర్లతో జీవిస్తున్న వారి సంఖ్యలో 1990 నుండి పెద్దగా మార్పేమీ రాలేదని ప్రపంచబ్యాంక్ చెబుతోంది. అయితే కోవిడ్ సమయంలో...అంటే 2021లో కూడా కోటీశ్వరుల సంపద 5.8 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది.



దావోస్‌కు సీఎం రేవంత్

జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం

అక్కడే ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ బృందం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌కు చేరుకుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం బృందానికి జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. దావోస్ పర్యటనకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు సారథ్యంలోని ప్రతినిధి బృందం కూడా అదే సమయంలో అక్కడికి చేరుకుంది. జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు, మంత్రులందరూ కాసేపు ముచ్చటించుకున్నారు. రెండు రాష్ట్రాల బృందాలు ఫొటోలు దిగారు. దావోస్ సదస్సు తొలి రోజున పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమవుతారు. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసే నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో దావోస్ పర్యటనపై ...13లో



ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాలకు సిద్ధం కావాలి

ఒకే దేశం..ఒకే ఎన్నికతో ప్రాంతీయ పార్టీలకు నష్టం

లేబర్ కోడ్ విధానంపై పోరాటాలు నిర్వహించాలి

కార్మిక కర్షక భవన్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిలయం కావాలి : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

సిద్దిపేటలో కార్మిక కర్షక భవనాన్ని ప్రారంభించిన బీవీ రాఘవులు, చుక్క రాములు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

కేంద్ర, రాష్ట్ర విధానాల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలో సీపీఐ(ఎం) కార్మిక కర్షక భవన్‌ను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం.. ఒకే ఎన్నిక.. విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని, దీనివల్ల ప్రాంతీయ పార్టీలకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఇది తెలియని బీఆర్ఎస్ జమిలీ ఎన్నికలపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో తెచ్చుకున్న లేబర్ చట్టాలను కుదించి నాలుగు చట్టాలు తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వీటి అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. రైతులకు ...13లో

మైలారం మైనింగ్‌పై ఉద్రిక్తత

మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల అరెస్ట్

- నిరసనగా గ్రామస్తుల రాస్తారోకో
- రోడ్డుపై ముండ్ల కంపలు
- సొమ్మసిల్లిన మహిళ
- భారీగా పోలీసుల మోహరింపు
- మద్దతుగా బయలుదేరిన ప్రొ.హరగోపాల్,లక్ష్మణ్ అరెస్ట్



నవతెలంగాణ - బల్మూరు

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలపై ఉద్రిక్తత నెలకొంది. 'మా గ్రామాన్ని కాపాడుకుంటాం.. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటాం.. అందుకు ఎంతటి ఆందోళన కార్యక్రమాలైనా చట్టపరిధిలో చేపడుతాం.." అంటూ మైలారం గుట్ట మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రకటించింది. ఈ క్రమంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమవ్వగా పోలీసులు ముందస్తుగా సోమవారం ఉదయమే కమిటీ నాయకులు, రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీన్ని నిరసిస్తూ గ్రామస్తులు పెద్దఎత్తున ...13లో



రాష్ట్రంలో సమృద్ధిగా ఖనిజసంపద

దేశ ఆర్థిక వ్యవస్థకు చేయూత : ఖనిజశాఖల జాతీయ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో విస్తారంగా ఖనిజ సంపద ఉన్నదనీ, దానివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఒడిస్సాలోని కోణార్క్‌లో మూడవ జాతీయ ఖనిజ శాఖా మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2014లో ఖనిజ ఆదాయం రూ.1,958 కోట్లు ఉండగా 2023 -24 నాటికి 5,540 కోట్లకు పెరిగిందని తెలిపారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో లైమ్‌స్టోన్, మాంగనీస్ వంటి 32 పెద్ద ఖనిజా బ్లాకులను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ...5లో

తెలంగాణలో కింగ్‌ఫిషర్ రీ ఎంట్రీ

సరఫరా పునరుద్ధరణకు ఓకే

20 శాతం ధరలు పెంచేందుకు సర్కార్ అంగీకారం?



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ బీర్ల మార్కెట్లో 60 నుంచి 70 శాతం వాటా కలిగిన యునైటెడ్ బేవరీస్ కంపెనీ (యూబీఎల్) రాష్ట్రంలో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచినా, తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచక పోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయనీ, వాటికి తోడు తమ కంపెనీకి రావాల్సిన రూ. 900 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈ కంపెనీ ఈ నెల 8న ప్రకటించిన విషయం విదితమే. దాంతో గత రెండు వారాలుగా రాష్ట్రంలో ఆ కంపెనీకి చెందిన కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్ల సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో యూబీఎల్ తాజా ప్రకటన మందుబాబులకు ...13లో

నిర్బంధాలను ఎదిరిస్తూ గుడిసెవాసుల పోరాటాలు

కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా బెదరని పేదలు

లాఠీచార్జీ చేసినా, దాడులు, దౌర్జన్యాలు ఎదురైనా ఐక్యంగానే ముందుకు

పలుమార్లు ధ్వంసం చేసినా, వసతుల్లేకున్నా అక్కడే మకాం

గూడులేని పేదలకు అండగా ఎర్రజెండా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పేద ప్రజలకు సొంతింటి కల కలగానే ఉంటున్నది. ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు కూడబెట్టిన సొమ్ము లేదంటే బ్యాంకు రుణాల ద్వారా ఇంటి జాగాను కొనుగోలు చేస్తున్నారు. కానీ రెక్కాడితే డొక్కాడని పేదలకు పూట గడవటమే కష్టం. వారికి జాగా కొని ఇల్లు కట్టుకునే స్తోమత ఉంటుందా? అందువల్ల వారి సొంతింటి కలను నిజం చేసే బాధ్యత ప్రభుత్వాలపైనే ఉన్నది. కానీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో వేలాది మంది పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. సహకరించాల్సిన సర్కారు నిర్బంధాలు ప్రయోగించినా గుడిసెలను మాత్రం వదిలి వెళ్లడం లేదు. పోలీసులు దాడులు చేసి కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా, లాఠీచార్జీ చేసినా, గాయాలపాలైనా పట్టుదలతో పోరాటస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. ఐక్యంగా ఉండి పోలీసులు, అధికారులకు బెదరకుండా అక్కడే నివాసముంటున్నారు. గుడిసెలను పలుమార్లు ధ్వంసం చేసినా కనీస వసతులు లేకున్నా మళ్లీ గుడిసెలు వేసుకుని బతుకుతున్నారు. ప్రభుత్వాలు మారినా వారి సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గుడిసె వాసులపై నిర్బంధం ప్రయోగించింది. అయినా బెదరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమూ అదే కొనసాగిస్తోంది. కానీ ఎర్రజెండా వారికి అండగా నిలిచింది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా పేదల పక్షాన నిలిచింది, నిలిచేది, నిలుస్తున్నది ఎర్రజెండా మాత్రమేనని గుడిసెల పోరాటాలు సైతం నిరూపిస్తున్నాయి. గుడిసెవాసులపై ...3లో



120 గజాల స్థలమివ్వాలి

ఎస్ వీరయ్య, రాష్ట్ర కన్వీనర్, ప్రజాసంఘాల పోరాట వేదిక

రాష్ట్రంలో గుడిసెలు వేసుకున్న పేదలకు 120 గజాల స్థలమివ్వాలి. వాటికి ఇందిరమ్మ ఇండ్లు అని పేరు పెట్టుకోవచ్చు. ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం చేయాలి. గుడిసెవాసులపై నమోదు చేసిన కేసులన్నింటినీ రద్దు చేయాలి. కేసుల వివరాలను పూర్తిగా ప్రభుత్వానికి ఇచ్చాం. వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకోవడానికి హోంశాఖకు ఎక్కువ సమయం పట్టదు. కానీ కేసుల రద్దు విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 30 లక్షల మందికి ఇండ్లు లేవని తేలింది. వారిలో అర్హులైన వారికి ఇంటిసౌకర్యం కల్పించాలి. గత ప్రభుత్వం నిర్మించిన 30 వేలకుపైగా డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులకు ...3లో

మరణించే వరకూ జైల్లోనే ఉంచాలి

ఆర్‌జీ కర్ హత్యాచారం కేసులో సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు

అరుదైన కేసు కాదని జడ్జి వ్యాఖ్య

కోల్‌కతా : ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్, ఆస్పత్రిలో డాక్టర్‌పై హత్యాచారం కేసులో దోషిగా నిర్ధారించిన సంజయ్ రాయ్‌కు సెషన్స్ కోర్టు సోమవారం జీవిత ఖైదు విధించింది. ఈ సందర్భంగా అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సీల్దా అనిర్బన్ దాస్ ...13లో

రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ కమిటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీని నియమించింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది మందితో కూడిన అధ్యయన కమిటీని నియమిస్తున్నట్టు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ ...13లో

రాహుల్‌కు భారీ ఊరట

అమిత్ షా పై వ్యాఖ్యల కేసులో క్రిమినల్ విచారణకు సుప్రీం బ్రేక్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీం కోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై రాహుల్ గాంధీ మాట్లాడుతూ ... అమిత్ షా ఓ హత్య కేసులో నిందితులని ఆరోపించారు. దీంతో రాహుల్ పై క్రిమినల్ డిఫమేషన్ కేసు నమోదు చేశారు. రాహుల్ ...13లో

ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టు తీవ్రంగా ఖండిస్తున్నాం

- అరెస్టు చేసిన ప్రజాసంఘాల నాయకులను విడుదల చేయాలి : హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లా మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటూ గప్పాలు కొట్టి, ఇప్పుడు ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ప్రజా సంఘాల నాయకుల గొంతులు నొక్కడం అమానుషమని తెలిపారు. ఇది ప్రజాపాలన కాదు నిర్బంధ పాలన అని విమర్శించారు. ఆంక్షలు, కంచెలు, అరెస్టులు, నిర్బంధాలు రేవంత్ పాలనలో నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. ప్రజాపాలన అంటే ఇదేనా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి ఆనాటి ఎమర్జెన్సీ పాలనను గుర్తు చేస్తున్నారని విమర్శించారు. సీఎం సొంత జిల్లాలోనే ఇంతటి దారుణ పరిస్థితులుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. మైలారంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఏఆర్ కానిస్టేబుళ్లను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం

- పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నరసింహారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏఆర్ కానిస్టేబుళ్లను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జరిగిన చర్చా వేదికలో పట్నం తరుపున ట్రాఫిక్ సమస్యలపై లేవనెత్తిన అంశాలకు అనుగుణంగా హైదరాబాద్ నగర కమిషనర్ సివి ఆనంద్ వెంటనే స్పందించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 250 మంది ఏఆర్ కానిస్టేబుళ్లను కేటాయించారని గుర్తు చేశారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. చర్చా వేదిక సందర్భంగా రోడ్డు భద్రత విషయంలో అనేక సమస్యలను లేవనెత్తినట్టు తెలిపారు. దాని ప్రకారం రోడ్ల నిర్వహణ, ఫుట్‌పాత్‌ల సక్రమ నిర్వహణ, రద్దీ ప్రాంతాల్లో పాదచారులు రోడ్లు దాటటానికి వంతెనల నిర్మాణం, రోడ్లపై జీబ్రా లైన్ల నిర్వహణ, స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయడం లాంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే నిర్వహించాలని కోరారు. దీంతో రోడ్డు ప్రమాదాల ద్వారా జరిగే మరణాలను నివారించడానికి చర్యలను చేపట్టాలని సూచించారు. రోడ్ల ట్రాఫిక్ ద్వారా వెల్లువెత్తుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు.

టెట్‌కు 74.44 శాతం హాజరు

- ముగిసిన రాతపరీక్షలు
- 24న ప్రాథమిక కీ విడుదల
- 27 వరకు అభ్యంతరాల స్వీకరణ : విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో ఈనెల రెండు నుంచి ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పేపర్-1కు 94,327 మంది, పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్‌కు 93,263 మంది, సోషల్ స్టడీస్‌కు 88,163 మంది కలిపి మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారిలో పేపర్-1కు 69,476 (73.65 శాతం) మంది, పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్‌కు 69,390 (74.40 శాతం) మంది, సోషల్ స్టడీస్‌కు 66,412 (75.33 శాతం) మంది కలిపి మొత్తం 2,05,278 (74.44 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. ఈనెల 24న టెట్ రాతపరీక్షల ప్రాథమిక కీని విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఈనెల 27న సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాథమిక కీపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల ఎనిమిది, తొమ్మిది, పది, 18 తేదీల్లో పేపర్-1, రెండు, ఐదు, 11, 12, 19, 20 తేదీల్లో పేపర్-2 పరీక్షలు జరిగాయి.

మిగిలిన భాషాపండితులకు పదోన్నతులివ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఆర్‌యూపీపీటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అప్‌గ్రెడేషన్ పదోన్నతుల తర్వాత మిగిలిపోయిన భాషాపండితులకు కూడా పదోన్నతులను కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యూపీపీటీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్ వేర్వేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. భాషాపండితుల పోస్టులను అప్‌గ్రెడేషన్‌లో భాగంగా జిల్లాలకు ఎల్పీ పోస్టులను ఎస్‌ఏ భాషలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారని తెలిపారు. కొన్ని జిల్లాల్లో అప్‌గ్రెడేషన్ ద్వారా భర్తీ అయిన పోస్టులు కాకుండా మిగిలిన ఎల్పీ పోస్టులను కూడా అప్‌గ్రేడ్ చేసి అర్హులైన భాషాపండితులకు కూడా పదోన్నతులు కల్పించాలని కోరారు. మిగతా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. భాషాబోధన నాణ్యత దీనివల్ల మెరుగుపడే అవకాశముందని వివరించారు. జిల్లాలు, యాజమాన్యాల వారీగా చేసిన కేటాయింపుల్లో ఎల్పీల్లో ఏర్పడిన ఇబ్బందులను పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరారు.

ప్రజాపాలన కాదు ఇది, నిర్బంధ పాలన

- మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలన కాదు ఇది, నిర్బంధ పాలన అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా, మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ హరగోపాల్‌ని అరెస్టు చేయడం అమానుషమనీ, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ తెలిపారు.ప్రజా పాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటూ గప్పాలు కొట్టి, ఇప్పుడు ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ప్రజా సంఘాల నాయకుల గొంతులు నొక్కడమేంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పే సోకాల్డ్ ప్రజాపాలన ఇదేనా అన్ని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పిన మీరు కంచెలు, ఆంక్షలు, అరెస్టులతో నాటి ఎమర్జెన్సీ పాలనను గుర్తు చేస్తున్నారని తెలిపారు. సీఎం సొంత జిల్లాలోనే ఇంతటి దారుణ పరిస్థితులు ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. మైలారంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్ సహా అరెస్టులు చేసిన ప్రజా సంఘాల నాయకులను తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత కాదు.. బాధ్యత

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రోడ్ సేఫ్టీపై అవగాహన



నవతెలంగాణ - నాచారం

రోడ్డు భద్రత కాదు.. బాధ్యత అని.. ప్రతి ఒక్కరూ రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం 'రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌ను రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గవర్నర్ ప్రారంభించారు. డీపీఎస్ విద్యార్థుల ప్రదర్శనలు ట్రాఫిక్ పార్క్ కార్యకలాపాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సింగిల్ లైన్, డబుల్ లైన్, హైవే రకరకాల రోడ్ల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్పీడ్ థ్రిల్‌గా ఉంటుంది కానీ అది ప్రాణం తీస్తుందని చెప్పారు. చిన్న చిన్న రూల్స్ పాటిస్తే అద్భుత విజయాలు సాధించొచ్చన్నారు. పాఠశాల దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ముఖ్యం అన్నారు. అవగాహన కార్యక్రమం ఒక జీవితాన్ని రక్షించగలిగితే అది స్ఫూర్తిదాయకమన్నారు. అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయడం బాగుందని కితాబిచ్చారు. ఆటలతో అనేక అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. క్రియేటివిటీ బయటకు తీయాలని.. అద్భుతమైన శాస్త్రవేత్తలు అవుతారని విద్యార్థులకు సూచించారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలతోపాటు జై విజ్ఞాన్, జై అనుసంధాన్‌ను కూడా కలుపుకోవాలని తెలిపారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పార్క్ అవసరం, ప్రాధాన్యతను గురించి తెలుసుకుని విద్యార్థులు తమ కుటుంబాల్లోనూ అవగాహన కల్పించడానికి ప్రయత్నించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పిల్లలు వేసిన ఆర్ట్స్, ప్రదర్శనలు రాబోయే తరాలకు గొప్పగా అందిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గే ఆస్కారం ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (టీఆర్‌బీ) వికాస్‌రాజ్, సీనియర్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ సునితారావు, పాఠశాల చైర్మెన్ మల్కా కొమరయ్య పల్లవి, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, డీపీఎస్ సంస్థ డైరెక్టర్ పల్లవి, సీఈఓ, డైరెక్టర్ యశస్వి మల్కా, డైరెక్టర్ త్రిభువన పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

మార్కెటింగ్ శాఖ పురోగతి సమీక్షలో మంత్రి తుమ్మల




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పని చేసినప్పుడే రైతులకు ప్రయోజనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఉద్యోగులం దరూ జవాబుదారీతనంతో తమ విధుల ను నిర్వహించాలని కోరారు. సోమవా రం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మార్కెటింగ్ శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. మార్కెట్ల వారీగా పనుల పురోగతి, పత్తి, మిర్చి పంటల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా 25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ లక్ష్యంగా పెట్టుకుని మద్దతు ధరకు 18 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సేకరించామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మార్కెట్లకు సంబంధించిన వార్తలు వచ్చినప్పుడు స్పందించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పనుల పురోగతి అంత ఆశాజనకంగా లేదని చెప్పారు. ప్రతి నెలకోసారి పనుల పురోగతిని సమీక్షించి, నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతను బట్టి పనులను పూర్తి చేయాలని సూచించారు. దానికి మంత్రి స్పందిస్తూ ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న పత్తిని కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేకరించాలని ఆదేశించారు. ప్రతి మార్కెటింగ్ సెక్రెటరీ ఒక పత్తి సేకరణే కాకుండా ప్రతిరోజు మార్కెట్లకు వచ్చే వివిధ రకాల పంట ఉత్పత్తుల అమ్మకాల్లో రైతుల పక్షాన ఉండి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో చొరవ చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి అందే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించే బాధ్యత తీసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారులు తమ జిల్లా పరిధిలోని మార్కెట్ల ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వచ్చే సమావేశానికి పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పరంగా ఉద్యోగులకు కావాల్సిన సహాయ, సహకారాలు అందించే బాధ్యత తీసుకుంటానన్నారు. రైతుల హక్కులను పరిరక్షించే బాధ్యత మార్కెటింగ్ శాఖ అధికారులపై ఉందనీ, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి పని చేయాలని హితవు పలికారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎం. కోదండరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో ఉద్యాన పంటలపై ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డితో పాటు ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అడిషనల్ డైరెక్టర్ బాబు, రైతు కమిషన్ ఏడీఏ అధికారి సంధ్యారాణి, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, సుస్థిర వ్యవసాయ ప్రతినిధి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కూరగాయల పంటల సాగు పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఫెస్టిసైడ్ వాడకం తగ్గించేలా చూడాలని అధికారులను కోరారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా కూరగాయల పంటను సాగు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతులు, వినియోగదారులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేంద్రీయ సాగును ప్రోత్సహించాలని కోరారు. వంకాయ, బెండకాయ సాగులో విపరీతంగా ఫెస్టిసైడ్స్ వాడుతున్నట్టు అధికారులు కమిషన్ దృష్టికి తెచ్చారు. క్లస్టర్ సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీలను క్లస్టర్ విధానంలో సాగు చేసే రైతులకు మరింత చేరేలా చూడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులతో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. త్వరలో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలో కూరగాయలు సాగయ్యే తోటలను సందర్శించి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. విచ్చలవిడిగా వాడుతున్న పురుగు మందుల కట్టడికి మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

అమెరికాలో కాల్పుల్లో హైదరాబాద్ యువకుడు మృతి

- కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

అమెరికాలో దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవితేజ(25) 2022 మార్చిలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. ఇటీవల విద్యాభ్యాసం పూర్తి చేసిన అతను వాషింగ్టన్‌లోని ఒక మాల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం మాల్‌లో ఉన్న సమయంలో రవితేజపై ఒక దుండగుడు కాల్పులు జరపగా అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుని మృతి విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



మృతదేహాన్ని తీసుకురావడానికి చర్యలు : సబితా ఇంద్రారెడ్డి

రవితేజ తల్లిదండ్రులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. అమెరికాలో కేటీఆర్‌కు ఉన్న పరిచయాలతో రవితేజ మృతదేహాన్ని త్వరగా దేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా కూడా సహకారం తీసుకుంటానని చెప్పారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి రవితేజ ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సాజిద్, నవీన్, రమేష్ కురుమ ఉన్నారు.

కబేళాలను వేలం ద్వారా ఆరె కటికెలకివ్వాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కబేళాలను వేలం ద్వారా ఆరె కటికలకివ్వాలనీ, వారిని సంచార జాతులుగా గుర్తించాలని వివిధ జిల్లాలకు చెందిన తెలంగాణ స్టేట్ ఆరెకటిక (కటిక్) సంఘ్ ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం బీసీ కమిషన్ చైర్మెన్‌ను కోరారు. కులం పేరును ఆరెకటిక గానే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ కమేళాలను వేలం ద్వారా ఆరకటికేతరులకు ఇవ్వడం ద్వారా ఆరెకటికలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని కమిషన్‌కు తెలిపారు. ఇతర కులాల వారికి కల్పిస్తున్న సౌకర్యాలను ఆరెకటికలకు కూడా కల్పించాలని వారు కోరారు.

డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షులుగా రమేష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీడీసీపీఏ) రాష్ట్ర అధ్యక్షులుగా సంగి రమేష్, ప్రధాన కార్యదర్శిగా కె విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం టీజీడీసీపీఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మల్టీజోన్-2 ఉపాధ్యక్షులుగా జి సుకన్య, జాయింట్ సెక్రెటరీగా జి శ్రీనివాస్, మల్టీజోన్-1 ఉపాధ్యక్షులుగా వై చిన్నప్పయ్య, జాయింట్ సెక్రెటరీగా వి విజయలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా కె ప్రభు, మహిళా కార్యదర్శి పివి గీతా లక్ష్మి పట్నాయక్, అకడమిక్ కార్యదర్శిగా ఎం నవీన్, కార్యనిర్వాహక మండలి సభ్యులుగా కె ప్రవీణ్‌కుమార్, జి పోషయ్య, ఎం సుధాకర్, ఆర్ రవినాయక్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె శ్రీనివాసరాజు, అసోసియేట్ సెక్రెటరీగా ఎ అశోక్ నామినేట్ అయ్యారు.

కుబేరుల బొజ్జలే నిండుతున్నాయ్



సంపద, వలసవాదం శక్తివంతంగా పనిచేస్తున్నాయి. కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి కూడా ఇవే కారణం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కొందరి చేతిలో బందీగా ఉండిపోయింది. బిలియనీర్లకు అడ్డుకట్ట వేయడంలో జరుగుతున్న వైఫల్యం కారణంగా ట్రిలియనీర్లు పుట్టుకొస్తున్నారు. కోటీశ్వరుల సంపద మాత్రమే పెరగడం లేదు... దానితో పాటు వారి పెత్తనం కూడా పెరుగుతోందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ చెప్పారు.

'కుబేరుడైన దేశాధ్యక్షుడు. ఆయనను తీసుకొచ్చి మద్దతు ఇచ్చిన ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తి ఎలన్ మస్క్...ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను నడపబోతున్నారు. మేము ఈ నివేదికను ఒక మేలుకొలుపుగా అందిస్తున్నాము. కొద్ది మంది చేతిలో ఉన్న అంతులేని సంపద కారణంగా ప్రపంచంలోని సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు' అని అమితాబ్ బెహర్ తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

అసమానతలను తగ్గించేందుకు, అధిక సంపదకు స్వస్తి పలికేందుకు, కొత్తగా పుట్టుకొచ్చిన దొరతనాన్ని అంతం చేసేందుకు వీలుగా ప్రపంచంలోని కుబేరులపై ఆయా దేశాల ప్రభుత్వాలు పన్నులు విధించాలని హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెత్తనమూ పెరుగుతోంది

గత ఏడాది కుబేరుల సంపద రోజుకు సగటున 5.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. 2023లో బిలియనీర్ల సంఖ్య 2,565 నుండి 2,769కి పెరిగింది. ప్రపంచంలో అత్యంత సంపన్నులైన పది మంది సంపద రోజుకు సగటున వంద మిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. ఒకవేళ వారు రాత్రికి రాత్రే తమ సంపదలో 99 శాతాన్ని కోల్పోయినప్పటికీ వారు కోటీశ్వరులుగానే మిగులుతారని ఆక్స్‌ఫామ్ తేల్చి చెప్పింది. నేడు అసమానతలు గరిష్ట స్థాయికి చేరడం వెనుక అక్రమ

వారసత్వంగా వచ్చిందే

ఆక్స్‌ఫామ్ అంచనా ప్రకారం కోటీశ్వరుల సంపదలో 36 శాతం వారసత్వంగా వచ్చి పడిందే. 30 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి కోటీశ్వరుడికీ సంపద వారసత్వంగానే సంక్రమించిందని ఫోర్బ్స్ పరిశోధన తేల్చింది. ఇవాళ కోటీశ్వరులుగా ఉన్న వెయ్యి మంది రాబోయే రెండు మూడు దశాబ్దాలలో 5.2 ట్రిలియన్ డాలర్ల సంపదను తమ వారసులకు అప్పగిస్తారని యూబీఎస్ అనే అంతర్జాతీయ సంస్థ అంచనా. యూరప్‌లోని అత్యంత సంపన్నులు పేద దేశాలను దోచుకోవడం, చారిత్రక వలసవాదం కారణంగా కుబేరులయ్యారని ఆక్స్‌ఫామ్ తెలిపింది.

నిర్బంధాలను ఎదిరిస్తూ గుడిసెవాసుల పోరాటాలు





(మొదటిపేజీ తరువాయి)

దాడులను ఆపాలనీ, కేసులను రద్దు చేయాలని సీపీఐ(ఎం) నాయకుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు దాడులు జరగడం లేదు. కానీ గుడిసెవాసులకు ఇంటి స్థలం ఇవ్వలేదు, వారిపై నమోదు చేసిన కేసులను కూడా రద్దు చేయలేదు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్న నేపథ్యంలో పేదల పోరాటాలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

69 కేంద్రాల్లో గుడిసెలు వేసుకున్న లక్ష కుటుంబాలు

రాష్ట్రంలో 20 జిల్లాలు 69 కేంద్రాల్లో సుమారు లక్ష కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నాయి. ప్రభుత్వం దాడులు చేసి కూల్చివేసినా వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, ములుగు, మహ బూబాబాద్, జనగామ, పెద్దపల్లి, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి జిల్లాల్లో గుడిసె వాసుల పోరాటం ఇంకా కొనసాగుతున్నది. ఎనిమిది కేంద్రాల్లో 15 సార్లు పోలీసులు లాఠీచార్జీ చేశారు. 417 మందిపై 81 కేసులను నమోదు చేశారు. 33 మంది ఎనిమిది నుంచి 30 రోజుల వరకు జైలుకు వెళ్లారు. తీవ్రమైన నిర్బంధం ప్రయోగించినా గుడిసెలను వదలకుండా వేల మంది అక్కడే నివాసముంటున్నారు. పోలీసులు దాడులు చేసి గుడిసెలను ధ్వంసం చేశారు, కేసులు పెట్టి తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించారు. మహబూబాబాద్‌లో పది మంది మహిళలపై దాడి చేసి చిత్రహింసలకు గురిచేశారు. 22 సార్లు గుడిసెలను ధ్వంసం చేశారు. అయినా తిరిగి గుడిసెలు వేసుకుని అక్కడే ఉంటున్నారు. జనగామలో 176 మంది మీద కేసులు పెట్టారు. జగిత్యాలలో తొమ్మిది మంది నెలరోజులు జైలులో ఉన్నారు. నాయకులు 40 రోజులు అజ్ఞాతంలో గడపాల్సి వచ్చింది. రంగారెడ్డిలో 14 మందిని జైలులో పెట్టారు. హన్మకొండలో 38 మందిపై కేసులు పెట్టారు. వరంగల్‌లో 600 మందిని అరెస్టు చేశారు. వరంగల్ జిల్లా జక్కలొద్దిలో గర్భిణీల మీద పోలీసులు దాడి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా మహబూబాబాద్, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్ (కోరుట్ల), జనగామ జిల్లాల్లో పెద్దఎత్తున పోలీసులు దాడి చేసి గుడిసె లను ధ్వంసం చేశారు. కేసులు పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం కలిశాక ప్రస్తుతానికి ఈ దాడులు ఆగాయి.

ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పోరాటం

ప్రజాసంఘాల పోరాట వేదిక గుడిసెవా సులకు అండగా వివిధ రూపాల్లో పోరాటాలను నిర్వహించింది. కలెక్టరేట్లు, ఎంఆర్‌వో కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టింది. బస్సు యాత్రను నిర్వహించింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఈ యాత్రను ప్రారంభించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. గుడిసెల్లో బస చేయడం, వారు పెట్టిన భోజనం తినడమే ఈ యాత్ర ప్రత్యేకత.

గుడిసెవాసుల పోరాటంలో మహిళలు కీలకంగా పనిచేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇండ్లులేని పేదలకు స్థలమిచ్చి ఇల్లు కట్టిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వ భూముల్లోనే పేదలు గుడిసెలు వేసుకున్నారు. వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆర్థిక సాయం చేస్తే బాగుంటుందని ప్రజాసంఘాల పోరాట వేదిక అభిప్రాయప డుతున్నది. అయితే లక్ష కుటుంబాలు గుడిసెలు వేసుకున్న స్థలంలో కాకుండా వేరే స్థలంలో ప్రభుత్వం సర్దుబాటు చేసినా వారికి న్యాయం జరుగుతుంది. వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి పైసా ఖర్చు లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆ భూముల్లో ఉన్న వారికి పట్టాలివ్వాల్సి ఉంటుంది.

120 గజాల స్థలమివ్వాలి

ఎస్ వీరయ్య, రాష్ట్ర కన్వీనర్, ప్రజాసంఘాల పోరాట వేదిక

కేటాయించాలి. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో ఇండ్లు, ఇండ్లస్థలాల సమస్యపై ప్రత్యేకంగా చర్చించి తీర్మానం చేస్తాం. ఫిబ్రవరి వరకు ఇందిరమ్మ ఇండ్ల అర్హులను గుర్తిస్తామనీ, మార్చిలో పేదల ఇండ్ల సమస్యపై మాట్లాడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. దాటవేత ధోరణిని అనుసరిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

యూజీసీ నిబంధనల ముసాయిదాను ఉపసంహరించుకోండి

కేంద్రానికి స్టాలిన్ లేఖ

బీజేపీయేతర ముఖ్యమంత్రులకు కూడా..



చెన్నై : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నిబంధనల ముసాయిదా 2024-25పై తమిళ నాడు వైఖరిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మరోసారి పునరుద్ఘా టించారు. ఈ ముసాయిదాను వెంటనే ఉపసంహరిం చుకోవాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు స్టాలిన్ సోమవారం లేఖ రాశారు. అలాగే ఈ ముసాయి దాపై బిజెపియేతర ముఖ్యమంత్రులకు కూడా స్టాలిన్ లేఖ రాశారు. ముసాయి దాకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిన విషయాన్ని ప్రస్తావిం చారు. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి తీర్మానాన్ని ఆమోదించాలని స్టాలిన్ పిలుపుని చ్చారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాసిన లేఖలో ముసాయి దాలోని కొన్ని నిబంధనలు స్టాలిన్ ప్రస్తావించారు. నాలుగేండ్ల కాలపరి మితగల ఎం.టెక్, ఎం.ఈ కోర్సుల్లో అర్హత కోసం నిర్వహించే ప్రవేశపరీక్షపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, విద్యావేత్తలు కాని వ్యక్తులను కూడా యూనివర్సిటీ వైస్ చాన్సలర్లుగా నియమించే నిబంధన పైనా, వైస్ చాన్సలర్ సెర్చ్ కమిటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్కపెట్టడం, క్రాస్- డిసిప్లినరీ టీచర్లు వంటి నిబంధనలపై స్టాలిన్ తన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముసా యిదాలో ఉన్న అనేక నిబంధ నలు విశ్వవిద్యాలయాల సమగ్రత, స్వయం ప్రతిపత్తి, సమగ్ర అభివృద్ధికి సవాళ్లుగా ఉన్నాయని స్టాలిన్ విమర్శిం చారు. తాను వ్యక్తం చేసిన ఆందోళ నలపై సమీక్ష నిర్వహించాలని కేంద్ర మంత్రికి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. అలాగే, బీజేపీయేతర ముఖ్యమం త్రులకు రాసిన లేఖలో ముసాయి దాలోని నిబంధనలు రాష్ట్రాల హక్కుల ను స్పష్టంగా ఉల్లంఘిస్తు న్నాయని స్టాలిన్ విమర్శించారు. విశ్వ విద్యాల యాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని విమర్శించారు. అధికా రాన్ని కేంద్రీకరించడానికి, దేశ సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపర్చే ఇలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా మనం ఐక్యంగా నిలబడ్డం చాలా కీలకమని ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో స్టాలిన్ స్పష్టం చేశారు.

బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసు

కస్టడీలో నిందితుడి మృతికి ఐదుగురు పోలీసులే కారణం



మేజిస్ట్రేట్ విచారణలో నిర్ధారణ

ముంబయి : బద్లాపూర్ పాఠశాల లైంగిక వేధింపుల కేసులో నిందితుడు అక్షయ్ షిండే కస్టడీలో మరణించడానికి ఐదుగురు పోలీసులే కారణమని మేజిస్ట్రేట్ విచారణ నిర్ధారించింది. ఈ మేరకు బాంబే హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించింది. థానే క్రైం బ్రాంచ్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ షిండే, అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నీలేష్ మోరే, హెడ్ కానిస్టేబుళ్లు అభిజీత్ మోరే, హరీష్ తవడే, పోలీస్ డ్రైవర్‌ను నివేదికలో పేర్కొంది. అక్షయ్ షిండేను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారని ఆరోపిస్తూ అతని తండ్రి అన్నా షిండే దాఖలు చేసిన పిటీషన్‌ను హైకోర్టు విచారిస్తున్న సంగతి తెలిసిందే. మేజిస్ట్రేట్ నివేదికను జస్టిస్ రేవతి మోహితే డేరే, జస్టిస్ నీలా గోఖలేలతో కూడిన డివిజన్ బెంచ్ పరిశీలించింది. ఈ నివేదిక ఆధారంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు పోలీసులకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుందని బెంచ్ తెలిపింది. అలాగే ఈ కేసును ఏ ఏజెన్సీ దర్యాప్తు చేస్తుందో తమకు తెలిపాలని ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ విషయాన్ని తెలియచేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హితేన్ వెనెగాంకర్‌ను కోరింది. అలాగే విచారణ నివేదిక కాపీని ప్రాసిక్యూషన్‌కు, అన్నా షిండేకు కూడా అందచేయాలని మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. బద్లాపూర్‌లోని ఒక పాఠశాల టాయిలెట్‌లో ఇద్దరు మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలతో గతేడాది ఆగస్టులో ఆ పాఠశాల అటెండర్ అక్షయ్ షిండేను అరెస్టు చేశారు. అయితే సెప్టెంబరు 23న తలోజా జైలు నుంచి విచారణ కోసం తీసుకెళ్తుండగా మృతి చెందాడు. వ్యాన్‌లో ఒక పోలీసు నుంచి తుపాకీ లాక్కొని తమపై కాల్పులు జరపడంతో తాము ఎదురుకాల్పులు జరిపామని, ఇందులో అక్షయ్ షిండే మరణించాడని పోలీసులు తెలిపారు.కాగా, బద్లాపూర్ పాఠశాల లైంగిక వేధింపుల కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించింది.

యూజీసీ చర్యతో నాణ్యతపై ఎఫెక్ట్

భారత విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయి దెబ్బ తింటుంది

జర్నల్ జాబితా రద్దుపై విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : జర్నల్ జాబితా రద్దుపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చర్యను దేశంలోని విద్యావేత్తలు, నిపుణులు తప్పుబడుతున్నారు. దీనితో నాణ్యతపై ప్రభావం పడుతుందనీ, భారత విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయి దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. పరిశోధకులు, విద్యావేత్తలు విశ్వసనీయమైన జర్నల్స్‌ను గుర్తించటంలో, వారి పత్రాలను ప్రచురించటానికి కొన్ని నాణ్యతా ప్రమాణాలను పాటించటంలో సహాయపడే ప్రచురణల ప్రామాణిక జాబితాను నిలిపివేయాలని యూజీసీ ఇటీవలే నిర్ణయించింది. యూజీసీ-కన్సార్టియం ఫర్ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ ఎథిక్స్ (కేర్) జాబితాను రద్దు చేయాలని కమిషన్ ఇటీవల నిర్ణయించిందని ఇద్దరు యూజీసీ అధికారులు చెప్పారు. అయితే, ఈ నిర్ణయంపై దేశంలోని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఇది భారతీయ విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని అన్నారు.

ప్రస్తుత యూజీసీ నిబంధనల ప్రకారం.. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు కెరీర్ పురోగతికి అర్హత పొందటానికి పరిశోధనా పత్రాలు, పుస్తకాలను ప్రచురించాలి. 2018కి ముందు యూజీసీ.. విశ్వవిద్యాలయాల ఇన్‌పుట్‌ల ఆధారంగా ఆమోదం పొందిన జర్నల్స్ జాబితాను దాని ముగింపులో ఎలాంటి సమగ్ర పరిశీలన లేకుండానే నిర్వహించింది. దీంతో ఇది జర్నల్స్ దోపిడీకి తెరలేపినట్టయ్యింది. రచయితలు రుసుము చెల్లించి తమ పత్రాలను ప్రచురించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నవంబర్, 2018లో యూజీసీ.. యూజీసీ-కేర్‌ను ప్రారంభించింది. "కేర్ జాబితాను నిలిపివేయాలని యూజీసీ నిర్ణయించింది. ఏ ప్రచురణలను అనుసరించాలో నిర్ణయించటానికి విశ్వవిద్యాలయాలు ఉత్తమంగా సరిపోతాయని భావించింది" అని సంస్థ అధికారి ఒకరు తెలిపారు. అయితే, ఈ విషయంలో విశ్వవిద్యాలయాలతో యూజీసీ ఎలాంటి సంప్రదింపులూ జరపలేదని ముగ్గురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ.. పరిశోధన, ప్రచురణల విషయంలో నాణ్యతపై రాజీపడిందని అన్నారు. ఇది మరోసారి దోపిడీ జర్నల్స్‌ను పెంచుతుందనీ, ఎలాంటి నియంత్రణా ఉండదని చెప్పారు. జర్నల్స్‌ను సూచించటానికి విశ్వవిద్యాలయాలకు గతంలో బాధ్యతలనిస్తే.. నాసిరకం జర్నల్స్‌ను చేర్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కరెంట్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. 2018లో యూజీసీ ఆమోదించిన 1009 జర్నల్స్ నమూనాలో 88 శాతం తక్కువ నాణ్యతను కలిగి ఉన్నాయి.

సాక్షులకు ఆశిష్ మిశ్రా బెదిరింపులు

విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీకి 'సుప్రీం' ఆదేశం



లఖింపూర్ : ఉత్తర ప్రదేశ్ లఖింపూర్ కేసులో నిందితుడు ఆశిష్‌మిశ్రా సాక్షులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఎస్పీని సుప్రీంకోర్టు ఆదేశించింది. లఖింపూర్‌లో 2021 అక్టోబర్ 3న నిరసన తెలుపుతున్న రైతులపైకి కారుతో దూసుకుపోయి, వారి మరణానికి కారణమైన కేసులో ప్రధాన నిందితుడు, కేంద్ర మాజీమంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా. నిందితుడు సాక్షులను ప్రభావితం చేశారని, బెదిరించారని వచ్చిన ఆరోపణలపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని లఖింపూర్ ఖేరీ ఎస్పీకి సూచించింది. ఈ ఆరోపణలను నిందితుడు తరపు న్యాయవాది సిద్ధార్థ్ దవే తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేసేందుకు ఇలాంటి వాదనలు చేస్తున్నారని దవే అన్నారు. కేసులో ముఖ్యమైన సాక్షులను ప్రభావితం చేసేందుకు ఆశిష్‌మిశ్రా ప్రయత్నించినట్టుగా తన వద్ద ఆడియో రికార్డింగ్‌లను ఉన్నాయని ఫిర్యాదుదారుల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పష్టం చేశారు. బెయిల్ షరతులను ఉల్లంఘించి ఆశిష్ మిశ్రా బహిరంగ సభలో పాల్గొన్నారని చెప్పారు. వెంటనే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ప్రశాంత భూషణ్ తెలిపిన ఆధారాలను సేకరించి ఎస్పీకి పంపించాలని ఉత్తర ప్రదేశ్ న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఆరోపణలపై స్పందించాలని ఆశిష్‌మిశ్రాను కోరింది. ఆ మెటీరియల్ నిజాయితీని, వాస్తవికతను, విశ్వసనీయతను తనిఖీ చేసి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎస్పీని కోర్టు ఆదేశించింది. రోజువారీ విచారణ జరపాలన్న ప్రశాంత్‌భూషణ్ విజ్ఞప్తిని ధర్మాసనం తిరస్కరించింది. నాలుగు వారాల తర్వాత విచారణ జరపనున్నట్టు పేర్కొంది.

ఢిల్లీలో 11.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



ఢిల్లీ: సోమవారం ఉదయం ఢిల్లీలో సాధారణం కంటే 3.8 డిగ్రీలు ఎక్కువగా 11.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. సాపేక్ష ఆర్ద్రత ఉదయం 8.30 గంటలకు 91%గా నమోదైంది. పగటిపూట ఆకాశం స్పష్టంగా ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంటుందని అంచనా. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) ప్రకారం, ఉదయం 9 గంటలకు ఢిల్లీ గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ) 342 రీడింగ్‌తో నమోదై 'చాలా పేలవమైన' విభాగంలో ఉంది. సున్నా - 50 మధ్య ఎక్యూఐ 'మంచిది', 51-100 'సంతృప్తికరంగా', 101-200 'మోడరేట్', 201-300 'పేలవమైనది', 301-400 'చాలా పేలవమైనది', 401-500 'తీవ్రమైనది'గా పరిగణించబడుతుంది.

బీహార్‌లో పడవ బోల్తా పడి ముగ్గురు మృతి



పాట్నా: బీహార్‌లో పడవ బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఆదివారం బీహార్‌లోని కతిహార్‌లో ఈ ప్రమాదం జరిగింది. 15 మందితో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. 7 మందిని రక్షించారు. మృతుల్లో మూడేండ్ల చిన్నారి కూడా ఉంది. ప్రమాదానికి కారణం అస్పష్టంగా ఉంది.

డీజిల్ దొంగలు

ఖమ్మం కార్పొరేషన్‌లో కొందరు అధికారుల దందా

'స్వచ్ఛ' వాహనాల నుంచి ఇంధన తస్కరణ

డ్రైవర్లతో అధికారుల కుమ్మక్కుతోనే అక్రమం

గత అసిస్టెంట్ కమిషనర్ నుంచి మొదలైన తంతు

ఓ ఇద్దరిపై చర్యలు తీసుకున్నా ఆగని చౌర్యం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

ఖమ్మం నగర పాలక సంస్థలో మూడు, నాలుగు ఏండ్లుగా డీజిల్ దొంగతనం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులే దీనిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘకాలం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారితో మొదలైన ఈ తంతు నేటికీ కొనసాగుతోంది. కార్పొరేషన్ నుంచి బయటకు వెళ్లిన స్వచ్ఛ వాహనాల డీజిల్ ఇట్టే మాయమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. నగరపాలక సంస్థలో ఈ వాహనాల నిర్వహణతో సంబంధం ఉన్న ఓ ఏఈ స్థాయి అధికారి, డ్రైవర్లతో కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్టు సమాచారం. గతంలో ఓ ఇద్దరు పట్టుబడగా.. వారిపై చర్యలు తీసుకున్నారు. నూతన కమిషనర్ అభిషేక్ అగస్త్య స్ట్రిక్ట్‌గా వ్యవహరిస్తున్నారు. నెల రోజుల క్రితం ఓ జూనియర్ అసిస్టెంట్‌కు కమిషనర్ బాధ్యతలు ఇచ్చారు. అయితే అతనిపై కొందరు ఒత్తిడి తీసుకొచ్చి తప్పుడు మీటర్ రీడింగులతో నిధులు కాజేస్తున్నారని సమాచారం.

వర్కింగ్ అవర్స్ ఎక్కువ చూపించి..

అధికారులు వాహనాల వర్కింగ్ అవర్స్ ఎక్కువ చూపించి డీజిల్ మాయం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉదాహరణకు ఒక వాహనం రెండు గంటలు పని చేస్తే ఎనిమిది గంటలు పని చేసినట్టు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు. అధికారులు, డ్రైవర్లు కుమ్మక్కై తప్పుడు గణాంకాలు నమోదు చేస్తున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో మొత్తం 80కి పైగా వాహనాలు ఉన్నాయి. వీటిలో స్వచ్ఛ ట్రాలీ ఆటోలు 40 ఉండగా, ట్రాక్టర్లు 33 ఉన్నాయి. సెప్టిక్ ట్యాంకర్ ఒక్కటి, మొక్కలకు నీళ్లు పోసేందుకు మూడు ట్యాంకర్లు, స్వీపింగ్ మిషన్లు రెండు, జేసీబీలు మూడు చొప్పున ఉన్నాయి. డంపింగ్ యార్డ్‌లో పని చేసే 220 సెక్షన్ మిషన్ ఒకటి ఉంది.

వీటన్నిటి నిర్వహణ బాధ్యతలను అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షిస్తారు. సుదీర్ఘకాలం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి ఏడాదిన్నర క్రితం బదిలీ అయిన అధికారి నుంచి మొదలైన తంతు నేటికీ కొనసాగుతోంది.

డీజిల్ చౌర్యం ఎలా..?

ఒక ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోకు దూరాన్ని బట్టి మూడు రోజులకు 25 నుంచి 30 లీటర్ల చొప్పున డీజిల్ కూపన్లు ఇస్తారు. జేసీబీలకు మాత్రం ఎనిమిది గంటలకు 40 లీటర్లు, 200 సెక్షన్ మిషన్‌కు మూడు గంటలకు ఓసారి 100 లీటర్లు ఇస్తారు. స్వీపింగ్ మిషన్లు, సెప్టిక్ ట్యాంకుకు వర్కు లేకపోయినా వాటిని వేరే చోటకు తీసుకెళ్లి జవాన్‌తో పనిచేసినట్టు రాయించుకొని ఆ డీజిల్‌ను దారి మళ్లిస్తున్నారు. వాటర్ ట్యాంకర్ల విషయంలోనూ ఇదే వ్యవహారం కొనసాగుతున్నట్టు సమాచారం. పబ్లిక్ టాయిలెట్ బస్సుల విషయంలోనూ ఈ తరహాలోనే మోసానికి పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. శౌచాలయ బస్సులపై నియంత్రణ లేకపోవడంతో వాటిని ప్రయివేటు ఫంక్షన్లకు తరలించి, ప్రభుత్వ ఫీజుతో పాటు అదనంగా రూ.2000 డీజిల్ ఖర్చులకోసం అని చెప్పి వసూలు చేస్తున్నారు. కొందరు వెహికల్ ట్యాంకర్ నుంచి పైప్ ద్వారా నేరుగా తీస్తుండగా.. మరికొందరు బంకు వద్దనే క్యాన్‌లలో నింపించి అమ్ముతున్నట్టు సమాచారం. ఫాగింగ్ మిషన్‌లు మంత్రులు, వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే వినియోగిస్తున్నారు. కానీ డివిజన్‌లలో ఫాగింగ్ కోసం వినియోగించినట్టు తప్పుడు లెక్కలు చూపుతూ దోచుకుంటున్నారు.

బయట రూ.80 చొప్పున విక్రయం

బంక్‌లో లీటర్ రూ.95.70 చొప్పున ధర ఉండగా వాహనాల్లో నుంచి తీసిన డీజిల్‌ను మాత్రం రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. వాహనాల్లో నుంచి డీజిల్ తస్కరిస్తున్న విషయంపై గత కొన్ని రోజులుగా 'నవతెలంగాణ' దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఖమ్మం డంపింగ్ యార్డ్ వద్ద ఓ డ్రైవర్ జేసీబీ నుంచి డీజిల్ బయటకు తీస్తున్న దృశ్యం కంటపడింది. ఇలా తీసిన డీజిల్‌ను బయట ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించాడు. నాలుగైదు రోజులకు ఒకసారి కొందరు డ్రైవర్లు తమకు తక్కువ రేటుకు ఈ డీజిల్‌ను విక్రయిస్తున్నారని కొనుగోలుదారులు తెలిపారు. లీటర్ రూ. 15 వరకు తక్కువకు వస్తుండటంతో తాము వారి వద్ద తీసుకుంటున్నట్టు చెప్పారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

మీటర్ రీడింగ్ ప్రకారమే డీజిల్‌ను కేటాయిస్తున్నాం. నెల రోజుల క్రితం ఓ జూనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు ఇచ్చి మీటర్ రీడింగ్‌లో అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాం. అయినప్పటికీ ఆరోపణలు వస్తున్న దృష్ట్యా నిఘాను కఠినతరం చేస్తాం. డీజిల్ తస్కరించే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- అభిషేక్ అగస్త్య, కమిషనర్, ఖమ్మం నగర పాలక సంస్థ

దీక్ష విరమించిన 121 మంది రైతులు



న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్‌కు సంఘీభావంగా ఆమరణ దీక్ష చేపట్టిన రైతులు తమ దీక్షను విరమించారు. ఖనౌరీ నిరసన ప్రదేశంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన 121 మంది రైతుల బృందం ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. దల్లేవాల్ వైద్య సహాయం తీసుకున్న తర్వాత అన్నదాతలు తమ దీక్షను ముగించారు. డీఐజీ మన్‌దీప్ సిద్ధు, పాటియాలా సీనియర్ ఎస్పీ నానక్ సింగ్ సమక్షంలో రైతులు రసాన్ని తాగి దీక్షను విరమించారు. అయితే, పంటల కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇచ్చే వరకు దల్లేవాల్ తన నిరాహార దీక్షను విరమించబోరని రైతు నాయకులు తెలిపారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించటం, ఆయన దీక్ష చేపట్టి 50 రోజులకు పైగా పూర్తవుతున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు నుంచి ఎలాంటి సానుకూల స్పందనా రాలేదు. వారి డిమాండ్లకు అంగీకరించలేదు. దీంతో 111 మంది రైతుల బృందం ఖనౌరీ సమీపంలో నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈనెల 17న మరో పది మంది అన్నదాతలు కూడా ఈ నిరసనలో భాగమయ్యారు. నవంబర్ 26న దల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఫిబ్రవరి 14న రైతుల డిమాండ్లను చర్చించటానికి కేంద్రం చర్చలకు ఆహ్వానించిన నేపథ్యంలో దల్లేవాల్ వైద్యానికి అంగీకరించారు. కాగా, నిరాహారదీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాల్ వైద్య సహాయ నిర్ణయాన్ని ఎస్కేఎం స్వాగతించింది. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షను వ్యక్తం చేసింది.

సంపాదకీయం

కార్చిచ్చు



కాలిఫోర్నియా గాలిలో బలంగా వ్యాపిస్తోన్న ఘాటైన కపురు వాసన. అంతులేని కార్చిచ్చుల వల్ల పెరుగుతున్న ఆందోళన. కేవలం క్షణికమైన విపత్తు కాదు. భవిష్యత్‌ను కలవరపెట్టే అంశం. కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో ప్రకృతి దృశ్యం మండుతున్న నారింజ, బూడిద రంగులతో కూడిన భయంకరమైన వస్త్రం కప్పినట్లుగా కనిపిస్తోంది. ఇండ్లు, పొగమంచు శిథిలాలుగా మారాయి. పర్యావరణం నాశనమైంది. ఆర్థిక నష్టం, నిరాశ్రయ కుటుంబాల భావోద్వేగం వారి జీవితాలను మార్చలేనంతగా కమ్మేసింది. గత కొన్ని దశాబ్దాలుగా కార్చిచ్చులు, భూకంపాలు వంటి విపత్తులకు మానవులు కూడా సమాన బాధ్యులే. లాస్ ఏంజెల్స్‌లో రగిలిన కార్చిచ్చు చెట్టు పుట్టను కబళించడమే కాదు, ఈ ప్రాంతంలోని అత్యంత ఖరీదైన ఇండ్లను బూడిద కుప్పలుగా మార్చింది. పదహారు మంది మృతిచెందగా,డెబ్బయి వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్చిచ్చు మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని, వ్యాధి నిరోధక శక్తిపై దాడి చేయడమే కాకుండా శ్వాస సంబంధ వ్యాధులను, ఇన్ఫెక్షన్లను వ్యాప్తి చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

> ఈ ఏడాది తొలిరోజునే కులులోని తాండి గ్రామాన్ని భీకర అగ్నిప్రమాదం బూడిద కుప్పగా మార్చింది. ఈ దృశ్యానికి చలించిన సిమ్లాకు చెందిన యువ రచయిత సౌరభ్ చౌహాన్ 'నిశ్శబ్దం తన గీతాన్ని అల్లిన కొండల దగ్గర/ క్రూరమైన మంట మసకబారింది/ శీతాకాలపు పట్టులో, అక్కడ మంచు పట్టుకుంటుంది/ కలలు కాలిపోయాయి, హృదయాలు చల్లగా మారాయి/ అగ్ని గర్జించింది, దాని నాలుక దయలేనిది/ ఏ ఆశను వదలని మృగం/ ఇళ్లు కూలిపోయాయి, రాయి నుండి ధూళి వరకు/ మండుతున్న గాలులకు జ్ఞాపకాలు కోల్పోయాయి' అంటాడు భావోద్వేగంతో.

కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో సంభవించిన కార్చిచ్చు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. శాస్త్రవేత్తలను సైతం నిర్ఘాంతపరుస్తోంది. మంటలు ఇంత వేగంగా వ్యాపించడం మునుపెన్నడూ చూడలేదని, వాతావరణ పరిస్థితులే దీనికి కారణమని అగ్నిమాపకాధికారులు చెబుతున్నారు. మానవ తప్పిదాల వల్ల మున్ముందు ఇలాంటి విపత్తుల ముప్పు మరింత పెరుగుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఈ కార్చిచ్చు ఒక్క అమెరికాకే పరిమితమైంది కాదు. నేడు ప్రపంచమంతా ఈ ముప్పు ముంగిట వుంది' అని తేల్చి చెబుతున్నారు. భారత్‌లోనూ కార్చిచ్చుల బెడద క్రమంగా పెరుగుతోంది. హిమాలయాల జీవవైవిధ్యానికి అడవి మంటలు ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన చెందుతోంది. ఉత్తర భారతంలోని అడవుల్లో ఇటీవల పెరుగుతున్న అగ్నిప్రమాదాలే దీనికి కారణం. 36 శాతం మేరకు అడవులు దావాలనాల బారిన పడుతున్నాయి. చిత్తడి ప్రాంతాల్లోనూ వాటి విజృంభణ సర్వసాధారణమైంది. ఈ ఏడాది తొలిరోజునే కులులోని తాండి గ్రామాన్ని భీకర అగ్నిప్రమాదం బూడిద కుప్పగా మార్చింది. ఈ దృశ్యానికి చలించిన సిమ్లాకు చెందిన యువ రచయిత సౌరభ్ చౌహాన్ 'నిశ్శబ్దం తన గీతాన్ని అల్లిన కొండల దగ్గర/ క్రూరమైన మంట మసకబారింది/ శీతాకాలపు పట్టులో, అక్కడ మంచు పట్టుకుంటుంది/ కలలు కాలిపోయాయి,హృదయాలు చల్లగా మారాయి/ అగ్ని గర్జించింది, దాని నాలుక దయలేనిది/ ఏ ఆశను వదలని మృగం/ ఇళ్లు కూలిపోయాయి, రాయి నుండి ధూళి వరకు/ మండుతున్న గాలులకు జ్ఞాపకాలు కోల్పోయాయి' అంటాడు భావోద్వేగంతో.

ముఖ్యంగా పర్యావరణ మార్పుల వల్ల సంభవించే వేడి, పొడి వాతావరణ పరిస్థితులే కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందడానికి కారణమౌతుంది. దీనివల్ల ఆ ప్రాంత జీవవైవిధ్యం దెబ్బతింటోంది. మొక్కలతో పాటు జంతుజాలానికి, సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు, ఉభయచరాలు, సరీసృప జాతుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. గడ్డి, ఇతర మొక్క జాతులు కాలిపోతున్నాయి. మరోవైపు మనుషుల ఆరోగ్యంపైనా కార్చిచ్చు తీవ్ర ప్రభావం చూపుతోంది. దట్టమైన పొగ అస్థిరమైన కర్బన సమ్మేళనాలు, ఓజోన్, విష వాయువులు, సూక్ష్మజీవులు కలిసి వుంటాయి. ఇవి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు ఆస్తమాను కలిగించవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. పొడి నేలల్లో ఉండే కోక్సిడియోయిడ్స్ ఇమ్మిటిస్, కోక్సిడియోయిడ్స్ పోసాడాసి వంటి బ్యాక్టీరియా, దుమ్ము, పొగతో మనుషుల్లోకి చొరబడతాయి. ఇవి జ్వరం, ఫ్లూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కలిగిస్తాయని కాలిఫోర్నియాలో వైల్డ్‌ల్యాండ్ అగ్నిమాపక సిబ్బందిపై జరిపిన ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ కార్చిచ్చులను నిలువరించాలంటే పర్యావరణ మార్పులకు కారణమౌతోన్న శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. వాతావరణ మార్పులను నిలువరించేందుకు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు ప్రపంచదేశాలన్నీ కలిసికట్టుగా కృషిచేయాలి. కార్చిచ్చుల వల్ల నాశనమైన అడవులను పునరుద్ధరించడంపై దృష్టి సారించాలి.

లెనిన్ ఓ..జ్ఞాపకం కాదు, వర్తమానం...



బండారు రమేష్
9490098251

"మనిషి కోసం మనిషి నడిచే చోటు ఒకటి ఉంటుందని
స్వేదం శిఖర సమానమయ్యే రోజు ఒకటి వస్తుందని
ఓల్గా నది ఒడ్డున మన కోసం కలలు కన్నవాడు
సైబీరియా కొండల్లో మన కోసం సమలోక ప్రణాళికను రచించినవాడు"

కామ్రేడ్ లెనిన్ జ్ఞాపకం కాదు.... వర్తమానం, మరణం ఎరుగని మార్క్సిస్టు జీవకణం..!!

లెనిన్ శత వర్ధంతిని 2024 జనవరి 21లో జరుపుకున్నాం. ఈ ఏడాదంతా శత వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాం.ఆయన సైద్ధాంతిక కృషిని,విప్లవ కార్యాచరణను ఈ సందర్భంగా అధ్యయనం చేశాం.అయితే ఈ కృషిని ఇంతటితో ఆపకుండా నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రతి కమ్యూనిస్టు తను ఉన్న స్థల కాలలను (భౌతిక పరిస్థితులను) సరిగా అర్థం చేసుకోవాలి. విస్తారంగా అధ్య యనం చేయాలి. ఈ కృషిని లెనిన్ జీవిత కాలమంతా చేశాడు. రష్యన్ సమాజాన్ని సమగ్రంగా అధ్యయనం చేశాడు. గ్రామీణ, పట్టణ ప్రాం తాల్లో కలియ తిరిగాడు. పంట పొలాల మధ్య, ఫ్యాక్టరీ గొట్టాల మధ్య నలిగిపోతున్న అశేష శ్రామిక ప్రజల్లోని వర్గ వైరుధ్యాలను, ఐక్యతలను అవగాహన చేసుకున్నాడు. భూ ఎస్టేట్ల యజమానుల, పెట్టుబడిదారీ వర్గాల బలాలను, బలహీనతను క్షుణ్ణంగా పరిశీలించాడు. ఈ మొత్తం సమగ్ర సాధారణ విషయాలను సైద్ధాంతీకరించాడు. గ్రంథాల రూపంలో ప్రపంచం ముందు ఉంచాడు. 23 సం.రాల వయసులోనే ,అంటే 1893లో లెనిన్ "రష్యన్ రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు" అనే మొదటి గ్రంథాన్ని రాశాడు.1894లో "ప్రజా మిత్రులు నిజస్వరూపం" అనే మరో గ్రంథాన్ని రాశాడు. రైతాంగం ఏక వర్గంగా లేదని, రైతాంగంలో స్పష్టమైన వర్గ విభజన ఉందని నిరూపించాడు.అలాగే 1899లో "రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి" అనే మహత్తర గ్రంథాన్ని రాశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిశ్రమల్లోనే కాక వ్యవసాయంలో కూడా ముందుకు వస్తోందని విశ్లేషించాడు.భూమి లేని గ్రామీణ ప్రజలు, స్వల్ప భూమి గల పేద రైతులు క్రమంగా పట్టణ కార్మికులుగా మారు తున్నారని చెప్పాడు. దేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతోందని తెలిపాడు. కేవలం రైతాంగమే విప్లవం తెస్తుందని వాదిస్తున్న నరోద్నిక్కుల సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. సంఖ్యరీత్యా చిన్నదైనా కార్మిక వర్గం ఆధునికమైనదని, అత్యంత చైతన్యవంతమైనదని తెలిపాడు.రైతాంగాన్ని, ఇతర శ్రామిక వృత్తిదారులని కలుపుకుని విప్లవానికి నాయకత్వం వహిస్తుందని సూత్రీకరించాడు. విప్లవం విజయవంతానికి "కార్మిక కర్షక మైత్రి" చారిత్రక అవసరమని నిర్ధారించాడు.

సూత్రీకరణలు - నిర్ధారణలతో ఆగిపోదామా?

కమ్యునిస్టులుగా మన చుట్టూ ఉన్న భౌతిక పరిస్థితులను అర్థం చేసుకుంటే సరిపోతుందా? సూత్రీకరణలు, నిర్ధారణలతో ఆగిపోదామా? శుద్ధ సైద్ధాంతిక చర్చలతో కాలాన్ని గడిపేద్దామా? లెనిన్ అలా చేశాడా? చేయలేదు కదా. కార్మిక కర్షక మైత్రి మానవ విముక్తికి మార్గమని నిర్ధారించుకున్న లెనిన్ 1895లోనే నాటి రష్యా రాజధాని సెయింట్ పీటర్స్ బర్గ్ పట్టణ కేంద్రంగా విప్లవ కార్యచరణను ప్రారంభించాడు. దేశంలోని అన్ని రకాల కార్మిక, కర్షక, విద్యార్థి,మేధావి బఅందాలను సమన్వయపరిచి "ఐక్య శ్రామిక విమోచన పోరాట సమితి" అనే సంస్థను ఏర్పాటు చేశాడు. ఇది ఒక రకంగా రష్యాలో విప్లవ కార్మిక వర్గ పార్టీ ఆవిర్భావానికి పునాది. ఈ సంస్థ ద్వారా లెనిన్ దేశవ్యాప్తంగా మార్క్సిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు.స్టడీ సర్కిల్స్ నిర్వహించాడు.ఏడేండ్లపాటు "అధ్యయన చర్చా" వేదికలను నడిపాడు. కజాన్ విశ్వ విద్యాలయం కేంద్రంగా యువ మార్క్సిస్టులకు సైద్ధాంతిక తర్ఫీదు ఇచ్చాడు. వారందరినీ స్థానిక కార్మిక కర్షక సంస్థల్లో చేరేలా ప్రోత్స హించాడు.విప్లవానికి అవసరమైన నిబద్ధత కలిగిన శ్రామిక వర్గ సైన్యాన్ని తయారు చేశాడు. ఉక్కు క్రమశిక్షణ కలిగిన రష్యన్ సోషల్ డెమో క్రటిక్ లేబర్ పార్టీ (ఆర్ఎస్‌డిఎల్‌పి) - (కమ్యూనిస్టు పార్టీ) నిర్మాణానికి పునాదులు వేశాడు.

ఆటంకాలను అవకాశాలుగా మార్చుకోవడం

సమాజాన్ని మార్చాలని ఉన్నత ఆశయం కలిగిన వాళ్లం,ఆటంకాలను చూసి అధైర్యపడ దామా? ఈ విషయంలో లెనిన్ మనకు ఏం నేర్పిస్తాడు? రష్యాలోని నాటి నిరంకుశ జారు ప్రభుత్వం నిత్యం లెనిన్‌ను వేటాడుతూ ఉండేది. అందులో భాగంగా 1897 ఫిబ్రవరి 13 నుండి 1900 జనవరి 29వ వరకు (3 సం.రాల పాటు) జారు ప్రభుత్వం లెనిన్ ను దేశ బహిష్కరణ చేసింది. తూర్పు సైబీరియాలో ఆయనకు ప్రవాస జైలు (జైలుశిక్షను) విధించింది.ఇంతటితో ఆగకుండా లెనిన్ అత్యంత ప్రమాదకర వ్యక్తి అని ఆయనను హత్య చేయాల్సిందిగా గూఢ చారులను ఆదేశించింది.జారీ ప్రభుత్వ కుట్రలను గమనించిన లెనిన్ జర్మనీలోని మ్యూనిచ్, లండన్ తదితర యూరప్ దేశాలకు వలస వెళ్లి ఐదేండ్లపాటు అజ్ఞాత జీవితాన్ని గడిపాడు. మరి మూడేండ్ల ప్రవాసకాలం, ఐదేండ్ల అజ్ఞాత కాలం లెనిన్ విప్లవ కార్యాచరణను ఆటంక పరిచిందా? జారు ప్రభుత్వం సృష్టించిన ఆటంకాలను, హత్యా ప్రయత్నాలు చూసి లెనిన్ అధైర్యపడ్డాడా? అలాగే లెనిన్ కేవలం జారు ప్రభుత్వ ఆటంకాలను కుట్రలను మాత్రమే ఎదుర్కొన్నాడా? కాదు. నరోద్నిక్కుల నుండి, ఆర్థిక వాదుల నుండి, సొంత పార్టీలోని మెన్షివిక్కుల నుండి సైతం ఆయన తీవ్రమైన దాడిని ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరికి తన రాజకీయ గురువు, రష్యన్ మార్క్సిస్టు పితామహుడిగా పేరున్న ప్లెఖనోవ్ లాంటి వారి నుండి సైతం లెనిన్ ఆటంకాలను ఎదుర్కొన్నాడు. ఒకానొక సమయంలో పార్టీలో ఒంటరి వాడిగా మిగిలిపోయాడు. అయితే ఈ ఆటంకాలన్నింటినీ లెనిన్ ధైర్యంగా ఎదుర్కొన్నాడు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆయుధంగా విసురుతూ అంతర్గత బాహ్య శత్రువుల ఆటంకాలను,కుట్రలను తుత్తునియలు చేశాడు. ఆయుధాన్ని విసరడంలో కూడా ఆయన అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించాడు.ఆ నైపుణ్యమే "నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణ". లెనిన్ అభివృద్ధి పరిచిన ఈ అద్భుత మార్క్సిస్టు నైపుణ్యాన్ని ప్రతి కమ్యూనిస్టు అలవర్చుకోవాలి.నిత్య కార్యాచరణలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించాలి.

ఈ నైపుణ్యంతోనే లెనిన్ విప్లవ విజయవంతానికి పార్టీ ఎంత అవసరమో గుర్తించాడు. అందులో భాగంగానే "రష్యన్ సోషల్ డెమొక్రట్ల (కమ్యూనిస్టుల) కర్తవ్యాలు" అనే పుస్తకాన్ని రాశాడు.విప్లవ కార్యచరణకు ఐక్య కార్మిక వర్గ పార్టీ నిర్మాణం అవసరమని, దాని కర్త వ్యాలు ఎలా ఉండాలో చర్చ చేశాడు.అందుకు అవసరమైన సైద్ధాంతిక రచన చేయాలని భావించాడు.అదే ఆయన 1902లో రాసిన ప్రామా ణిక గ్రంథం "ఏమి చేయాలి?" కార్మికవర్గం కేవలం ఆర్థిక పోరాటాలు చేయాలని,రాజకీయ పోరాటాన్ని పెట్టుబడిదారీ వర్గానికి వదిలివేయాలని "ఆర్థికవాదులు" చేసిన అశాస్త్రీయ వాదనలను లెనిన్ ఈగ్రంథంలో తిప్పికొట్టాడు. ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలతో మాత్రమే విప్లవం రాదని, విప్లవ సాధనకు ఉక్కు క్రమశిక్షణ కలిగిన రాజకీయ సంస్థ (పార్టీ) అవసరం అని నిర్ధారించాడు. అలాగే కార్మిక వర్గానికి నిత్యం అందే ఆర్థిక చైతన్యాన్ని కమ్యునిస్టు పార్టీ రాజకీయ చైతన్యంగా, చివరికి సోషలిస్టు చైతన్యంగా మార్చాలని నిర్దేశించాడు. సోషలిస్టు చైతన్యం రోజు వారి యాదృచ్ఛిక పోరాటాలు, ఉద్యమాల ద్వారా రాదని, బయట నుంచి ప్రత్యేకంగా అందించాలని చెప్పాడు. అందుకు పార్టీ ప్రత్యేకమైన కృషి చేయాలని తెలిపాడు.

నిరాశ విప్లవ లక్షణం కానే కాదు

కమ్యునిస్టులకు ఓట్లు రావడం లేదు.సీట్లు గెలవడం లేదు. ప్రజలు కమ్యూనిస్టులను ఆదరించడం లేదు.కమ్యూనిస్టుల పని అయిపోయింది.ఇలాంటి మాటలను నేడు మనం నిత్యం వింటున్నాం. అక్కడక్కడా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ స్థాయిల్లో సైతం, ఇంకా ఏం చేస్తాంలే...గతంలో చేసాం. అప్పుడు ప్రజలు మనల్ని ఆదరించారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇలా నిరాశ నిస్పృహ,నైరాశ్యంతో కూడిన చర్చలు జరుపుతున్నారు. నిరాశ విప్లవ కార్యాచరణకు అసలు సిసలు ఆటంకం. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషణ చేయలేకపోవడం వల్లనే నిరాశ మనల్ని చుట్టు ముడుతుంది. మరి నిరాశ , విప్లవ నైర్యాశ్యం మన కాలానికి మాత్రమే సంబంధించినదా? లెనిన్ ఈ పరిస్థితులని ఎదుర్కోలేదా? ఎదుర్కొన్నాడు. అయితే లెనిన్ నిరాశని "విప్లవ విశ్వాసంతో" అధిగమించాడు.నైరాశ్యం విప్లవ లక్షణం కాదని నిరూపించాడు.



> కమ్యునిస్టులకు ఓట్లు రావడం లేదు.సీట్లు గెలవడం లేదు. ప్రజలు కమ్యూనిస్టులను ఆదరించడం లేదు.కమ్యూనిస్టుల పని అయిపోయింది. ఇలాంటి మాటలను నేడు మనం నిత్యం వింటున్నాం. అక్కడక్కడా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ స్థాయిల్లో సైతం, ఇంకా ఏం చేస్తాంలే...గతంలో చేసాం. అప్పుడు ప్రజలు మనల్ని ఆదరించారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇలా నిరాశ నిస్పృహ,నైరాశ్యంతో కూడిన చర్చలు జరుపుతున్నారు. నిరాశ విప్లవ కార్యాచరణకు అసలు సిసలు ఆటంకం. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషణ చేయలేకపోవడం వల్లనే నిరాశ మనల్ని చుట్టు ముడుతుంది. మరి నిరాశ , విప్లవ నైర్యాశ్యం మన కాలానికి మాత్రమే సంబంధించినదా? లెనిన్ ఈ పరిస్థితులని ఎదుర్కోలేదా? ఎదుర్కొన్నాడు. అయితే లెనిన్ నిరాశని "విప్లవ విశ్వాసంతో" అధిగమించాడు.నైరాశ్యం విప్లవ లక్షణం కాదని నిరూపించాడు.

అందుకు ఆయన జీవితకాల కృషిలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. ముఖ్యంగా 1905 సం.లో రష్యాలో బూర్జువా విప్లవం విఫలం అయినప్పుడు మొత్తం కార్మికవర్గ శ్రేణులు, పార్టీ సభ్యులు,కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. నిరంకుశ జారు ప్రభుత్వ అణిచివేత చర్యలను తట్టుకోలేక విప్లవ శ్రేణులు చెల్లాచెదురయ్యాయి. పార్టీ సభ్యులు సైతం పెద్ద ఎత్తున సభ్యత్వాన్ని వదులుకున్నారు.అయితే ఈ స్థితిని చూసి లెనిన్ బెంబేలెత్తిపోలేదు.ఇక ఏం చేస్తాంలే అని....జెండా వదిలేయలేదు. ఆ నిరాశ , నిస్పృహ స్థితిని శాస్రీయంగా విశ్లేషించాడు. బూర్జువా విప్లవం పూర్తిగా విఫలం కాలేదని నిర్ధారించాడు. అసలు ఏ ప్రజా పోరాటం అయినా విఫలం కాదని వాదించాడు.ప్రతి ప్రజా పోరాటం భవిష్యత్ పోరాటాలకు ఊతమిస్తుందని పేర్కొన్నాడు. అయితే అది అన్నిసార్లు పైకి కనిపించదని విశ్లేశించాడు.1905లో జరిగిన బూర్జువా విప్లవం పూర్తిగా విఫలం కాలేదని, ఇది భవిష్యత్తు సోషలిస్టు విప్లవానికి "డ్రస్ రిహార్సల్ " అని పేర్కొన్నాడు. ఈ శాస్త్రీయ అవగాహన నుంచే లెనిన్ 1907 నుండి 1914 వరకు కార్మిక కర్షక శ్రేణులను ఉత్సాహపరిచాడు. "అంతిమ విజయం మనదేనని ప్రజలదేనని" ప్రకటించాడు.

అందిన అవకాశాన్ని అసలే వదులుకోవద్దు

విప్లవ కార్యాచరణలో ఉన్న ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తకి, పార్టీకి కొన్ని సందర్భాల్లో అద్భుతమైన అవకాశాలు వస్తాయి. ఆ సమయంలో వాటిని అందుకోలేకపోతే, సక్రమంగా వినియోగించుకోకపోతే వెనకబడిపోతాం. దశాబ్దాల పాటు చేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోతుంది.1914 లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధాన్ని యూరప్‌లోని అన్ని సోషల్ డెమోక్రటిక్ (కమ్యునిస్టు పార్టీలు) జాతీయ వాద యుద్ధాలుగా భావించాయి. ఒక్క సెర్బియా కమ్యునిస్టు తప్ప. కానీ లెనిన్ ఈ యుద్ధం "సామ్రాజ్యవాద యుద్ధం" అని సూత్రీకరించాడు. కార్మికవర్గ శత్రువులైన పెట్టుబడిదారులు తమలో తాము ప్రపంచాన్ని లాభాల కోసం పంచుకోవాలని యుద్ధానికి తెగబడుతున్నాయని, ఇది కమ్యునిస్టులకు అద్భుత అవకాశం అని తెలిపాడు. ఈ సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్గత యుద్ధాలుగా మార్చాలన్నాడు. తన వాదనను శాస్త్రీయంగా నిరూపించడం కోసం 1916లో "సామ్రాజ్య వాదం-పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ" అన్న గ్రంథాన్ని రాశాడు.అయితే లెనిన్ చేసిన విశ్లేషణను అర్థం చేసుకోకుండా దాదాపు అన్ని కమ్యూనిస్టు పార్టీలు "కుహనా దేశభక్తి మురికి కూపంలో" మునిగిపోయాయి. లెనిన్ మాత్రం అందిన అవకాశాన్ని అద్భుతంగా వినియోగించాడు.అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రచించాడు.1917 మార్చి 8వ తేదీన, అంటే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రష్యన్ బోల్షివిక్ పార్టీని కదం తొక్కించాడు. నిరంకుశ జారు ప్రభుత్వాన్ని కూల దోశాడు.బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతం చేశాడు.

1917 మార్చిలో విజయవంతమైన బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని లెనిన్ సోషలిస్టు విప్లవంగా మార్చాలని భావించాడు. అయితే మెన్షివిక్కులు ఇతర కామ్రేడ్స్ లెనిన్ ఆలోచనలను తీవ్రంగా వ్యతిరేకించారు. సోషలిస్ట్ విప్లవం ఇప్పుడు అసాధ్యమని వాదించారు. లెనిన్ మాత్రం సోషలిస్ట్ విప్లవానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్ధారించాడు. కార్యాచరణ ప్రణాళికను బోల్షివిక్ పార్టీ కేంద్ర కమిటీలో ప్రతిపాదించాడు. ఆ ప్రతిపాదనే "ఏప్రిల్ థీసిస్"గా ప్రసిద్ధి చెందింది. పెట్టుబడిదారీ వర్గం చేతిలోని అధికారాన్ని శ్రామిక వర్గం అందిపుచ్చుకోవాలని పేర్కొన్నాడు.అయితే లెనిన్ చేసిన విశ్లేషణలను బోల్షివిక్ పార్టీలోని పొలిట్ బ్యూరో సభ్యులు సైతం సరికావని కొట్టిపడేశారు. చివరికి లెనిన్ జీవిత సహచరి కామ్రేడ్ కృపస్కయ సైతం లెనిన్‌కు "పిచ్చిగాని పట్టలేదు కదా" అని వ్యాఖ్యానించింది. అయినా లెనిన్ అందివచ్చిన అవకాశాన్ని కచ్చితంగా వినియోగించుకోవాల్సిందే అనే నిర్ణయించాడు. 1917 అక్టోబర్ 7న పెట్రోగాడ్‌కి చేరుకొని విప్లవానికి ప్రత్యక్ష నాయకత్వం వహించాడు.బోల్షివిక్ పార్టీ శ్రేణులను ముందుకు నడిపాడు.తొలి సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేశాడు. అంతేకాక విప్లవం విజయవంతమైన తర్వాత విప్లవ వ్యతిరేక శక్తులను ధీటుగా ఎదుర్కొన్నాడు. సోషలిజం ఫలితాలను ప్రజలకు అందించేందుకు ప్రణాళికలు రచించాడు. మనలాంటి వలస దేశాల్లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటాలకు స్ఫూర్తినిచ్చాడు.

మానవాళి శ్రేయస్సు కోసం విరామమెరుగక శ్రమించిన విప్లవకారుడు చివరికి 1924 జనవరి 21వ తేదీన తుదిశ్వాస విడిచాడు. కేవలం 54 సం.రాలు మాత్రమే జీవించి "మా సిద్ధాంతం పిడివాదం కాదు అది ఆచరణకు కరదీపిక" అన్న మార్క్స్,ఎంగిల్స్‌ల మాటల్ని నిజం చేసి చూపించాడు కామ్రేడ్ లెనిన్. ఆయన మరణించి వంద సంవత్సరాలు అయినా, ప్రతి ప్రజా పోరాటంలో తాను మనతో కలిసి నడుస్తున్నాడు.మనల్ని నడిపిస్తున్నాడు. విప్లవ కార్యాచరణలో ఆటంకాలు వచ్చినప్పుడల్లా, నిరాశ మనల్ని చుట్టు ముట్టినప్పుడల్లా మనకు గుండెధైర్యాన్ని అందిస్తున్నాడు. ఓమహత్తర "విప్లవ పాఠ్య పుస్తకమై" మన "కార్యాచరణ గ్రంథాలయంలో" మొదటి వరుసలో నిలబడుతున్నాడు.ఆయన ఆశయ సాధనకు నిరంతరం..'విప్లవ పయనం' చేయడమే ఆయనకు కమ్యూనిస్టు కార్యకర్తలుగా మనమిచ్చే నిజమైన నివాళి.

(కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా)

అధ్వాన్న స్థాయికి ఆర్థిక మందగమనం



PEOPLE'S DEMOCRACY

అధికారికంగా ప్రకటించే జీడీపీ పెరుగుదల లెక్క అనుమానాస్పదంగా వుంటోంది. ఎందుకంటే వినియోగ దారుల ధరల సూచి ఆధారంగా తీసే లెక్కల్లో నాలుగో వంతు కూడా లేని అంతర్గత ద్రవ్యోల్బణ భావన ప్రాతిపదికగా అది రూపొందుతున్నది. ఈ విధంగా వండిన లెక్కలతో కూడినదే అయినా అది కూడా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడిందనే వాస్తవం మాత్రం దాచలేనిదిగా తయారైంది. 2024-25కు సంబంధించి తాజాగా విడుదలైన జీడీపీ అంచనాలు కూడా అదే చెబుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇండియా జీడీపీ పెరుగుదల 6.4 శాతం వుంటుందని ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది ఇది 8.2 శాతం పెరుగుదలతో దీన్ని పోల్చవలసి వుంటుంది. ఇంతకన్నా ముందు మూడవ త్రైమాసికంలో ఈ పెరుగుదల రేటు 5.4 శాతం వుండింది.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే దేశంగా ఇండియా ఆవిర్భవించిందనే మాటలు చాలా వినిపిస్తుంటాయి. 2027 నాటికి దేశం 5 లక్షల కోట్ల ఆలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందనీ చెబుతుంటారు. ఇవన్నీ ఏమైనా వాస్తవాలు మాత్రం పూర్తి భిన్నంగా వున్నాయి. నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, తక్కువ స్థాయి ప్రయివేటు పెట్టుబడులు, స్తంభించిపోయిన వినియోగదారీ వ్యయం, చిన్న చిల్లర రుణాల చెల్లింపులో వైఫల్యాల పెరుగుదల, ఉత్పత్తి రంగం పడిపోతుండటం ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆర్థిక విధానాల దివాళాకోరుతనానికే సంకేతాలుగా వున్నాయి.

మూల కారణమేంటి?

ఆర్థిక మందగమనం కొనసాగుతుండటానికి ప్రధాన కారణం వ్యవస్థలో గిరాకీ లేకపోవడమే. అల్పిష్టి ఆదాయాలుగల ప్రజలకు కొనుగోలు శక్తి లేకుండా పోయిన ఫలితమిది. 2023-24 సంవత్సరానికి గాను ఇటీవలే విడుదల చేసిన గృహాల వినియోగ వ్యయం వివరాలు చూస్తే నలుగురు సభ్యులున్న ఒక కుటుంబం నెలవారీ సగటు ఖర్చు పల్లెల్లోనైతే రూ.8,079, పట్టణాలలోనైతే రూ.14,528 మాత్రమేనని తేలింది. పెరిగిపోయే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం దీన్ని మరింత జటిలంగా మారుస్తున్నాయి. వాటి వల్ల ఆదాయాలు హరించుకుపోతున్నాయి. గిరాకీ కొరవడిన పరిస్థితి ఉత్పత్తిని దెబ్బతీస్తుంది. కొత్తగా పెట్టుబడులు పెట్టి ఉత్పాదక సామర్థ్యాలు పెంచాలనే ఆసక్తి లేకుండా పోతుంది. మరోవైపున ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ అక్టోబర్ నెలల్లో దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్.డి.ఐలు) ప్రవాహాలు చూస్తే పన్నెండేండ్ల కాలంలో ఎన్నడూ లేనంత దిగువకు పడిపోయాయి. ఇక బయిటకు తరలిపోయే వాటిని గనక చూస్తే విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు వాటిని దేశం నుంచి తీసుకుపోవడం పెరిగింది. భారతీయ కంపెనీలు వీదేశాలలో పెట్టుబడులు పెట్టడం కూడా పెరగడం దీన్ని మరింత సంక్లిష్టం చేసింది. ఎన్ని గొప్పలు చెప్పినా భారతీయ కార్పొరేట్లకు స్వదేశం కన్నా విదేశాల్లో పెట్టుబడులు పెట్టడమే ఎక్కువ ఆకర్షణగా కనిఎస్తున్నది. విలువ కోల్పోతూ డాలర్‌కు 86కు చేరిన భారతీయ రూపాయి ఇప్పటికే వున్న సమస్యలను మరింత దుర్భరం చేయబోతున్నది. దాని వల్ల దిగుమతులు ఖరీదవడం, ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోయడం జరుగుతుంది.

బడా సంపన్నులకే సేవ

బడా వ్యాపార వ్యవస్థలకు అనుకూలమైన ప్రభుత్వ పాక్షిక విధానాలు అసమానతలను ఎగదోస్తున్నాయి. దానివల్ల ప్రయివేటు పెట్టుబడులు అభివృద్ధి దెబ్బ తింటున్నాయి. బిలియనీర్ ప్రమోటర్ల క్లబ్బులో గత ఏడాది చివరన 157 మంది వుంటే 2024లో ఆ సంఖ్య రికార్డు స్థాయిలో 201కి పెరిగింది. వారి మొత్తం సంపద కలిసి మొదటిసారిగా లక్ష కోట్ల డాలర్లు దాటింది. ఆదాయాల తగ్గుదల, పెరిగిపోతున్న వ్యయాలు, హద్దూ ఆపూ లేని నిరుద్యోగంతో ప్రజలపై భారాలు పెంచుతూ అంతకంతకూ తీవ్రమవుతున్న సంక్షోభాన్ని ఎలా పరిష్కరించాలనే విషయమై ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో వుంది.

షరా మామూలే?

మోడీ ప్రభుత్వ తీరును గమనిస్తే వచ్చే 2025-26 బడ్జెట్ కూడా ఇప్పటి వరకూ అది ఏఏటికా ఏడాది కుమ్మరిస్తున్న తరహా విధానాలే మరింత పెంచే విధంగా ముగుస్తుంది. కార్పొరేట్ల మీద బడా సంపన్నుల మీద పన్నులు పెంచి మౌలిక సదుపాయాలు వ్యవసాయ రంగాల్లో పభుత్వ పెట్టుబడులు పెంచి, చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ఇప్పుడు జరగాల్సి వుంటుంది. ప్రస్తుతం జీడీపీలో ఏడు శాతం మాత్రమే వున్న సంక్షేమ రంగ వ్యయాన్ని పెంచడం అవసరం, ఈ చర్యలు తీసుకోకపోతే ఆర్థిక పునరుద్ధరణ గానీ, ప్రజలకు ఉపశమనం కలిగే అవకాశాలు శూన్యమే అవుతాయి.

(జనవరి 15 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

మనుగడ కోసం ఆదివాసీల పోరాటం



పూసం సచిన్
6281128872

ఓ వైపు కేంద్ర ప్రభుత్వం అడవులను భక్షిస్తూ, చట్టాలను బడా కార్పొరేట్ల కోసం సవరిస్తూ మైనింగ్ నాన్‌మైనింగ్ పేరుతో 'జల్ జంగల్ జమీన్' నుండి ఆదివాసీలను తరిమికొడుతున్నది. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం మార్గదర్శకత్వంలోనే నడుచుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. మన పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణ ఈ ఏడాది విస్తారమైన ప్రాంతంలో రద్దు చేసింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశించింది. వందల కోట్ల రూపాయల ఉపాధిని ఆదివాసీలు, పేదలు వేసవి సీజన్‌లో కోల్పోబో తున్నారు. మన రాష్ట్రంపై దీని ప్రభావం ఎలా ఉండబోతున్నదనేది ఆందోళనకరమైన అంశం. గతేడాది కొమురంభీమ్ జిల్లాలో తునికాకు సేకరణ రద్దు నిర్ణయాన్ని వెనక్కి కొట్టడానికి పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. తెలంగాణలో నూతనంగా కాంగ్రెస్ ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ గిరిజన శాఖకు మంత్రిని కూడా నియమించలేదు. గిరిజన శాసనసభ్యులతో కూడిన ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ (టిఏసి) సమావేశాలు అస్సలు జరగ టం లేదు. ఐటిడిఎ పాలక మండలి సమావేశాలు లేనేలేవు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత పాలమూరు ఉమ్మడి జిల్లా మన్ననూరు ఐటిడిఏకు రెగ్యులర్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఐఏఎస్ అధికారి)లేకపోవటం గిరిజనుల పట్ల నిర్లక్ష్యానికి, వివక్షకు పరకాష్ఠ.

గత కేసీఆర్ ప్రభుత్వం పోడుభూముల సాగుదారులపై నిర్బంధం ప్రయోగించినప్పటికీ చివరిలో నాలుగున్నర లక్షల ఎకరాలకు హక్కు పత్రాలివ్వడం సానుకూలమైన అంశం. అయితే తర్వాత జరిగిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ పోటీ పడి తమ మ్యానిఫెస్టోలో పెండింగ్‌లో ఉన్న మొత్తం సమస్యలు పరిష్కారం చేస్తామని హామీలిచ్చాయి. నేటివరకు అధికార పార్టీ పోడు భూముల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వెంటనే హామీ అమలు కోసం రోడ్ మ్యాప్ ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్), వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఉద్యమానికి కూడా సిద్ధమవుతున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీల పట్ల అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలను ఇక్కడ కొనసాగించాలని చూస్తే ప్రతిఘటన మాత్రం తప్పదు. ఇంకా ఎనిమిది లక్షల ఎకరాలకు హక్కు పత్రాలివ్వాల్సి ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తోంది. హక్కుపత్రాలు, అలాగే ఇతర డిమాండ్ల సాధనకు ఆదివాసీలు గత కొంతకాలంగా వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తూనే ఉన్నారు. నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు.



ఆదివాసీలు డిమాండ్ చేస్తున్న అంశాలు

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దశాబ్దాల నుండి నివాసముంటున్న ఎస్టీ కోయ ఆదివాసి షెడ్యూల్ తెగలకు చెందిన గొత్తి కోయ వలస ఆదివాసీలకు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. వారు పుట్టుకతో ఆదివాసీలు అయినప్పటికీ ఎటువంటి ప్రభుత్వ పథకాలు వీరికి అందటం లేదు. ప్రభుత్వం చర్చించి వీరికి తగిన న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకోవాలి. తునికాకు లభ్యమయ్యే అన్ని యూనిట్లలో ఆకు సేకరణ జరిగేలా టెండర్లు వెంటనే నిర్వహించాలి.అలాగే తునికాకు కార్మికులకు అటవీశాఖ నుండి రావాల్సిన బోనస్' బకాయిలను వెంటనే చెల్లించాలి. ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున అవతవకలు జరుగుతున్నందున నగదు రూపంలో గ్రామసభలో డబ్బులు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలి, కట్టరేటు రూ.5లు నిర్ణయించాలి.నకిలీ కులధృవీకరణ, ఏజెన్సీ ధృవీకరణ పత్రాలపై ఐటీడీఏల ద్వారా విచారణ చేసి, నకిలీ ధృవపత్రాలను జారీచేసిన అధికారులపై కేసులు పెట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. రైతు రుణమాఫీ ఆదివాసీలకు అందకుండా పోవడానికి కారణమైన అవకతవకలను సరిచేసి న్యాయం చేయాలి. తప్పు చేసిన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఆదివాసి రైతులను అనర్హులుగా చేయడం సరికాదు. దీన్ని పరిష్కరించడానికి ప్రతి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ, బ్యాంకర్లతో ఉమ్మడి యంత్రాంగం ఏర్పాటు చేయాలి. ఏజెన్సి డీఎస్సీని ప్రకటించి, ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలి. జీవో ఎంఎస్ నెం.3 పునరుద్ధరణ కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేయాలి.


యాభై శాతానికి పైగా ఆదివాసీ జనాభా ఉన్న, అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి ఐదో షెడ్యూల్‌లో కలపాలి.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల అమలు ఆదివాసీ ప్రాంతాల నుండి అమలు చేయడానికి ప్రాధాన్యతనిచ్చి, ప్రారంభించాలి. అటవీశాఖ అభ్యంతరాల వల్ల పెండింగ్‌లో ఉన్న గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణం, మంచినీటి పథకాలు బోర్‌వెల్స్, త్రీపేస్ కరెంట్ సదుపాయాలు నిలిచిపోయినందున త్వరగా పరిష్కరించాలి. ఉట్నూర్, భద్రాచలం గిరిజన బీఎడ్ కళాశాలలతో సహా, అన్ని విద్యాసంస్థలో ఖాళీగా ఉన్న భోదన, భోదనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి.ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌కు చెందిన మన్ననూర్ ఐటీడీఏకు రెగ్యులర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో)ను నియమించి పూర్తి స్థాయి ఐటీడీఏగా తీర్చిదిద్దాలి. పీవీటీజీ ఆదివాసి చెంచు తెగ పరిరక్షణ కోసం ప్రత్యేకమైన కృషి చేపట్టాలి. ఏజెన్సి ప్రాంతాల్లో నియోజక వర్గ కేంద్రాలుగా నర్సింగ్ కళాశాలలు, డిఎడ్ కళాశాలలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి.రాష్ట్రస్థాయిలో గిరిజన సలహామండలి టీఏసీ సమావేశాలు జిల్లా స్థాయిలో ఐటీడీఏ పాలక మండలిలోనూ నిర్వహించాలి. సమస్యల్ని ఎజెండాలుగా పెట్టి చర్చించాలి. ప్రతిసమావేశంలో వీటి అమలుకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్) ఆధారంగా చర్చించాలి. గిరిజన సంక్షేమ శాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలి. ఐటీడీఏలను బలోపేతం చేసి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి.అన్నిరకాలుగా బలహీనమైపోయిన ఆదివాసీల సంక్షేమ అభివృద్ధికి పైన తెలిపిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా అసెంబ్లీలో చర్చ చేపట్టాలి. ఆదివాసీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో ప్రజాపోరాటాలతోనే ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం. ■

'ఆట' ముగుస్తోంది..

- సినిమా థియేటర్ల పరిస్థితి ప్రశ్నార్థకం ?
- కార్మికుల పొట్టగొడుతున్న మల్టీప్లెక్స్, ఓటీటీలు
- మూడు స్లాబ్‌లు రెండు స్లాబ్‌లకు కుదింపు
- గ్రామీణ థియేటర్లకు మంగళం..

ఆట ముగిసిపోతోంది.. "నేడే చూడండి" అనే మాటకు కాలం చెల్లిపోయే దశకు చేరింది. సింగిల్ స్క్రీన్‌లకు గడ్డు కాలం దాపురించింది.. మూడు స్లాబ్‌ల టికెట్ ధరలు రెండు స్లాబ్‌లకే పరిమితమయ్యాయి.. సినిమా థియేటర్లలో చిరుతిండ్లు, శీతల పానీయాలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ థియేటర్ల నిర్వహణ కష్టతరంగా మారింది.. సినిమా థియేటర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మూసివేత దిశలో ఉన్నాయి. మల్టీప్లెక్స్ థియేటర్లు, ఓటీటీ ప్లాట్‌పామ్‌లు, అధునాతన టీవీలు, సినిమా హాళ్లకు పోటీగా వచ్చాయి. బహుళ జాతి కంపెనీలు కార్పొరేట్ శక్తులు సినిమా ప్రపంచంలోకి అడుగు పెట్టాయి. మల్టీప్లెక్స్ ధరలు పెట్టి టికెట్లు కొనలేక.. చిరుతిళ్లు తినలేక మధ్యతరగతి ప్రేక్షకులు దూరమవుతున్నారు. క్రమంగా థియేటర్లు మూతపడుతున్నాయి.

'నేడే చూడండి'కి కాలం చెల్లు! / 'సింగిల్ స్క్రీన్'లకు గడ్డుకాలం



నవతెలంగాణ-మహబూబాబాద్

మల్టీప్లెక్స్ మాయాజాలం..

మల్టీప్లెక్స్ మాయాజాలం మూలంగా సింగిల్ స్క్రీన్ చిన్న సినిమా థియేటర్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. మల్టీప్లెక్స్‌లో సినిమా టికెట్ల ధరలు అడ్డగోలుగా పెంచేసి అమ్ముకుంటున్నారు. గతంలో పేదలకు ఒక స్లాబ్, మధ్యతరగతి ప్రజలకు ఒక స్లాబ్, ధనవంతులకు ఒక స్లాబ్ చొప్పున మూడు రకాల టికెట్ చార్జీలు ఉండేవి. ఇప్పుడు మల్టీప్లెక్స్‌లో రెండే స్లాబ్‌లు ఏర్పాటు చేశారు. వెయ్యి మంది కూర్చునే సినిమా థియేటర్‌లో 50 మందికి మాత్రమే ఫస్ట్ స్లాబ్ ఇచ్చి.. 950 మందికి బాల్కనీ స్లాబ్ చొప్పున అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సినిమా థియేటర్ క్యాంటీన్‌లో బహిరంగ దోపిడీ జరుగుతోంది. చిరు తిండ్లు, శీతల పానీయాలపై అక్రమంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కొత్త సినిమా విడుదల అయినప్పుడు పది రోజుల నుంచి 15 రోజుల వరకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఒకప్పుడు 100 రూపాయలు ఉంటే సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో కుటుంబం మొత్తం ఆనందంగా సినిమా చూసి వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ఉపాధి కోల్పోతున్న కార్మికులు

చిన్న సినిమా థియేటర్లు మూతపడటం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. మధ్యతరగతి ప్రజలు వినోదానికి దూరమవుతున్నారు. ఒక్కో థియేటర్‌లో ఆపరేటర్లుగా, క్యాంటీన్ వర్కర్లుగా, సైకిల్ స్టాండ్, కార్ స్టాండ్ వర్కర్లుగా, గేట్ కీపర్‌గా, స్వీపర్లుగా 30 మందికి పైగా పని చేసేవారు. థియేటర్‌లు మూసేయడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మల్టీప్లెక్స్‌లలో చిరుతిండ్ల వ్యాపారం కూడా బడా కార్పొరేట్ సంస్థలే చేస్తున్నాయి. బొంగు పేలాలతోపాటు చిన్న చిన్న వాటికి కూడా భారీగా జీఎస్‌టీ దండుకుంటున్నారు.

15 సినిమా థియేటర్లు మూత

రాష్ట్ర వ్యాప్తంగా 450 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఒకప్పుడు 24 సినిమా థియేటర్లు ఉండగా, ప్రస్తుతం అందులో 15 మూతపడ్డాయి. దశాబ్ద కాలంగా మల్టీప్లెక్స్‌లు, ఓటీటీ యాప్‌లు, గూగుల్ 4కే టీవీలు వచ్చాయి. ఇదే సమయంలో కరోనా మూలంగా కూడా వరుసగా సినిమా థియేటర్లు మూతపడ్డాయి. మరిపెడలో థియేటర్ ఎరువుల గోదాముగా మారిపోయింది. కురవిలో ఉన్న థియేటర్ మూతపడి శిథిలమైంది. గార్ల మండల కేంద్రంలో ఉన్న థియేటర్‌ను కూల్చేసి ప్లాట్లుగా చేసి విక్రయించారు. తొర్రూర్‌లోనూ ఒక థియేటర్ మూతపడి శిథిలమవుతోంది. ఇలా నెల్లికుదురు, బయ్యారం, గూడూరులో మూతపడ్డాయి. కేసముద్రంలో మూడు ఉండగా, రెండు మూతపడ్డాయి. మరొక దానిని పశువుల శాలగా మార్చేశారు. నర్సింహులపేటలో ఉన్న రెండు సినిమా థియేటర్లు మూతపడగా అందులో ఒకదాంట్లో రైస్ మిల్లు నడుస్తోంది. డోర్నకల్‌లో ఉన్న ఏకైక థియేటర్ శిథిలమైపోతోంది. రాష్ట్ర వ్యాపితంగా చాలా థియేటర్ల పరిస్థితి ఇలాగే ఉంది. మల్టీప్లెక్స్‌లు ఎక్కువ కావడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్లను వదిలేశారు. గతేడాది పది రోజులపాటు సింగిల్ థియేటర్లను యాజమాన్యాలు మూసివేశాయి. సినిమాలు లేకపోవడం, ప్రేక్షకుల సంఖ్య తగ్గడం, స్లాబు రేట్ల కారణాలతో నష్టాలు వస్తున్నాయి.

ప్రస్తుతం నడుస్తున్న సినిమా థియేటర్లను కూడా కార్పొరేట్ కంపెనీలు గుత్తాధిపత్యంతో లీజుకు తీసుకొని నడిపిస్తున్నాయి. వాటిల్లో స్థానికులకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను, ఆపరేటర్లను తీసుకొచ్చి పని చేయించుకుంటున్నారు. సినిమా థియేటర్లలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, టికెట్ ధరలు తగ్గించాలని, ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, అన్ని రకాల చిరుతిళ్లు, పానీయాలు ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని కార్మిక సంఘాల నేతలు, కార్మికులు, సినిమా ప్రియులు కోరుతున్నారు.

హౌసింగ్ బోర్డ్ దుకాణ సముదాయాలను కాపాడాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ - ముషీరాబాద్

శిథిలమైపోతున్న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు దుకాణాలను కాపాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాగ్‌లింగంపల్లి లోని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన 51 దుకాణాలు 15 ఏండ్ల కిందట మూతపడ్డాయన్నారు. ఆ దుకాణాలను ఎవరికీ కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టడంతో నిర్వహణ లేక భవనాలు పూర్తిగా శిథిలమైపోతున్నాయని తెలిపారు. కొన్ని ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. హౌసింగ్ బోర్డుకు, దుకాణాదారులకు మధ్య ఏర్పడిన సమస్య కారణంగా వాటిని మూసేశారని తెలిపారు. దీని వల్ల ప్రజాధనం వృథా అవుతోందన్నారు. దుకాణాలను కిరాయిదారులకి కేటాయించాలని గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ అమలు కాలేదన్నారు. తదనంతరం వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎటూ తేల్చలేదని, స్థానిక ఎమ్మెల్యే కనీసం ఈ సమస్యపై పట్టించుకున్న దాఖలాలూ లేవని అన్నారు. స్థానిక కార్పొరేటర్‌కు కనీసం అవగాహన కూడా లేదన్నారు. లక్షల రూపాయల ఆదాయం వచ్చే దుకాణాలు మూసేయడంతో రిపేర్లు చేయడానికి నిధులు లేక ఆక్రమణల నుంచి కాపాడుకోలేని దుస్థితిలో హౌసింగ్ బోర్డు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే తగు నిర్ణయం తీసుకొని దుకాణాలకు ఓ రేటు నిర్ణయించి వ్యాపారస్తులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, జోన్ కార్యదర్శివర్గ సభ్యులు కె.రమేష్, కార్యదర్శి ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్ కాదు.. తెలంగాణ జనతా గ్యారేజ్

- కార్మిక విభాగానికి పార్టీ లీగల్‌సెల్ అండగా ఉంటుంది : బీఆర్ఎస్ కార్మిక విభాగం డైరీ ఆవిష్కరణలో కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇది తెలంగాణ భవన్ కాదనీ, తెలంగాణ జనతా గ్యారేజ్ అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) అన్నారు. కార్మిక విభాగానికీ తమ పార్టీ లీగల్ సెల్ అండగా ఉంటుందని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం డైరీని ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ కార్మిక విభాగం పోరాడుతున్నదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక 15 రోజుల్లోనే హమాలీలను పిలిపించుకుని ఎనిమిది రూపాయలున్న హమాలీ కూలీని రూ.26 చేశారని గుర్తుచేశారు. కరోనా కాలంలో 35 లక్షల మంది వలస కార్మికులకు భోజనం పెట్టి వారు గమ్యస్థానాలకు చేరేందుకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారనీ, ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున సహాయం చేశారని తెలిపారు. బీడీ, సఫాయి, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, సీఎం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆనాటి పాలకులు అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కిస్తే కేసీఆర్ సీఎం అయ్యాక మూడు రెట్ల జీతం పెంచారని గుర్తుచేశారు. ఆశాలకు నాలుగురెట్ల గౌరవ వేతనం, హోంగార్డులకు మూడు రెట్ల జీతం పెంచారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్పీలకు ఆరునెలలుగా జీతాల్లేవనీ, మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందట్లేదని చెప్పారు. 12 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు దేశంలోనే పీఆర్సీ వర్తింపజేసింది కేసీఆర్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. భవన నిర్మాణ కార్మికులకు బీమాతో ధీమా, క్యాబ్ ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. 8 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఇప్పటిదాకా రిటైర్డ్ బెనిఫిట్స్ రాలేదన్నారు. ఐదు డీఏలుంటే ఒకటే ఇచ్చారని విమర్శించారు. పీఆర్సీకి దిక్కేలేదన్నారు. గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తానని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారు కానీ ఇప్పటిదాకా దాని గురించి అతీ గతీ లేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కోసం ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన హామీలపై నిలదీస్తూ చుక్కలు చూపించే బాధ్యతను కార్మిక విభాగం తీసుకోవాలని సూచించారు. కార్మిక విభాగానికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు
- పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదలకు డిమాండ్
- ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్, భువనగిరి కలెక్టరేట్, నల్లగొండ క్లాక్‌టవర్

కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై సుమారు 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. కల్లుగీత కార్మికులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని, పెన్షన్ 4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని బిక్షం, గునగంటి కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నానుద్దేశించి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాగీర్ కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు దూపటి వెంకటేశ్, గాలి అంజనేయులు పాల్గొన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పామనగుండ్ల అచ్చాలు అధ్యక్షతన ధర్నాలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండా వెంకన్న, చౌగోని సీతారాములు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉప్పల గోపాలు, వేములకొండ పుల్లయ్య, కొప్పు అంజయ్య, రాచకొండ వెంకట్, మక్తాల లింగస్వామి, జెరిపోతుల ధనంజయ్ గీత కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులు లేకుంటే ఉత్పత్తే లేదు

- వారిని కన్వర్షన్ చేయకుంటే ఆందోళన తీవ్రతరం : రాష్ట్ర జేఏసీ చైర్మెన్ కె. ఈశ్వర్‌రావు
- కేటీపీపీ కార్మికుల రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం



నవతెలంగాణ-గణపురం / భూపాలపల్లి టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ కేంద్రాలు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు లేకుంటే విద్యుత్ ఉత్పత్తే లేదని రాష్ట్ర జేఏసీ చైర్మెన్ కె. ఈశ్వర్‌రావు అన్నారు. సోమవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు.. జయశంకర్-భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ సర్కిల్ కార్యాలయం ఎదుట, అలాగే గణపురం మండలం చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(కేటీపీపీ) వద్ద విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఈశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. జెన్కోలో 18 ఏండ్లుగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు 20వేల మంది ఉన్నారని, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో 52,000 మంది ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ జ్యోతి పథకంలో 47 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, 28 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్తును అందించడంలో ఆర్టిజన్ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారు నిత్యం వెట్టిచాకిరి చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారని, ఇప్పటివరకు వారిని పర్మినెంట్ చేయకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సబ్సిడీ విద్యుత్ అందించాలంటే 87 వేల రెగ్యులర్ ఎంప్లాయిస్ ఉండాలని తెలిపారు. సుమారు 18 ఏండ్లుగా విద్యుత్ రంగాన్ని నమ్ముకొని పని చేస్తున్న వీరిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా ఆర్టిజన్ అనే నామకరణం చేసి స్టాండింగ్ ఆర్డర్ తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో కోర్టు పర్మినెంట్ చేసుకోమని విద్యుత్ సంస్థలకు చెప్పినప్పటికి దాన్ని అమలుచేయకుండా కాలయాపన చేసిందన్నారు. డిపార్ట్‌మెంట్ నష్టాల్లో ఉందని, వీరిని పర్మినెంట్ చేస్తే కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందని స్వయంగా అప్పటి సీఎండీ ప్రభాకర్ రావు చెప్పినట్టు గుర్తుచేశారు. గతంలో పాదయాత్రల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క పర్మినెంట్ చేస్తామన్న హామీని నేటికీ నిలబెట్టుకోలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ఐదు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్టు చెప్పారు. అలాగే బస్సుయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 23 వరకు ప్రభుత్వం స్పందించి విద్యుత్ జేఏసీ నాయకులతో సంప్రదింపులు జరిపి కన్వర్షన్ చేయాలని, లేదంటే హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌదాను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు కేటీపీపీ జేఏసీ చైర్మెన్ అల్లం ఓదెలు, కన్వీనర్ బీరెల్లి రాజు, బీఎంఎస్, కేటీపీపీ రీజినల్ అధ్యక్షులు కొండా శ్రీనివాస్, కో చైర్మన్ ఎల్ రాజయ్య కన్వీనర్ కె భాస్కర్, ఎండీ అంకుశావలి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు చిలువేరు మల్లయ్య, కోల శ్యాం, సంఘీభావం తెలిపారు. దీక్షలో బానోతు నరసింహ, థామ్సన్ జెగ్గారావు, రామనాయక్, రగోత్తం రెడ్డి, బాలు భీమానాయక్, మంజునాయక్, రవిందర్, రమేష్, శ్రీనివాస్, సమీరోద్దీన్, సంపత్ రావు, రమేష్ గోపి, సందీప్, హరికష్ణ, తిరుపతి, పురుషోత్తం, కుమారస్వామి, హేమనాయక్, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అడ్డుపడుతున్న శక్తులకు ఎదురొడ్డి పోరాడుదాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ



నవతెలంగాణ-వరంగల్

ఎస్సీల వర్గీకరణకు అడ్డుపడుతున్న శక్తులకు ఎదురొడ్డి పోరాడుదామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అన్నారు. హైదరాబాద్ నగరంలో ఫిబ్రవరి 7న జరగనున్న లక్ష డప్పులు.. వేయి గొంతులు.. సన్నాక సమావేశం విజయవంతం కోసం హనుమకొండ వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం కళాకారుడు మిట్టపల్లి సురేందర్ అధ్యక్షతన కళాకారులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మందకృష్ణ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు నిర్దిష్టంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న సీఎంపై మాల రాజకీయ నాయకులు తీవ్రంగా ఒత్తిడి చేయడం వల్లే ఉద్యోగాల వర్గీకరణ ఇటీవల అమలు చేయలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి మాట ఇచ్చి 4 నెలలయినా అమలు చేయకపోవడంతోనే మరోసారి రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం విపరీతంగా ఉందని, గతంలో వెంకటస్వామి వెనుక ఉండి వర్గీకరణకు అడ్డుపడితే.. ప్రస్తుతం వెంకటస్వామి కొడుకులు అడ్డుపడుతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్న వారి మీద చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. మూడు దశాబ్దాల పాటు పోరాటం చేస్తున్నామని అన్నారు. సబ్బండ కులాలు వర్గీకరణకు మద్దతిస్తుంటే కొంతమంది మాల స్వార్థపరులు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఎస్సీ ఉపకులాల్లో మాలలు తప్ప అన్ని కులాలు వర్గీకరణకు మద్దతిస్తున్నాయని తెలిపారు. వర్గీకరణ విషయంలో అడ్డుపడుతున్న రాజకీయ నాయకులను చిత్తుగా ఓడించాలని, వర్ధన్నపేట ఎమ్మెల్యే మాదిగల ఓట్లు వేయలేదని చెప్పినా ఆయన మరొకసారి ఎన్నికల్లో పోటీ చేస్తే తప్పకుండా ఓడించాలని అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారుగా 30 వేల డప్పులతో అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు నమ్మిండ్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

834 మంది స్పౌజ్ టీచర్ల బదిలీ

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 834 మంది స్పౌజ్ టీచర్ల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఆ కమిటీ సిఫారసుల మేరకు ఉపాధ్యాయుల స్పౌజ్ బదిలీలను చేపట్టామని తెలిపారు. 834 మంది ఉపాధ్యాయులకు స్పౌజ్ బదిలీల్లో అవకాశం కల్పించామని పేర్కొన్నారు. వారి లోకల్ క్యాడర్ మార్పు చేశామని తెలిపారు. కొత్తగా కేటాయింపులు చేశామని వివరించారు. పూర్తిస్థాయి ఖాళీలున్న జిల్లాలకు బదిలీ చేశామని పేర్కొన్నారు. స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా సీనియార్టీ ఆధారంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపులు చేసేందుకు 2021, డిసెంబర్ ఆరున 317 జీవోను గత ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. దానిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారు. అధికారంలోకి వస్తే 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. అందుకనగుణంగా 317 జీవో బాధితుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రి దామోదర రాజనర్సింహ చైర్మెన్‌గా మంత్రులు పొన్నం ప్రభాకర్, డి శ్రీధర్‌బాబులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ కమిటీ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చించింది. బాధిత ఉద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. న్యాయ నిపుణులతో పలు అంశాలపై చర్చించి గతేడాది అక్టోబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను సమర్పించింది. దానిపై మంత్రివర్గంలో చర్చించి గతేడాది నవంబర్ 30న స్పౌజ్ (భార్యాభర్తలు), పరస్పర (మ్యూచువల్), వైద్య కారణాలున్న వారి బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు కూడా స్పౌజ్ బదిలీలను చేపట్టింది. 2023 జనవరిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను చేపట్టలేదు. దీంతో 1,449 మంది స్పౌజ్ టీచర్ల బదిలీలు పూర్తయ్యాయి. త్వరలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన స్పౌజ్ బదిలీలు కూడా నిర్వహించే అవకాశమున్నట్టు తెలిసింది.

శ్వేతసౌధంలో మళ్లీ ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

బరాక్ ఒబామాలు తమ భార్యలతో సహా హాజరయ్యారు. అలాగే అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలే, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని హాజరయ్యారు. చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ హాజరు కావాల్సి ఉన్నా చివరికి చైనా నుంచి సీనియర్ రాయబారి హాజరయ్యారు. అలాగే భారత ప్రభుత్వం తరపున కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే టెస్లా, స్పేస్‌ఎక్స్ సిఇఒ ఎలోన్ మస్క్, అమెజాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జెఫ్ బెజోస్, మెటా ప్లాట్‌పారమ్‌ల సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్‌తో పాటు ఇతర మిలియనీర్లు హాజరయ్యారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తరువాత ట్రంప్ మాట్లాడుతూ, 'అమెరికాకు స్వర్ణయుగం ఇప్పుడే ప్రారంభమవుతుంది' అని వ్యాఖ్యానించడం విశేషం. 'ఈ రోజు నుంచి మన దేశం అభివృద్ధి చెందుతుంది, ప్రపంచవ్యాప్తంగా మళ్లీ గౌరవించబడుతుంది' అని కూడా ట్రంప్ తెలిపారు. ట్రంప్ ప్రమాణస్వీకారానికి ముందు బైడెన్‌తో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ వివిధ దేశాల నాయకులు అభినందనలు తెలిపారు. రష్యా అధ్యక్షులు పుతిన్ ట్రంప్‌ను అభినందించారు. ఉక్రెయిన్, అణ్వాయుధాలపై అమెరికా కొత్త ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మోడీ అభినందన

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన మితవాద రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్‌ను ప్రధాని నరేంద్రమోడీ అభినందించారు. ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెడుతూ, " మైడియర్ ఫ్రెండ్ ప్రెసిడెంట్ అమెరికా అధ్యక్షుడిగా చారిత్రాత్మక ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మీకు ఇవే నా అభినందనలు. మీతో మరోసారి సన్నిహితంగా కలసి పనిచేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను" అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సమృద్ధిగా ఖనిజసంపద

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఖనిజాల అన్వేషణ, అకర్షణ, నిర్వహణ జాతీయ, రాష్ట్ర లక్ష్యాల్లో ఉమ్మడిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేశీయ పరిశ్రమను ప్రోత్సహించేందుకు దిగుమతులు తగ్గించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 2,552 మైనింగ్, ఖనిజ గనుల లీజులు ఉన్నాయని వివరించారు. తెలంగాణ నదీ తీరంలో మట్టి/మెట్ట ఖనిజాల కోసం ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించామన్నారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకుని ఇసుకను తవ్వడం, ప్రజలకు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా తక్కువ ధరలకు విక్రయిస్తున్నామని తెలిపారు. 2024లో సూర్యాపేట జిల్లాలో రెండు లైమ్‌స్టోన్ బ్లాక్‌లను వేలం వేశామని వివరించారు. రాష్ట్రంలో ఖనిజ వనరుల ఆడిట్ కోసం డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలు పూర్తయ్యాయని తెలిపారు. ఖనిజ వనరుల అన్వేషణలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. 2015 నుంచి ఇప్పటివరకు వసూలు చేసిన రూ. 5,537 కోట్లను ప్రభుత్వ పాఠశాలలతో పాటు పలు ప్రాధాన్యతా రంగాల్లో వినియోగిస్తున్నామని చెప్పారు.

మార్చి నుంచి నైని బ్లాక్ బొగ్గు ఉత్పత్తి ప్రారంభం

ఈ ఏడాది మార్చి నెల నుంచి ఒడిస్సాలోని నైనీబ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజీకి లేఖ రాసారు. గత ఏడాది జులైలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలప్రదం అయ్యాయనీ, అందువల్ల బొగ్గు ఉత్పత్తి వేగంగా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు నైని బొగ్గు బ్లాక్ దగ్గరే 1,600 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రాజెక్టును నిర్మిస్తున్నామని తెలిపారు. దానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఆ లేఖలో కోరారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- సూర్యాపేట జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఘటన



నవతెలంగాణ- సూర్యాపేట

గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మద్దిరాల మండలానికి చెందిన మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. చివ్వెంల మండలం బిబిగూడెం చెందిన వల్లపు హర్షిత మద్దిరాల జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులు ముగియడంతో పాఠశాలకు రావాల్సిందిగా సిబ్బంది తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ క్రమంలో తండ్రి సైదులు కుమార్తె హర్షితతోపాటు ఇంటర్ చదువుతున్న పెద్ద కుమార్తెను తీసుకొచ్చి పాఠశాల వద్ద వదిలి వెళ్లాడు. పాఠశాలలోకి వచ్చిన విద్యార్థిని హర్షిత తమ బ్యాగులను గదిలో పెట్టింది. ఆ తర్వాత నేరుగా డార్మెటరీకి వెళ్లి చున్నీతో ఉరేసుకుంది. ఇది గమనించిన ఇద్దరు విద్యార్థులు వెంటనే ప్రిన్సిపాల్ జ్యోతికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఉపాధ్యాయులు ఆమెను ఆటోలో ఏరియాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స కొనసాగుతోంది. పాఠశాలకు పంపిన కొద్ది సమయంలోనే తమ కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసుకోవడంపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థినికి అనారోగ్య సమస్యలు ఉన్నాయని, దాంతో పాఠశాలకు పలుమార్లు ఆబ్సెంట్ అయిందని, ఈ కారణాల వల్లే ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందని ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. విద్యార్థిని హర్షిత ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దనియాకుల శ్రీకాంత్‌వర్మ డిమాండ్ చేశారు. పట్టణ సీఐ వీర రాఘవులు ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హైదరాబాద్‌లో టాచ్యోన్ ఐటి సోల్యూషన్స్ ప్రారంభం

- ఉత్తమ సేవలు అందించాలి : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఐటీ రంగంలో మరిన్ని నాణ్యమైన, విస్తృత సేవలు అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో టాచ్యోన్ ఐటి సోల్యూషన్స్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కార్యాలయం ఐటీ రంగంలో ముఖ్యమైన సేవలను అందిస్తూ, మరింత మంది ఐటీ రంగ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ వెంకట్‌కొల్లి మాట్లాడుతూ వచ్చే ఆరు నెలల్లో, శాప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్‌ల్లో అత్యంత నైపుణ్యం కలిగిన 500 మంది నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. తమ సంస్థకు డల్లాస్‌లో ప్రధాన కార్యాలయం ఉందనీ, అమెరికా, కెనడా, మెక్సికో, యుకెల్లో బ్రాంచ్ కార్యాలయాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం అమెరికాలో చాలా మంది కస్టమర్లు ఉన్నారనీ, ఐటి సోల్యూషన్స్ రంగంలో కొత్త సాంకేతికతలపై నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ డెలివరీ సెంటర్ సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ సేవలు అందిస్తుందని తెలిపారు. దుబాయ్‌లో కొత్త కార్యాలయం ఏర్పాటుతో మిడిల్ ఈస్ట్‌లోకి విస్తరించాలన్న ప్రణాళిక ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ హిమాన్షు ఓజా, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, పొగాకు బోర్డు మాజీ చైర్మెన్ రఘునాథ్ బాబు, మాజీ మంత్రి, కైకలూరు శాసనసభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాస్, నాట్కో చైర్మెన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీ పేరుతో ఆర్టీసీ బస్సుల అప్పగింతను అంగీకరించం

- టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలోని డిజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) బస్సులుగా మార్పు పేరుతో ప్రయివేటుకు కట్టబెట్టడాన్ని మానుకోవాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాలుష్య నియంత్రణకు మరియు ఖర్చులు తగ్గించుకోవడానికి 2025 డిసెంబర్ నాటికి హైదరాబాద్ సిటిలో 2,800 బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తెస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎమ్ ఈ-డ్రైవ్ పేరుతో ఒక్కో బస్సుకు రూ.35 లక్షలు చొప్పున సబ్సిడీ ఇస్తూ, 11 వేల ఈవీ బస్సులకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఈవీ బస్సుల తయారీ కోసం ఆర్టీసీలకు అనుమతి ఇవ్వలేదనీ, అందువల్ల దేశంలోని ఆర్టీసీలన్నీ ప్రయివేటుపరం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీలకు కూడా సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీజిల్ బస్సుల్ని ఈవీలుగా మార్చితే ఆర్టీసీలోని 7వేల మంది డ్రైవర్లు ఉద్యోగాలు కోల్పోతారని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం, అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. సోమవారం ఒడిస్సా రాష్ట్రం కోణార్క్‌లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సమావేశంలో ఈ మేరకు కేంద్రమంత్రికి లేఖ ఇచ్చారు. రీజినల్‌రింగ్ రోడ్, రేడియల్ రోడ్ల అభివృద్ధి,. మెట్రో రైల్ ఫేజ్-2, మూసీ నది తీరాభివృద్ధి, గోదావరి-మూసీ నదుల అనుసంధానం సహా పలు ప్రాజెక్టులను ఆ లేఖలో ప్రస్తావించారు.

గవర్నర్ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

- 26న అవార్డుల ప్రదానం • రాజ్‌భవన్ ప్రకటన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ కార్యాలయం 'గవర్నర్ పురస్కారాలు-2024' అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన ఎనిమిది మంది వ్యక్తులు, సంస్థల జాబితాను తెలియజేసింది.ఆయా రంగాల్లో సేవలందించిన వ్యక్తులు,సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేయ నున్నారు. ఈనెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించ నున్నారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో నాలుగు రంగాలకు చెందిన వారికి ప్రతియేటా పురస్కారాలు ఇవ్వాలని గతంలో నిర్ణయించిన విషయం విదితమే. పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేండ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక అందజేస్తారు.

ఎంపికైన వారు

అవార్డుకు ఎంపికైన వారిలో దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలంపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పిబి కృష్ణాభారతి (సంయుక్తంగా)తోపాటు ధృవాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మోహత ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ సంస్థలు ఉన్నాయి.

జెబ్రోనిక్స్ నుంచి జెడ్ స్టూడియోఎక్స్‌వన్ విడుదల



చెన్నయ్ : ప్రముఖ ఆడియో సిస్టమ్ ఉపకరణాల సంస్థ జెబ్రోనిక్స్ కొత్తగా జెబ్ స్టూడియోఎక్స్‌వన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇందులోని స్పీకర్ అంతర్నిర్మిత పవర్ బ్యాంక్‌ను కలిగి ఉందని పేర్కొంది. ఇది పోర్టబుల్ వినోదంలో కొత్త ప్రమాణాన్ని నిర్దేశిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. అద్భుతమైన 240డబ్ల్యు ఆర్‌ఎంఎస్ అవుట్‌పుట్‌ను కలిగి ఉంటుందని.. సింగిల్ ఛార్జింగ్‌తో 11 గంటల పాటు పని చేస్తుందని జెబ్రోనిక్స్ డైరెక్టర్, కో ఫౌండర్ ప్రదీప్ దోషి తెలిపారు. 45వాట్ రాపిడ్ చార్జింగ్‌ను కలిగి ఉందన్నారు. దీని ధరను రూ.34,999గా నిర్ణయించామన్నారు. ఇది ప్రయాణంలో ఇతర పరికరాలను ఛార్జ్ చేసుకోవడానికి అనుమతిస్తుందన్నారు. అది మీ స్మార్ట్‌ఫోన్, టాబ్లెట్ లేదా ఉపకరణాలు అయినా, ఆ పొడిగించిన ఈవెంట్‌లు లేదా రోడ్ ట్రిప్‌ల సమయంలో మీరు ఎప్పటికీ పవర్ అయిపోవడం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పేదలకు అండ..ఎర్రజెండా..!

పేదలకు అండగా ఉంటూ.. వారి సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) ఉద్యమాలు చేపట్టింది. ఈ మూడేండ్ల కాలంలో చేపట్టిన వివిధ రకాల ఉద్యమాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో కుండిషేకుగూడ వాసుల కష్టాలు ఫలించగా.. కోయపోచగూడెం వాసులకు సాగుచేస్తున్న పోడు భూమి దక్కడం.. మంచిర్యాలలో కరకట్ట నిర్మాణం చేపట్టడంతో పాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రద్దయిన తునికాకు టెండర్లు మళ్లీ పిలవడం వెనుక ఎర్రజెండా పోరాటం కీలకపాత్ర పోషించింది. నిర్మల్ జిల్లాలోనూ దళితుని భూమిని క్రికెట్ గ్రౌండ్‌గా మార్చిన వీడీసీ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించగా.. కలెక్టర్ హామీతో సదరు భూమి దళితునికి ఇప్పించేలా ప్రయత్నం చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి సంగారెడ్డిలో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ చేపట్టిన పోరాటాలు.. సాధించిన విజయాలపై ప్రత్యేక కథనం..



- కుండిషేకుగూడకు నీళ్లొచ్చాయి.. కోయపోచగూడెంకు భూమి దక్కింది
- రద్దయిన తునికాకు టెండర్లకు మళ్లీ మోక్షం
- సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు పోరాటం
- ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగిన ఉద్యమాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనం ఎదుర్కొంటున్న బాధలను కళ్లారా చూసిన పార్టీ నాయకులు వాటి పరిష్కారానికి నడుం బిగించారు. జిల్లాలోని మారుమూల గాదిగూడ మండలం కుండిషేకుగూడ వాసులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేని పరిస్థితి. ఈ దుస్థితిని ప్రత్యక్షంగా చూసిన పార్టీ నాయకత్వం వారితో కలిసి 52 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టింది. కుండిషేకుగూడ నుంచి జిల్లా కేంద్రానికి కాలినడకన పార్టీ నాయకత్వంతో కలిసి పిల్లాపాపలతో వచ్చిన గిరిజనులు తొమ్మిది రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఐటీడీఏ అధికారులు స్పందించి గ్రామంలో బోర్లు వేయించి మోటార్లు బిగించడంతో పాటు నీటి ట్యాంకు బాగు చేయించడంతో ఆ ఊరి తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. మూతపడిన సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని నిరసన చేపడుతూ ఉద్యమం చేపట్టారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆ పరిశ్రమను సందర్శించి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కోయపోచగూడెంలో పోడు భూముల కోసం ఆదివాసులకు అండగా మూడు నెలలు పోరాటం సాగించింది. ఈ క్రమంలో 8మంది మహిళలను నిర్బంధించగా.. 40మందిపై అక్రమ కేసులు పెట్టింది. పార్టీ పోరాటం ఫలితంగా 150 ఎకరాల సాగు భూమి ఆదివాసులకు దక్కింది. అన్నారం- మేడిగడ్డ బ్యారేజీ ముంపు కారణంగా మంచిర్యాల పట్టణాన్ని వరద ముంచెత్తింది. కరకట్ట నిర్మాణం చేపట్టాలని పార్టీ చేపట్టిన పోరాటం కారణంగా ప్రభుత్వం రూ.200కోట్లు మంజూరు చేసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అటవీశాఖ అధికారులు తునికాకు టెండర్లను రద్దు చేశారు. దాంతో పార్టీ పోరాటం చేపట్టగా అధికారులు దిగివచ్చి 15యూనిట్లు తెరిచి టెండర్లు పిలవడంతో తునికాకు సేకరించేవారికి ప్రయోజనం కలిగింది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం కనకాపూర్‌కు చెందిన ఓ దళిత రైతుకు చెందిన ఐదు ఎకరాల భూమిని అబ్దుల్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) గుంజుకొని అందులో ఒక బిల్డింగ్ నిర్మించి క్రికెట్ గ్రౌండ్‌ను నిర్మించింది. దాంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతుకు అండగా నిలిచి పోరాటం చేపట్టింది. ఆ భూమిని స్వాధీనం చేసుకొని సదరు భవనంలో రైతుతో గృహ ప్రవేశం చేయించింది. 17మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించింది. బాధితుడికి భూమి దక్కేలా చూస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. భూమికి బదులు భూమిని అప్పగించాలని సదరు రైతు కోరుకోవడంతో ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి పోరాటాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేకం జరిగాయి. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న బాధితులకు పార్టీ సాంత్వన కలిగించింది.

యధావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి దామోదర భేటీ



- సమస్యల పరిష్కారానికి హామీ
- పేదలను ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి
- ఆరోగ్యశ్రీకి రూ.1,137 కోట్లు చెల్లించామని వెల్లడి
- ప్యాకేజీల ధరలను సవరించామంటూ గుర్తు చేసిన మంత్రి
- హాస్పిటల్స్ అసోసియేషన్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలు యధావిధిగా కొనసాగనున్నాయి. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల పలు ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ సేవలను (నాన్ యమర్జన్సీ) నిలిపేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య శ్రీ ట్రస్టు ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్, జనరల్ సెక్రటరీ హరిప్రకాశ్, డాక్టర్ సౌజన్య, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంపానెల్‌మెంట్ ఎంవోయూను సవరించాలని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరలను సవరించాలని వారు కోరారు. ఆరోగ్య శ్రీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..."పేద ప్రజల విద్య, వైద్యం మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్యానికి నిధులు విడుదల చేస్తున్నాం.

ఆరోగ్యశ్రీకి గతంలో ఏడాదికి సగటున రూ.500 కోట్లు చెల్లిస్తే, మా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రూ.1,137 కోట్లు చెల్లించాం. గతంలో ఉన్న బకాయిలను కూడా క్లియర్ చేశాం. రెగ్యులర్‌గా పేమెంట్స్ రిలీజ్ చేస్తున్నాం. మరో ఆర్నెల్లలో బకాయిలు లేకుండా పేమెంట్స్ క్లియర్ చేస్తాం. ఆస్పత్రుల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టాల్సిన అవసరం మాకు లేదు. మీరు నష్టపోకూడదు, అదే సమయంలో ప్రజలకు కూడా ఇబ్బంది కలగకూడదు. ఇది మీ ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం. మీరు ఎప్పుడైనా వచ్చి మీ సమస్యలను మాకు తెలియజేయడానికి అవకాశం ఉంది. మీరు లేవనెత్తిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించే బాధ్యత మాది. ప్యాకేజీల రేట్లను 2013లో రివైజ్ చేశారు. మళ్లీ మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్యాకేజీ రేట్లను రివైజ్ చేశాం. రివిజన్‌కు సంబంధించి హాస్పిటల్స్ యాజమాన్యాలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేసి, సానుకూల నిర్ణయం తీసుకుంటాం. ఇతర సమస్యలను సైతం పరిష్కరించే బాధ్యత మాది."అని మంత్రి ఈ సందర్భంగా హామీనిచ్చారు. ఇతర సమస్యలపై చర్చించేందుకు వైద్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య శ్రీ సీఈవోతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీనిచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను పిలిచి మాట్లాడడం హర్షణీయమన్నారు. మంత్రిగారి మేరకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు యథావిధిగా కొనసాగిస్తామన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున రూ.50 కోట్ల వరకు రిలీజ్ చేయగా, ప్రస్తుతం రూ.100 కోట్ల వరకూ రిలీజ్ చేస్తున్నారని తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయండి

- గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య వినతి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య కోరారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సోమవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలు ఉండడం వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా ప్రభావితం అవుతున్నదని తెలిపారు. ఉపాధ్యాయులు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జాతీయ విద్యావిధానం-2020ని రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలను మెరుగుపర్చాలని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. కొత్త పీఆర్సీ నివేదికను వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి గవర్నర్ చొరవ చూపాలని సూచించారు.

ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలి

- ఉద్యోగులకు మంత్రి పొన్నం సూచన



నవతెలంగాణ -హైదరాబాద్

ఫైళ్ల విషయంలో ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అంబేద్కర్ తెలంగాణా సచివాలయం సంఘం ఆధ్వర్యంలో సచివాలయంలో సోమవారం నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణా, సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొ కోదండరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏవైనా ఉంటే తన దష్టికి తీసుకు రావాలని సూచించారు. కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిస్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పని చేద్దామని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డ్స్ కోసం తన వంతు కషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులు మంచి సేవలందించి ప్రభుత్వానికి గొప్ప పేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు గిరి శ్రీనివాస్ రెడ్డి , ప్రధానకార్యదర్శి జి ప్రేమ్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమ కోసం నిరంతరం పని చేస్తామని తెలిపారు. అనంతరం సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అందులో 13 అంశాలపై చర్చ అనంతరం తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సంఘం కోశాధికారి కైలాష్, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, సహాయకార్యదర్శులు అయేషా తబస్సుమ్, నీరాజాక్షి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ తక్షణమే చేపట్టాలి

- ఐబీఏ జోక్యం చేసుకుని విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- 21,22,23 తేదీల్లో హైదరాబాద్‌లో అఖిల భారత బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు : అఖిల భారత బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్ఎం. దేశ్ పాండే, ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ. జైన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణను తక్షణమే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్ఎం. దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ.జైన్ డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఏ) జోక్యం చేసుకొని బ్యాంకుల విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లోని హోటల్ అశోకలో తమ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి 170 మంది ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంకు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. బ్యాంకుల విశ్రాంత ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం, ఐబిఏ వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. 29 ఏండ్లుగా ఉద్యోగ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులకు బేసిక్ పెన్షన్‌లో పెరుగుదల లేదని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య బీమా ప్రీమియం బ్యాంకులే భరించాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ లో ప్రకటించిన విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లింపు సమీక్షించి పెంచాలనీ, ప్రయివేటు బ్యాంకు పెన్షనర్లకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శులు మిత్ర వశ, విశ్వనాథ నాయక్, ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మణ్ రావు, ఎమ్ఎన్. రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ మూర్తి. వి.వారణాసి, తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధేకు ఘనవీడ్కోలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ అలోక్ అరాధే బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ప్రసంగిస్తూ కోర్టులను డిజిటలైజేషన్ చేయడంలో, కంప్యూటరీకరణ, సాంకేతికంగా ముందుంచడంలో జస్టిస్ అలోక్ అరాధే పాత్ర కీలకమన్నారు. హైకోర్టు ప్రత్యక్ష ప్రసారాలకు, హైబ్రిడ్ (ఫిజికల్, లైవ్‌లో వాదనలు వినిపించేలా) శ్రీకారం చుట్టి పారదర్శకతకు పెద్దపీట వేశారని చెప్పారు. కాగిత రహిత కోర్టుల ఏర్పాటు, సాంకేతిక ఇబ్బందులు రాకుండా 15 వేల చదరపు అడుగుల డిజిటలైజేషన్ వింగ్ ప్రారంభించారని వివరించారు. కొత్త హైకోర్టు నిర్మాణానికి ఎంతో కృషి చేశారని అన్నారు. అందులో భాగంగానే గతేడాది శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రూ.2,580 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయనీ, జిల్లా కోర్టు నిర్మాణానికి రూ.1,058 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో దేశంలోనే తెలంగాణ తొలిస్థానంలో నిలిచిందన్నారు. 2023, జులై 21 నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 2,38,173 ఉండగా, ఈ జనవరి 10 నాటికి 2,29,148కు



తగ్గిందన్నారు.

జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వం తనకు ఎంతగానో నచ్చిందన్నారు. సంప్రదాయాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. తొలుత ఏజీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కేసుల దాఖలు సంఖ్యతో పోలిస్తే కేసుల పరిష్కార సంఖ్య ఎక్కువగా ఉండే చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ బీ నరసింహశర్మ, పీపీ నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మెన్ నర్సింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రిజిస్ట్రార్ జనరల్, ఇతర రిజిస్ట్రార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేయండి

విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) పోస్టులను పిటిషనర్లతో భర్తీ చేయాలని ఇటీవల హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్-ఎస్పీడీసీఎల్)ను ఆదేశించింది. కోర్టుకు రాని వాళ్లను అనుమతించవద్దని చెప్పింది. ఇప్పటికే స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తే వాళ్లను భర్తీ చేయాలంది. ఒకవేళ ఆ పరీక్ష నిర్వహించకపోతే వెంటనే నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని స్పష్టం చేసింది. 2019లో టీఎస్ఎస్పీడీసీఎల్ 2,500 జేఎల్‌ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులను జేఎల్‌ఎం పోస్టులకు వర్తింపజేయలేరని చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీఎస్ఎస్పీడీసీఎల్ దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ఇటీవల తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఖాళీలను పిటిషనర్లతో మాత్రమే భర్తీ చేయాలని తీర్పులో పేర్కొంది.

నల్లగొండలో ధర్నా కోసం హైకోర్టుకు బీఆర్ఎస్ - 27కు కేసు వాయిదా

నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ చేయబోయే ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పార్టీ హైకోర్టులో సవాలు చేసింది. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పోలీసులు వివరణ ఇవ్వాలని హైకోర్టు సోమవారం ఆదేశించింది. విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్న ఎన్నికల హామీకి విరుద్ధంగా రూ.12 వేలనే ప్రభుత్వం ప్రకటించడంపై నిరసన తెలుపుతూ మంగళవారం ధర్నా చేయాలని నిర్ణయించామనీ, కేటీఆర్ హాజరు అవుతారనీ, పోలీసులు అనుమతి ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్ లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. మంగళవారం నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించే ధర్నాకు నల్లగొండ డీఎస్పీ అనుమతి ఇవ్వలేదన్నారు. 24 నుంచి గ్రామ సభలు, ఆ తర్వాత రిపబ్లిక్‌డే ఏర్పాట్లలో పోలీసులున్నారనీ ప్రభుత్వం చెప్పింది. పోలీసుల వివరణ నిమిత్తం విచారణ ఈనెల 27కి వాయిదా పడింది.

హయత్‌నగర్‌లో నేడు, రేపు గ్రామసభలు



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్ నగర్ మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడానికి నేడు, రేపు గ్రామ సభలను నిర్వహించనున్నట్టు హయత్ నగర్ తహసీల్దార్ జానకి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన బాగ్ హయత్ నగర్, అన్మగల్ హయత్ నగర్, కల్సా హయత్ నగర్ కు చెందిన రైతులు వార్డ్ ఆఫీసు డివిజన్ 13, బస్తీ దావఖాన హయత్ నగర్ లో... 22వ తేదీన సాహెబ్ నగర్ కాలన్, సాహెబ్ నగర్ కుర్దు, కల్వంచ కు చెందిన రైతులకు శ్రీ సీతా రామాంజనేయ కళ్యాణమండపం, కమ్యూనిటీ హాల్ సాహెబ్ నగర్ నందు నిర్వహించబడునని వివరించారు. ఉదయం 10:30 నుండి సమావేశం ప్రారంభం అవుతుందని, 9849904226 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వికలాంగులకు వీల్ చైర్స్ పంపిణీ



నవతెలంగాణ-చంపాపేట్

యాకుత్‌పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం పరిధిలోని ఐఎస్‌సదన్ డివిజన్ వార్డు కార్యాలయంలో వికలాంగులకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వీల్ చైర్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. వీల్ చైర్స్, వినికిడి పరికరాలు, వివిధ రకాలైన బెల్టులు మరియు సపోర్టింగ్ స్టిక్స్‌లను సీనియర్ సిటిజన్‌కు, వికలాంగులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శైలజ, డీపీఓ రత్నమాల, ఏఎంసీ వాసిఫుద్దీన్, యుసిడి యాదయ్య సప్న, ప్రసాద్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు తీసుకోవడమే తప్ప..

హామీల అమలు శూన్యం





- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- ఎంపీతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

నవతెలంగాణ-మీర్‌పేట్

కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో ప్రజల నుండి దరఖాస్తులు తీసుకోవడమే తప్ప.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మాత్రం శూన్యమని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ వార్డులో రూ.5.41లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో అందరీ సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ దరఖాస్తులంటూ కాలం వెళ్లదిస్తూ కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి, కొందరి పేర్లు మాత్రమే ప్రకటించడం దారుణమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇండ్లు ఇచ్చే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. రేపటి నుండి జరగబోయే వార్డు సభల్లో అధికారులను, కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. అందరీ సహకారంతోటే ఈ అభివృద్ధి సాధ్యం అయ్యిందని, సహకరించిన అందరికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమం మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్స్ అర్కల భూపాల్ రెడ్డి, కిసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, పార్టీ నాయకులు, వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు





నవతెలంగాణ-మలక్‌పేట్

మలక్‌పేట్‌లోని ప్రభుత్వ నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన ఆరోగ్యం దెబ్బతినే విధానాన్ని స్క్రీన్ ద్వారా అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు వివరించినట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచే వీటిపై అవగాహన అవసరం అని చెప్పారు. ఎక్కడైనా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలను కుక్కలు ఏ విధంగా పసిగడతాయో విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల నివారణ విభాగం డీఎస్పీ రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఎస్సై జీవన్ రెడ్డి, మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సై సంజీవరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేత



నవతెలంగాణ - హయత్‌నగర్

ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల మన్సూరాబాద్‌లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉదయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడా పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు.

ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 500 లీటర్ల సింటెక్స్ వాటర్ ట్యాంక్, క్యారం బోర్డ్, క్రికెట్ బ్యాట్, స్పోర్ట్స్‌కి సంబంధించిన పరికరాలను పాఠశాల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ నిర్వాహకుల చేతుల మీదుగా అందజేసినట్టు పేర్కొన్నారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఉదయ్ ఫౌండేషన్ వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవితా రెడ్డి, ఉదయ్ కిరణ్ వెన్నెల ఫౌండేషన్ నిర్వాహకులు ఉదయ్ కిరణ్, శ్రీకాంత్, నరేందర్, బీజేపీ నాయకులు శంకరయ్య, మునగాల హరీష్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, యంజాల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు మోసపోతే 'ఫోరం'ను ఆశ్రయించాలి



నవతెలంగాణ-హయత్‌నగర్

వినియోగదారులు మోసపోతే 'ఫోరం'ను ఆశ్రయించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో కామర్స్ విభాగం, బిజినెస్ మేనేజ్మెంట్, వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేష్ బాబు తెలిపారు. వినియోగదారుల అవగాహన సదస్సుకు ప్రొఫెసర్ బదియుద్దీన్ అహ్మద్, డీన్ కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్వర్తించాలన్నారు. అలాగే వినియోగదారులు ఎక్కడైనా మోసపోతే వాళ్ల వినియోగదారుల ఫోరంలో అభ్యర్థించి పరిష్కారాన్ని పొందవచ్చని తెలియజేశారు. కళాశాల వినియోగం వినియోగదారుల సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్యం వినియోగదారుల చట్టం 2019 గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ శారద దేవి, డాక్టర్ సత్యనారాయణ, ఎస్ బాల, వి. ఇందిరా, వి. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బి. నరసింహ, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అవేజు, మహబూబ్, డాక్టర్ శ్రీపతి నాయుడు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడల ద్వారా

సమిష్టితత్వం, పోరాట స్ఫూర్తి అలవడతాయి

- క్రీడలు వ్యక్తుల మానసిక, శారీరక వికాసానికి ఎంతో అవసరం
- సీపీ సుధీర్ బాబు
- ప్రారంభమైన ఆరో ఎడిషన్ రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్- 2025



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రీడలు వ్యక్తుల మానసిక వికాసానికి, శారీరక వికాసానికి తోడ్పడుతాయని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన ఆరవ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2025 ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ముఖ్య భాగమని, వివిధ రకాల మానసిక శారీరక ఒత్తిడ్లను అధిగమించడానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. రాచకొండ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, గరిష్ఠ శిక్షారేటు సాధిస్తూ గొప్పగా పని చేస్తున్నారన్నారు. వారికి విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడ్లను, వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశమనం పొందేలా, నూతనతేజంతో తమ విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ పోలీస్ విభాగాల మధ్య సుహృద్భావ వాతావరణం, సమిష్టితత్వం ఏర్పడుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అన్ని రకాల ప్రధాన క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, గెలుపోటముల కంటే పోరాటమే ధ్యేయంగా క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పోలీసు సిబ్బంది జట్లు మాత్రమే కాక మినిస్టీరియల్ సిబ్బందికి కూడా ఒక ప్రత్యేక జట్టు ఉంటుందని, అన్ని జట్లూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్, పద్మజచ అరవింద్, సునీత రెడ్డి, రమణారెడ్డి, మురళీధర్, శ్రీనివాస్, ఇందిరా, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు సహకరించండి

- కార్పొరేటర్ ఇంద్రసేన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రోడ్డు నిర్మాణ పనులకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూమి యజమానులు సహకరించాలని కార్పొరేటర్ ఇంద్రసేన అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ నుండి కటికే శ్రీరాంరెడ్డి ఇంటి వరకు ఎంతో కాలంగా ఉన్న రోడ్డును.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూమి యజమానులు ఆక్రమణకు గురి చేశారని సోమవారం కార్పొరేటర్ ఇంద్రసేనతో పాటు అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పూర్వ కాలం నుండి ఉన్న రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూమి యజమానులు రోడ్డును ఆక్రమణకు గురిచేయడం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజల సౌకర్యం కోసం మున్సిపల్ కార్పొరేషన్ నుండి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను చేయని పక్షంలో నిధులు వృథా అవుతాయని, అంతే కాకుండా అంబేద్కర్ నగర్ కాలనీ వాసులకు రోడ్డు సమస్య తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులకు భూమి యజమానులు సహకరించాలన్నారు. ఏది ఏమైనా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి తీరుతామని కార్పొరేటర్ ఇంద్రసేన ధీమా వ్యక్తం చేశారు.

'ఎల్ఆర్ఎస్'ను సద్వినియోగించుకోవాలి

- కమిషనర్ పి.సరస్వతి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ఎల్ఆర్ఎస్ పథకం కింద 2020 సంవత్సరంలో రూ.1000 రూపాయలు చెల్లించిన వారు ఫీజ్ రిజిస్ట్రేషన్ డ్యాక్మెంట్ సమర్పించి.. మిగతా ఫీజ్ చెల్లించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సోమవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం త్వరలో ముగిస్తున్నందున మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సరస్వతి కోరారు.

'రైతు సంక్షేమమే లక్ష్యం'

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

రైతు సంక్షేమమే రైతు సేవా సహకార సంఘం లక్ష్యమని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు చేగూరి భరత్ కుమార్ అన్నారు. మండలంలోని తారామతి పేట గ్రామానికి చెందిన రైతు మూల శ్రీ రాములు 28 ఆగస్టు 2024న మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు ఆ విషయాన్ని తెలుసుకున్న చేగూరి భరత్ కుమార్ వెంటనే స్పందించి.. మృతి చెందిన రైతు భార్య అనురాధకు రూ.25 వేల చెక్కును అందజేసి చేయూతను అందించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం నిరంతరం రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అకాల మరణం చెందిన రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వడ్డేపల్లి సతీష్, మూల అంజయ్య, మేనేజర్ జక్కుల ఐకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. తెలంగాణ గిరిజన గురుకుల ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు కొత్తపేట బీజేఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను అవసరం అయితే కేబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకుపోతానని స్పష్టం చేశారు. ప్రపంచీకరణ సరళీకరణ తర్వాత దేశ వ్యాప్తంగా విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడిందని అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువుల కోసం జీవితాలను త్యాగం చేస్తున్నారని వివరించారు. ప్రైవేటు పాఠశాలల వైపు ఎగువ, దిగువ మధ్యతరగతి ప్రజలు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. అత్యంత ధనవంతులు కార్పొరేట్ విద్యా సంస్థలు వైపు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. అదే సమయంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సీటు సంపాదించడానికి పోటీ పడుతున్నా విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సీటు సాధించడానికి వేలాది మంది విద్యార్థులు తీవ్రస్థాయిలో ఆసక్తి చూపుతున్నా రని వివరించారు. అయితే అదే గురుకుల పాఠశాలల్లో సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని కోదండరాం అంగీకరించారు. పెరుగుతున్న విద్యార్థుల శాతానికి అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరగడం లేదన్నారు. బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది కొరత కారణంగా అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు కూడ ఇక్కట్లకు గురవుతున్నారని ఆయన వివరించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలు విషయంలోనూ నిధులు పెంచే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానన్నారు. గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర నిరంతరం కీలకపాత్రను పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోక్రటీస్, షేక్స్పియర్, అమర్త్యసేన్ లాంటి వారి అన్వేషణ ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, పల్లె వినయ్ కుమార్ గౌడ్, తెలంగాణ గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సంఘాల నేతలు రుషికేశ్, లింగారెడ్డి, సిఎచ్ బాలరాజు, కల్యాణి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మేయర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబనతో మరింత ఉన్నతంగా ఎదగాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మేయర్ ప్రారంభించారు. ఎన్.బి.టి నగర్ ఎస్ ఎల్ ఎఫ్ –5 గణేష్ ఎస్ హెచ్ జి గ్రూప్‌నకు రూ.10 లక్షల బ్యాంక్ లింకేజి రుణం మంజూరు కాగా, అందులో రూ.5 లక్షలతో ఐదు మంది మహిళలు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అట్టి క్యాంటీన్‌ను ప్రారంభించిన మేయర్ మాట్లాడుతూ... మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి, స్త్రీలకు ఆర్థిక స్వావలంబన అందించడానికి ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ క్యాంటీన్‌లతో స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని, మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించడానికి, సమాజంలో తమ స్థానం మరింత బలోపేతం చేసుకునేలా ఈ కార్యక్రమం సహాయ పడుతుందన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించడానికి ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యుసిడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, డిసీలు ప్రశాంతి, రజినీకాంత్ రెడ్డి, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆశా వెరోనికా, సిఓలు, ఆర్‌పిలు, ఎస్ఎల్ఎఫ్ లీడర్లు, ఎస్‌హెచ్ జి గ్రూప్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ చేయూత'



నవతెలంగాణ-హయత్‌నగర్

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకోవడానికి ఎంఎస్ఎంఈ ఆర్థిక చేయూత నిస్తుందని తెలంగాణ రాష్ట్ర జెడ్ ఇంచార్జి హరీష్ రాజు సూచించారు. ఆటోనగర్ ఎస్టేట్, పరిశ్రమల కమిషనర్, Azqdc, (నెక్స్ జెన్ గ్లోబల్ సర్వీస్), హైదరాబాద్ ఆటోనగర్ మెకానికల్, టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈజెడ్ సుస్థిర అభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్ అనగా జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్, ప్రతి తయారీ యూనిట్ డిఫెక్ట్ లేని ఉత్పాదకాలు తయారు చేస్తూ పర్యావరణాన్ని ఎలాంటి ప్రభావం లేకున్నా తయారు చేయాలన్నారు. ఈ జెడ్ సర్టిఫికేషన్ ద్వారా హ్యాండ్ హోల్డింగ్ సపోర్ట్ 3 లక్షలు సబ్సిడీ, సిస్టమ్ అప్‌డేట్, అభివృద్ధికి 2 లక్షలు, సెంట్రల్ గవర్నమెంట్ నుండి పొందవచ్చు అని, అలానే ఎంఎస్ఎంఈ నుండి తక్షణ రుణాలు అందుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారు అర్హులు అని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న వారు కూడా అర్హులు అని అన్నారు. ఉద్యమం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఉచితం అని వెల్లడించారు. అదేవిధంగా జెడ్ సర్టిఫికెట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కృష్ణ, జగదీష్, రవి, థాన సిబ్బంది, శ్రీనివాసరావు, ఫర్హాన్, దీక్షిత్, ప్రణీత్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై జరిగిన దాడిని ఖండించిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ -ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై జరిగిన ముకదాడిని వ్యతిరేకిస్తూ సరూర్‌నగర్ మండలంలో సోమవారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. సరూర్‌నగర్ మండలంలోని పలు పాఠశాలలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్బీనగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్మన్ఘాట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చంపాపేట్, ప్రాథమిక పాఠశాల రాజీవ్ గాంధీ నగర్, యు పి ఎస్ బొమ్మన గండి, యు పి ఎస్ చంపాపేట్ పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి, మండల అధ్యక్షులు తావూరియా నాయక్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్ రాజు, కార్యదర్శులు నీరజ, కిరణ్మయి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు రామావత్ తావూరియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
హైదరాబాద్
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన..



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాల గురించి గన్ ఫౌండ్రి లోని మహబూబియా ప్రభుత్వ బాలికల పాఠశాలలో యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల దుష్పలితాలపై యువతలో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నార్కోటిక్ బ్యూరో డిఎస్పీలు హరిశ్చంద్ర రెడ్డి, బుచ్చయ్య, సిఐ గోపిలు వివరించారు. నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా "గంజాయి తాగొద్దు, డ్రగ్స్? వాడొద్దు" అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయమని, తల్లిదండ్రులకు కూడా ఈ విషయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని డ్రగ్స్?రహిత తెలంగాణగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశమని అన్నారు. డ్రగ్స్? వాడడం వల్ల ఎదురయ్యే అనర్థాల గురించి అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. సామాజికి బాధ్యత ఉన్న అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కోరారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలను పోలీసులు చక్కగా వివరించారని ఉపాధ్యాయురాలు నీరజ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వర్ధంతికి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి



- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాత్మా గాంధీ వర్ధంతి ఏర్పాట్లలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఈనెల 30న బాపు ఘాట్‌లో నిర్వహించనున్న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చేపట్టాల్సిన పనులపై డీఆర్వోతో కలిసి టూరిజం, పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, విద్యుత్, జీహెచ్ఎంసీ, విద్యాశాఖ, సమాచార శాఖ అధికారులతో ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని సూచించారు. వేడుకల్లో ప్రోటోకాల్ తప్పక పాటించాలనీ, గత అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఎక్కడకూడా తప్పిదాలు జరగకుండా అధికారులు నిబద్ధతతో తమకు కేటాయించిన పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా బాపుఘాట్, ఫోటో మెమోరియల్ ఆడిటోరియం, గాంధీ విగ్రహాన్ని పూలతో అలంకరించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు రెండు ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, నిరంతరం విద్యుత్ ఉండాలనీ, సౌండ్ ప్రూఫ్ జనరేటర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. వేడుకలకు వచ్చే అతిథులు, ఇతరులు ఇబ్బంది పడకుండా ఆ దిశగా ఏర్పాట్లు ఉండాలన్నారు. లైన్ డిపార్టుమెంట్ అధికారులు ముందుగా బాపు ఘాట్‌కు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. వేడులల్లో పాల్గొనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గైడ్ తప్పక ఉండాలని సూచించారు. వీఐపీ, విద్యార్థుల గ్యాలరీలు వేరుగా ఉండాలనీ, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్స్ వద్ద ఇబ్బందులు కలగకుండా తప్పక పోలీసులు ఉండాలని సూచించారు. ఘాట్ ప్రాంతంలో మెడికల్ శిబిరాలతో పాటు అంబులెన్సు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు, పిల్లలకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ అందించాలని సూచించారు. ముఖ్యంగా అతిథులకు ముందుగా తెలియజేయాలని, సర్వ మత పెద్దలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఘాట్ వద్ద, ఆడిటోరియం వద్ద వీఐపీలకు ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో టూరిజం జీఎం సూర్య నారాయణ, డిప్యూటీ ఐఏఎస్ బషీరుద్దీన్, డీఈవో కార్యాలయ ఏడీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిపై మంత్రి ఆయా ఉన్నతాధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్న వారితో పాటు ఇంటి స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులకు ఇప్పటి వరకు దరఖాస్తు చేయనివారు వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, వార్డు సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు గతంలో ప్రజాపాలన సేవా కేంద్రాలలో వచ్చిన దరఖాస్తులను, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలాంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, రవికిరణ్, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగ తాయారు, శివకుమార్ నాయుడు, సంబంధిత అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



- హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి
- రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అంబర్‌పేట

బి.సిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఓబీసీ ఫిబ్రవరి 6,7న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా దేశ వ్యాప్తంగా ఉన్న బీసీలతో సెమినార్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుంచి పెద్ద యెత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబందించిన వాల్ పోస్టర్‌ను బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ బోను దుర్గా నరేశ్ ఆధ్వర్యంలో కాచిగూడ లోని అభినందన్ హెూటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బి.సిలను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నారు. రాజ్యాధికారంలో వాట ఇవ్వకుండా 75 సం.లుగా అన్యాయం చేస్తున్నారు. జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌ల నినాదాలు ఇస్తూ.. బి.సిలను వాడుకుంటున్నారని అన్నారు. బీజేపీ పార్టీ బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా చేశారు. ఇటీవల నలుగురు గవర్నర్లు బి.సి వర్గానికి చెందిన వారిని నియమించారు. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హెూదా ఇచ్చారు. కేంద్రంలో బి.సి రిజర్వేషన్లను వర్గీకరించడానికి కమిషన్ ను నియమించాలి. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలకు సామాజిక న్యాయం కల్పించామన్నారు. కేంద్రంలో బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని మనది ప్రజాస్వామ్య దేశమని దేశంలోని ప్రతి కులానికి, సామాజిక వర్గానికి వారి వారి జనాభా ప్రకారం విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య మౌలిక లక్షణం. బీసీలకు విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించారు. కానీ రాజకీయ రంగంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదు. రాజ్యాంగ రచన సమయంలోనే బి.సి లకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. కానీ కల్పించలకుండ అన్యాయం చేశారు. 75 సంవత్సరాల కాలంలో 121 సార్లు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టారు కానీ బీసీలకు రాజ్యాధికారం లో వాటా కల్పించడానికి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టలేదు అనీ ఇప్పటికైనా దేశంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లులకు మద్దతు ఇవ్వాలని స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 50 శాతం సీట్లు ఇవ్వాలని పార్టీ పదవుల్లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలి అనీ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి అనీ బి.సి ల విద్య - ఉద్యోగ రిజర్వేషన్లు పై యున్న క్రిమిలేయర్ ను తొలగించాలి అనీ బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలి అనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందగోపాల్, సుగుణ, మల్లేష్, వేముల రామకృష్ణ, చింత శ్రీనివాస్, వరప్రకాష్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

- సోషల్ హెల్త్ ఫించనర్స్ అసోసియేషన్ నాయకుడు భరత్ సత్యనారాయణ
- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ (అడ్మిన్) కు వినతి పత్రం అందజేత..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోషల్ హెల్త్ ఫించనర్స్ అసోసియేషన్ నాయకుడు భరత్ సత్యనారాయణ అన్నారు. సోమవారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ (అడ్మిన్) కాకుమాను శశి శ్రీ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారత్ సత్యనారాయణ మాట్లాడుతూ... 2024 మార్చి నుండి పదవి విరమణ పొందిన ఉద్యోగులు అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. జిల్లాలలో పి హెచ్ సి లో రిటైర్మెంట్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్ బిల్లులను వెంటనే ట్రెజరీకి పంపాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. ఈ విషయంపై దృష్టి సారించి తమ సమస్యను పరిష్కరించాలని అడిషనల్ డైరెక్టర్ (అడ్మిన్) ను కోరమన్నారు.ఈ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమాయేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ హెల్త్ ఫించనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్ఎస్ మూర్తి, టి చంద్ర శేఖర్, గంగాధర్ ,నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ల అరెస్టు హేయమైన చర్య

- ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గం

నవతెలంగాణ-ముషీరాబాద్

మైలారం గుట్ట మైనింగ్ అక్రమ తవ్వకాలను నిలిపివేయాలంటూ.. వెళ్లిన ప్రొ.హరగోపాల్, ప్రొ.గడ్డం లక్ష్మణ్ ఇతర నేతలను నాగర్ కర్నూల్ పోలిసులు కస్టడిలోకి తీసుకోవడం హేయమైన చర్య అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అన్నారు. ఈ అక్రమ నిర్బంధాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణా రాష్ట్ర కార్యవర్గం ఖండిస్తూంది. వారిని భేషరత్‌గా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం వెంకట్ రెడ్డి, ఎ సాంబ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడితే ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతుందని చిలుక పలుకులు పలికి నేడు గద్దెనెక్కినాక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణిచివేయటంలో గత ప్రభుత్వ వైఖరిని అవలంబిస్తుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌర హక్కుల సంఘాల నాయకులను, మేధావులను నిర్బంధించడం ప్రజాస్వామిక పాలన ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. పేద ప్రజల భూములను అన్యాయంగా, అక్రమంగా అభివృద్ధి పేరిట మైనింగ్, ఇండస్ట్రియల్ తదితర అభివృద్ధి పేరుతో ప్రజల జీవనాన్ని ధ్వంసం చేస్తున్నారు. మైలారం గుట్టలను మైనింగ్ పేరుతో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాలను నిలిపివేయకుండా చోద్యం చూస్తున్న ప్రభుత్వం అక్రమార్కులకు కొమ్ముకాయటమే అవుతుందన్నారు. తక్షమే మైలారంలో అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి. అక్రమంగా అదుపులోకి తీసుకున్న ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితర నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే అరెస్టు చేస్తారా : తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ

నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామంలో మైనింగ్ పేరుతో గుట్ట ధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా వెళుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ హరగోపాల్ ని అరెస్టు చేసి వెల్దండ పోలీస్ స్టేషన్ కి తరలించడాని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ రచామోని నాగభూషణం, రాష్ట్ర కోకన్వీనర్ ఎడ్ల అంబయ్య, హైదరాబాద్ కమిటీ ముత్తన్న రాంబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. రిలే నిరాహార దీక్షలను భగ్నం చేసి గ్రామస్తులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం వారిని వెంటనే పేషరుతగా విడుదల చేయాలని మైనింగ్‌ను నిలిపివేసి గ్రామంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు..



- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న

నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న సూచించారు. ఆయన పర్యవేక్షణ లో సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, పారిశుద్యం, వీధి దీపాలు, రోడ్డు నిర్మాణం పనులు, పార్కు సమస్య, అక్రమ నిర్మాణం, అక్రమ ఫుడ్ స్టాల్స్ సమస్యలపై ఏడు ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీలు, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, డీప్యూటీ కమిషనర్ (ఎస్ డబ్ల్యూ ఎం) శంకర్ సింగ్, ఏ యం సీ రాజారావు, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూబిడి డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.


నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ యొక్క ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా, కట్ట మైసమ్మ ఫీడర్ పరిధిలో ఉ. 10:00గం॥ ల నుంచి 1:00॥ గం వరకు సూరారం - రోడ్, సూరారం విలేజ్, మొదలైన ప్రాణాలలో అలాగే బౌరంపేట్ ఫీడర్ మ 1:30 గం నుంచి 4:30 గం ల వరకు సారెగూడం రోడ్, కింగ్స్ బార్ రోడ్, ల్యాండ్ మార్క్-3, శ్రీవేద స్కూల్ రోడ్, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

ప్రతిపక్షం నిలదీస్తే తప్పు.. ప్రభుత్వం పని చేయాదా..

- అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి..
- బీఆర్ఎస్ గోషామహల్ నియోజక వర్గం ఇన్‌చార్జీ మహేంద్ర కుమార్



నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రతిపక్షం నిలదీస్తే తప్పు.. ప్రభుత్వం సమస్యల పై పని చేయాదా అని బీఆర్ఎస్ గోషామహల్ నియోజక వర్గం ఇన్‌చార్జీ మహేంద్ర కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల పట్ల ప్రతిపక్షం గుర్తు చేస్తే తప్పు, నిరుపేదల గురించి ఆలోచించదా? అని ప్రశ్నించారు. సర్వేల పేరుతో ప్రజలను కాలయాపన చేస్తుంద న్నారు. ప్రజా పాలన దరఖాస్తు చేసుకున్న పత్రాలు ఆన్ లైన్ పేరుతో చేస్తూ వాటిని బుట్ట దాఖలు చేశారని మండి పడ్డారు. ఇంద్రమ్మా ఇండ్ల సర్వేలో చాలా మంది పేర్లు రాలేదన్నారు. ఆన్ లైన్ పేర్లు సరిగా లేకపో వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తుందన్నారు. రేషన్ కార్డుల సర్వే లో సహితం ఎంతో మంది అర్హులైన వారి పేర్లు రాకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులకు కూడా రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం బీఆర్ఎస్ విజయమని చెప్పారు. మీ సేవా దరఖాస్తులను సహితం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పెరిగిన ద్రవ్యోల్బణం ఆధారంగా రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు.

నిరు పేదలను రేషన్ కార్డు లబ్దిదారులుగా గుర్తించాలి : కార్పొరేటర్

ముషీరాబాద్: అసలైన నీరు పేదలను ప్రభుత్వం రేషన్ కార్డు లబ్దిదారులుగా గుర్తించాలని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమ వారం బాగ్లింగంపల్లిలోని సివిల్ సప్లై కార్యాలయంలో అధికారి దీప్తి, డివిజన్ సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ సావిత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో పలు సవరణలు చేయాలని, వార్షిక ఆదాయాన్ని తగ్గించినచో మరికొంత మంది పేద కుటుం బాలకు చేయూత కలుగుతుందని అన్నారు. అదేవిధంగా ఇదివరకు రేషన్ కార్డు దరఖాస్తు చేయని వారికి ప్రభుత్వం మరికొంత గడువును విధించి, దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమీక్షలో కార్పొరేటర్‌తో పాటు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్కుచుట్టూ ఆక్రమణల తొలగింపు పట్ల హర్షం..



- వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-ముషీరాబాద్

నగరంలోని ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కు చుట్టూ ఉన్న ఫుట్పాత్ ఆక్రమణలను జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తొలగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం సుందరయ్యపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి. నిరంజన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సంపత్ రెడ్డి, ఎస్ రమేష్ రెడ్డి, హౌస్ ఫెడ్ డైరెక్టర్ అయిలి నేని కిషన్ రావు సీనియర్ వాకర్ రవికుమార్, జాలివాకర్ జి. కృష్ణలు మాట్లాడుతూ... గత రెండు రోజుల క్రితం ఆక్రమణలకు గురైన డబ్బాలను తొలగించి ట్రాఫిక్ జామ్‌ను అరికట్టడం అభినందనీయం అన్నారు. అయితే మళ్లీ ఎవరూ ఫుట్ పాత్‌లను ఆక్రమించుకుని అక్రమంగా డబ్బాలు వేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికీ కొంత మంది వ్యక్తులు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి బ్యానర్లు కట్టుకోవడం జరిగిందని.. వారాని కోసారైనా వచ్చి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని వారు కోరారు. ముఖ్యంగా పార్కు చుట్టూ ర్యాంపులుగా కడితే వాకర్స్ తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, దీనివల్ల పూర్తిగా ట్రాఫిక్ జామ్‌ను అరికట్టడానికి అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

గత బీఆర్ఎస్ హయాంలో అనిచివేతకు గురైన ఉద్యమకారులు

- తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు
- రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉద్యమకారులు అనిచివేయబడ్డారు అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అనంతరం జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ,ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రపుల్ రామిరెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్ డోలక్ యాదగిరి, సింగారయ్యలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు నాలుగు గదులతో కూడిన ఇండ్లను వెంటనే మంజూరు చేయాలన్నారు. రూ.30 వేల పెన్షన్‌తో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యము స్మృతి వనము సంక్షేమ బోర్డు మొదలగు సౌకర్యాల కోసం వచ్చే బడ్జెట్లో ఉద్యమకారులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను వాడుకొని వదిలేసి ఘోరంగా అనిచివేసిందన్నారు. వాళ్ల కుటుంబం మాత్రమే లక్షల కోట్ల పోగుచేసుకుని ప్రజలను నట్టేట ముంచిందని ఇప్పుడు ఉద్యమకారుల కోసం మాట్లాడుతున్నారని దొంగే దొంగ అన్నట్లు నటయాత్రలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్‌ల కాకుండా ఉద్యమకారులను ఆదుకోవాలని తెలిపారు. ఉద్యమకారుల ,అమరవీరుల, కళాకారుల కుటుంబాలను ఆదుకోవడానికి వచ్చే బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

అర్హులైన కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేయాలి



- కాంగ్రెస్ బహదూర్ పుర నియోజక వర్గం ఇన్‌చార్జీ పులిపాటి రాజేశ్ కుమార్

నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రభుత్వం చేపట్టిన తెల్ల రేషన్ కార్డులు సర్వేలో అర్హులైన ప్రతి కుటుంబానికి జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని బహదూర్ పుర నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జీ పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. ఫలక్నుమా సర్కిల్-10 డీప్యూటీ కమీషనర్ అరుణ, అసిస్టంట్ మున్సిపల్ కమిషనేర్ పుష్పా ఠాకూర్‌లతో సర్కిల్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వేపై చర్చించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం 1705 కుటుంబాలకు సంబంధించిన దరఖాస్తుల అందాయని వాటి వెరిఫికేషన్ పూర్తి అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో భాగంగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన తెల్ల రేషన్ కార్డుల ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డులు జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులు అయిన వారి పేర్లు ఈ జాబితా లో లేని యెడల వారు ఈ నెల 24వ తేదీ వరకు తమ తమ వార్డ్ ఆఫీసులలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి కొత్త ధరఖాస్తులు చేసుకోవొచ్చన్నారు. నేటి నుండి మొదలు అయ్యే కొత్త దరకాస్తుల ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అబేద్ అలీ, అలీ షాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు చేపట్టాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హెూలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరద కాలువ పనులను జీహెచ్ ఎంసీ, ఇంజనీరింగ్, జలమండలి, ట్రాఫిక్ అధికారులతో కలసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని డిపార్ట్‌మెంట్లు, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు.. మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ ఈ చిన్న రెడ్డి, ఈ ఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, జలమండలి డీజీఎం నాగప్రియ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, సీఐ జానయ్య, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్దే ధ్యేయంగా ఎల్లవేళలా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేని కలిసి పలు ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి తను ప్రతినిత్యం ముందుండి పనిచేస్తనని అన్నారు.

అయ్యప్ప కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా..

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ప్రజల సహకారాల తో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సోమవారం గాజుల రామారం డివిజన్ మెట్ కాని గూడా అయ్యప్ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. కాలనీలోని పార్కును సుందరీకరి స్తూ అభివృద్ధి చేయాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పిం చడం జరిగిందన్నారు. కాలనీ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు ఇవ్వకూడదని హితువు పలికారు. అదేవిధంగా ఈ పదేండ్ల కాలంలో మెట్ కాని గూడ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి పరిచామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్ట ర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సంక్షేమ సంఘం సభ్యులు రవిశంకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సిహెచ్.పూర్ణ, నరేంద్రనాథ్ సర్కార్, బి.రాజేశ్వర్, ఏ.ఆర్.సి.రెడ్డి, మోహన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రవికుమార్ గియ్యర్, ఆనంద్, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

"బాపూజీ హై స్కూల్" నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..



పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 126 - జగద్గిరిగుట్ట డివిజన్ లెనిన్ నగర్‌లోని బాపూజీ హై స్కూల్ ఆధ్వర్యంలో రూపొందించిన "నూతన సంవత్సర 2025" కాలమానిని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సోమవారం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రుద్ర అశోక్, స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ ముంతాజ్ అలీ, జహేద్ అలీ, మహమ్మద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ఎమ్మెల్యేని, వెంకటేశ్వర కాలనీ (వెస్ట్) నూతన కార్యవర్గ సభ్యులు..

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని, వెంకటేశ్వర కాలనీ (వెస్ట్) నూతన కార్యవర్గ సభ్యులు కలిశారు. పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 132 - జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ (వెస్ట్) నూతన కార్యవర్గ అధ్యక్షులుగా ఎన్నికైన ఎం.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్ చక్రవర్తి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉన్నప్పుడు కాలనీ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వెంకటేశ్వర కాలనీ (వెస్ట్) అభివృద్ధికి నా వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం పేర్లతో రూపొందించిన లెటర్ హెడ్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివాధన్, సభ్యులు శ్రీశైలం, రమేష్, మారుతి, ప్రసాద్ రావు పాల్గొన్నారు.



కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కేపీహెచ్‌బీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రేవంత్ రెడ్డి సర్కార్ అభివృద్ధిని అటుకెక్కించి ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా చేస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి కె.పి.హెచ్.బి కాలనీలోని ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న వేణు గోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డ్ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావులు పాల్గొని వేణుగోపాల స్వామి ఆలయాన్ని పరిశీలించారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డు లోని జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉండే రమ్య గ్రౌండ్ పార్కు స్థలాన్ని సైతం హౌసింగ్ బోర్డ్ అధికారులు బోర్డులు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్రంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రజల సౌకర్యార్థం కె.పి.హెచ్.బి కాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులను, ఆట స్థలాలను క్రికెట్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. దానికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డ్ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు దండు కోవడం దారుణమన్నారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలలో ప్రజాప్రయోజనార్థం 10శాతం భూములు, గుడులు, బడులు, పార్కులకు కేటాయించాలన్నారు. ఎలాంటి కేటాయింపులు చేయకుండా వేలం పాటలు ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న దేవాలయ మండపానికి ఎవరికీ చెప్పకుండా ఎలా సీజ్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పంచనామా జరపకుండా ఆలయ సిబ్బందికి కమిటీకి చెప్పకుండా అధికారులు ఎలా సీజ్ చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధోరణి మార్చుకోకపోతే ఈనెల 24 న జరిగే వేలం పాటను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేష్‌పవన్, పి.ఎల్ ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద ఉన్న జాతీయ జెండాను ఎలా తొలగిస్తారు : ఎమ్మెల్యే



కేపీహెచ్‌బీ : తన సొంత డబ్బులతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఆ విగ్రహం వద్ద ఉన్న జాతీయ జెండాను ఎలా తొలగిస్తారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీహెచ్ కాలనీ ఒకటవ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా దిమ్మకు ఎగిరేయకుండా దిమ్మపోలును జీహెచ్ఎంసీ అధికారులు కట్ చేశారు. దాని పక్కనే ఉన్న కాంగ్రెస్ దిమ్మెకి జాతీయ జెండాను పెట్టడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నించారు. అధికారుల ధోరణి మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని ఇకనైనా పక్కన ఉన్న కాంగ్రెస్ దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసిన రోజు ఉన్న పాత దిమ్మకు జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్, సాయి, గోపి ఎర్రబెల్లి సతీష్ రావు, వెంకటేష్ చౌదరి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు

సమస్యలను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయాలి : ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్క రించేందుకు నిధులను మంజూరు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వేసవి కాలం రానున్న నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న తాగు నీటి సరఫరా సమస్యలతో పాటు పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కృష్ణారావు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఎండీ.అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లతో ముద్దం నరసింహ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, సతీష్ గౌడ్, సబిహ గౌసుద్దీన్, మహేశ్వరీ శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్, బాబురావు కలిసి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను కొంత మేరకు చేపట్టి మిగతా పనులను పెండింగులో పెట్టారనీ.. సత్వరం పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో తాగునీటిలో మురుగునీరు కలిసి సరఫరా అవుతుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్ జలమండలి అధికారులకు స్థానిక సమస్యలపై ఎక్కటికప్పుడు పిర్యాదు చేస్తున్న ప్పటికీ నిధులకొరతతో పనులు జరగడంలేదని తెలిపారు. గత పదేండ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లో తాగునీటి పైప్లైన్ ఆధునీకరణ, రిజర్వాయర్ల నిర్మాణం వంటివి పూర్తి చేయ డం జరిగిందన్నారు. అరకొరగా మిగిలిన చిన్నపాటి పనులను కూడా ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలమండలి ఎండీ ప్రత్యేక చొరవ తీసుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో తాగునీటి సమ స్యను పరిష్కరించి వేసవికాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



కుట్టు మిషన్,వీల్‌చైర్ పంపిణీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హెూప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పేదలకు సేవలు రానున్న రోజుల్లో ఇలాగే అందించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. కార్పొరేటర్ చేతులమీదుగా మహిళకు కుట్టు మిషన్ అందించారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో నివసిస్తున్న జెట్టి కంసమ్మ అనే నిరుపేద మహిళకు, వీల్ చైర్, కుట్టు మిషన్ పని నేర్చుకుని, మిషన్ కొనుక్కునే ఆర్థిక స్తోమత లేని, మేరీ అనే మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హెూప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకు రాలు, ఆలేఖ్యకు, వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. రానున్న రోజు ల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ధాతి రమేష్, షకీల్ మున్నా, వాలి నాగేశ్వరరావు, పి.సూరి బాబు, హెూప్ ఆఫ్ హంగర్ సంస్థ టీమ్ మెంబెర్స్ ఆలేఖ్య, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి, రవికిరణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనులు పరిశీలన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ పరిధిలోని చైతన్య బస్తీలో నూతన మంచినీటి పైప్ లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పైపులు, మురుగునీటి పైప్ లైన్, మ్యాన్ హెూల్‌తో కలవకుండా, జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా అధికారుల దగ్గరుండి ప్రతి ఇంటికి కనెక్షన్ ఇవ్వాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కే.ఎర్ర స్వామి, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, ఐలయ్య, రవికుమార్ గౌడ్, రమేష్ నాయర్, క్రాంతి కుమార్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణ సభ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భారత రాజ్యాంగ పరిరక్షణ సభకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కొలన్ హన్మంత్ రెడ్డిలకు, జై భీమ్ మహాసేన మనవ హక్కుల పరిరక్షణ సంఘం కమిటీ సభ్యులు ఆహ్వానించారు. భారత రాజ్యాంగాన్ని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక పాఠ్యాంశాలుగా చేర్చాలి. బాల బాలికలకు భారత రాజ్యాంగం యొక్క విలువలు, విశిష్టత తెలిసేలా రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని జరుగుతున్న నిత్య పూలమాల కార్యక్రమం. తేదీ 1-03-2025 నాటికి 250 రోజులు పూర్తి చేసుకుంటుంది. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి, హన్మంత్ రెడ్డిలు స్పందించి కచ్చితంగా సభకు వస్తామని చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ శ్రీమతి శ్రీ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, మేడ్చల్-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డా. అవిజె జేమ్స్, భూదాల అమర్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రోట్రాక్ట్ క్లబ్ ఎన్నిక



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రోట్రాక్ట్ క్లబ్ ఎన్నిక నిర్వహించారు. కళాశాల లో రోట్రాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఆర్టిఆర్ సందీపికకు ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఆర్ పిహెచ్ఎఫ్, ఆర్‌టి ఎస్ఆర్‌టిఆర్ వినీల సిద్దినేని చీఫ్ గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరాలో పాల్గొన్న కార్యక్రమాల గురించి వివరించారు. 48 కార్యక్రమాల ద్వారా 1758 మందికి వివిధ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ఈ బాధ్యతలను ఇస్తూ వారి వారి బాధ్యతలను గుర్తుకు చేశారు. 2025లో ఇంకా మరిన్ని కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.శ్రీలత, డైరెక్టర్స్ సరోజా రెడ్డి, అనురాగ్ రెడ్డి, పిఆర్ఓ రవి సుధాకర్, రోట్రాక్ట్ డిస్టిక్ 3150 నుంచి ప్రెసిడెంట్, సెక్రటరీస్ పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బాలానగర్/కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధి లోని ఇందిరాగాంధీ పురంలో ఇటీవల నాలాలో పడి షేక్ ముజ్మిల్ మృతి చెంది న విషయం తెలిసిందే. బాలుడి తల్లిదండ్రులకు (షేక్ హుస్సేన్ హలీం బేగం) ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించింది. రూ.2 లక్షల చెక్కును మేయర్ విజయలక్ష్మి సోమవారం తన కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌తో కలిసి బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. బండి రమేష్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందేలా చేశారు. దీంతో హుస్సే న్ దంపతులు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, బండి రమేష్‌లకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సి పల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ కుక్కల రమేష్, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల వాగ్దానాలను నెరవేర్చాలి

- ప్రజావాణిలో డీఆరోకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కల్లుగీత కార్మిక సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో డీఆర్ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిపై రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు, జిల్లాలో దాదాపు 20 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదకర వత్తి అయినప్పటికీ బతుకుదెరువు కోసం ఈ వత్తిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గీత కార్మికులు చెట్టు పైనుంచి పడి చనిపోకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్లను ఇప్పటి వరకు 10 వేల మందికి మాత్రమే ఇచ్చారనీ, త్వరగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షలా 50 వేల మందికి అందించాలనీ, గీతా కార్మికులందరికీ బైకులు ఇవ్వాలనీ, చెట్టుపై నుంచి పడి చనిపోయిన వారికి రూ.25 వేలు, దెబ్బలు తగిలిన వారికి రూ.15 వేలు, బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ఆర్థిక సహాయం రూ.7 కోట్లా 90 లక్షలను సీఎం ఇచ్చిన వాగ్దానం ప్రకారం విడుదల చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టును వినియోగించుకుని రాష్ట్రవ్యాప్తంగా నీరాను అందించాలనీ, ఈత, తాటి ఉప ఉత్పత్తుల పరిశ్రమలను స్థాపించి గౌడ్ల యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే గీత కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.4వేలకు పెంచాలనీ, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలనీ, పొట్టి రకం ఈత, తాటి చెట్లను పెంచడానికి భూమి లేని సొసైటీలకు ఐదెకరాల భూమి ఇచ్చి నీటి సదుపాయం కల్పించి సొసైటీలకు తదితర పది డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వూషగౌని వెంకట నరసయ్య, జిల్లా కార్యదర్శి కప్పల లింగంగౌడ్, జనగాని రాజు గౌడ్, దొంతి ఆంజనేయులు గౌడ్, పంజాల యాదగిరి గౌడ్, చంద్రయ్య గౌడ్, శేఖర్ గౌడ్, ఎం.శ్రీనివాస్ గౌడ్, రొడ్డ లలిత గౌడ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 60 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీ లను డీఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో 60 ఫిర్యాదులు అందినట్టు వారు తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సమస్యల పరిష్కారానికి అండగా..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆల్విన్ కాలని డివిజన్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, ఉజ్జయిని మహంకాళి నగర్ కమిటీ సభ్యులు, సతీష్ రావుని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో స్థానికంగా ఉన్న సమస్యల గురించి సతీష్ రావుతో చర్చిం చారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సాయి గౌడ్, రాము, వెంకట్ రావు, పాండు, శ్రీను, అశోక్, మాణిక్యం, కృష్ణ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

పాఠశాలను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బేగంపేట
మోండా డివిజన్ గ్యాస్ మండి గవర్నమెంట్ ప్రైమరీ పాఠశాలలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంత దీపిక పాఠశాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కొంత మంది విద్యార్థులు స్కూల్ యూనిఫాంలో ఎందుకు లేరని, పాఠశాల బెంచీలను ఎందుకు వాడడం లేదని ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణ గురించి విద్యార్థులకు చెప్పారు.

జలమండలి ఎండీని కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్



నవతెలంగాణ-కంటోన్మెంట్
పాత బోయిన్‌పల్లి డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఖైరతాబాద్ హెడ్ ఆఫీస్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ జలమండలి సివరేజ్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. 119 డివిజన్‌లో మురికి కాలువలు, మంచినీటి పైప్ లైన్ సమస్యలను తెలిపారు. పలు కాలనీలలో, బస్తీలలో కొత్త వాటర్ లైన్స్ ఏర్పాటు చేయాలని అలాగే భూగర్భ సివరేజ్ సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- ప్రజావాణిలో 163 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన విన్నపాలకు ప్రాధాన్యతనిచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆయా విభాగాల అధికారులు శ్రద్ధ తీసుకోవాలని, సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత అర్జీదారునికి తెలియజేయాలని తెలిపారు. ఒకే సమస్యపై అర్జీదారులు పలుమార్లు వచ్చే ప్రజావాణికి తిరగకుండా పరిష్కరించాలని, పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలు తెలియజేయాలన్నారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు రాగా, సత్వర పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 55 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 30, ట్యాక్స్ విభాగానికి 5, ఎఫ్.ఎ. విభాగానికి 4, యూబీడీ 3, ఇంజినీరింగ్ (మెయింటెనెన్స్), శానిటేషన్, హెల్త్, వెటర్నరీ, ఎస్టేట్ విభాగాలకు రెండు ఫిర్యాదులు చొప్పున రాగా, ల్యాండ్ అక్విజిషన్, విజిలెన్స్, అర్బన్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 47, సికింద్రాబాద్ జోన్ లో 24, శేరిలింగంపల్లి జోన్ లో 14, చార్మినార్ జోన్ లో 9, ఎల్బీనగర్ జోన్ లో 6, ఖైరతాబాద్ జోన్ లో 8 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, వేణుగోపాల్ రెడ్డి, విజిలెన్స్ ఎ.ఎస్.పి శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, సీ.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, సీ.ఇ కోటేశ్వరరావు, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, డిప్యూటీ సీ.ఇ.ఓ పవన రెడ్డి, రెవెన్యూ జే.సీ మహేష్ కులకర్ణి, ఆయా విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పని ఒత్తిళ్లను అధిగమించొచ్చు

- సీపీ సీవీ ఆనంద్, సైనా నెహ్వాల్, పి.కశ్యప్
- హైదరాబాద్ కమిషనరేట్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో
క్రీడలతో శారీరక దారుఢ్యం పెరగడంతోపాటు పని ఒత్తిళ్లను అధిగమించొచ్చని, ఆరోగ్యంగా ఉంటారని హైదరాబాద్ సీపీ తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025ను గోషా మహల్ పోలీస్ స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్యాడ్మింటన్ క్రీడాకారులు సైనా నెహ్వాల్, పి. కశ్యప్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌ను వారు జెండా ఎగురేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 2025 యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను 14 కంటింజెంట్‌లో 24 రకాల వివిధ క్రీడలు, ఆటలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా క్రీడలు, ఆటలలో రాణిస్తున్న పోలీసులు క్రీడాకారులు సైనా నెహ్వాల్, పి.కశ్యప్ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుల స్ఫూర్తితో నిలవాలని కోరారు. హైదరాబాద్ సిటీ పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ లో 14 జట్లు పాల్గొనడం ఇదే మొదటిసారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం టైం వేస్ట్ అనుకోవద్దని, క్రీడలతో మంచి వాయిస్ దొరుకుతుందని, పోలీసులకు మోటివేషన్‌తో పాటు వాళ్లలోని నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈసారి టీంలు ఎక్కువగా ఉండటం వల్ల 4 రోజులపాటు క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తాను కూడా ఒక స్పోర్ట్స్ మెన్‌నే అని సీపీ తెలిపారు. తాను బ్యాటింగ్ చేస్తే సెంచరీ కొట్టాల్సిందేనని, పరిగెడితే హండ్రెడ్ మీటర్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాల్సిందే అనే పట్టుదలతో ఆడుతానన్నారు. ఆటల్లో తాను ఓడిపోతే ఆ రాత్రి నిద్ర పట్టదని తెలిపారు. మనలో పోటీతత్వం, పట్టుదల ఉండాలి అని చెప్పారు. ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వాహకులను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందని. క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, మీరు ఎంత ప్రతిభ కనబరిచారో ముఖ్యమని తెలిపారు. ఈ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు, పని ఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడాకారిణి పి. కశ్యప్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేది ఎంతో కష్టంతో కూడుకుందని, మీరు ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల మంచి ఆరోగ్యం, హుషారుగా ఉంటారన్నారు. మీరు అందరూ ఫిట్ నెస్ మీద శ్రద్ధ వహించాలని కోరారు. సైనా నెహ్వాల్ మాట్లాడుతూ తనకు స్పోర్ట్స్‌లో ఎలాంటి ఆటలైనా చాలా ఇష్టమని, తాను భారతదేశం తరుపున ఆడినప్పుడు చాలా గర్వంగా ఉంటుందని తెలిపారు. మన దేశంలో చాలా మంది టాలెంట్ ఉన్న వారు ఉన్నారని, ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని, ఫిట్ గా ఉండాలన్నారు. ఈసారి ఈ స్పోర్ట్స్ మీట్‌కి ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందన్నారు. అడిషనల్ సీపీలు విక్రమ్ సింగ్ మాన్, వి.విశ్వప్రసాద్, డీసీపీలు రక్షిత కృష్ణ మూర్తితోపాటు అన్ని విభాగాల అధికారులు, క్రీడల్లో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్...
సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని లబ్ధిపొందాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో అమీర్ పేట మండల పరిధిలోని అమీర్ పేట, సనత్ నగర్ డివిజన్‌లకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆడపిల్లల పెండ్లికి ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, అమీర్ పేట డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణి కుమార్, నాయకులు కూతురు నర్సింహ, బలరాం, జమీర్, మోహన్, రెవెన్యూ అధికారులు కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఫోటోలను మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



- సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేసిన తెలంగాణ జాగృతి మహిళా విభాగం

నవతెలంగాణ-సిటీబ్యూరో
పసుపు బోర్డు విషయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫోటోలను మార్ఫింగ్ చేసి ఎక్స్ అనే సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ఏపాతంజలి...కాశీ అనే హ్యాండిల్ తో పాటు దీని వెనక ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేయాలని తెలంగాణ జాగృతి మహిళా విభాగం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం మేడ్చల్ జిల్లా తెలంగాణ జాగృతి మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ లలిత యాదవ్ ఆధ్వర్యంలో పలువురు సైబర్ క్రైమ్ పోలీసులను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఫోటోలు మార్ఫింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక రాజకీయ పార్టీ సంబంధించిన కీలక నాయకురాలి ఆన్ లైన్ సోషల్ మీడియాలో విద్వంసకర అసత్య ప్రచారాలు చేస్తుండడమే కాకుండా ఫోటోలను మార్ఫింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జాగృతి నాయకులు వాసగిరి కోట్ గౌడ్, బండారి లావణ్య, సృష్ట రెడ్డి, సింగిరెడ్డి విమల రెడ్డి, శ్రీలత, మహేశ్వరి, రత్న, పెంటమ్మ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



- తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ శివ నాయుడు

నవతెలంగాణ-కంటోన్మెంట్
తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు.. అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ శివ నాయుడు, శంకర్ యాదవ్ అన్నారు. తిరుమలగిరి ఆర్మీ పబ్లిక్ హై స్కూల్‌లో సోమవారం తెలంగాణ మాదకద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాదకద్రవ్యాలు తీసుకోవడం మూలంగా జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. జీవిత కాలంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న నేపథ్యంలో వారిలో అవగాహన కల్పించాలన్న సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. మాదకద్రవ్యాలు మనిషిలోని పరివర్తనను పూర్తిగా నశింపజేసి కృత్రిమంగా దెబ్బతీస్తాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వాడొద్దని పోస్టర్లను పాఠశాలల్లో అంటించారు. ఆర్మీ పబ్లిక్ పాఠశాల కౌన్సిలర్ డాక్టర్ సుధా మేనన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తాం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-బంజారాహిల్స్
హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో గల ప్రతాప్ నగర్ బై లైన్ లో రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయనిఆలని వాసుల ఫిర్యాదు మేరకు ఐదేవల స్వయంగా పరిశీలించిన మేయర్ మూడు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సోమవారం మొత్తం రూ.84 లక్షల వ్యయంతో (రూ.45 లక్షల అంచనా వ్యయంతో, మరొకటి రూ.39 లక్షల అంచనా వ్యయంతో) సుమారు 7 బై లైన్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి లతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఈ డివిజన్‌లో కన్నా వెంకటేశ్వర నగర్ డివిజన్ లో ఎక్కువ పనులు మంజూరయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ ఇచ్చిన ఆర్థిక ప్రోత్సాహంతో నగరంలో ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో మహిళలు స్వయం సహాయ సంఘాలలో చేరాలని సూచించారు. మహిళల ఆర్థిక సాధికారత సాధించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. గ్రేటర్ పరిధిలో మౌళిక సదుపాయాల కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థినిపై డాక్టర్ అనుచిత వ్యాఖ్యలు..

- ఓయూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ
ఓయూలోని హెల్త్ సెంటర్‌లో వైద్యం కోసం వచ్చిన విద్యార్థినిపై డాక్టర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై విద్యార్థుల ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థినివిషయాన్ని ఏబీవీపీ కార్యకర్తలకు చెప్పిన తీసుకువెళ్లగా వారు వెంటనే ఆ డాక్టర్ దగ్గరికి వెళ్లి ఆయనతో విద్యార్థినికి క్షమాపణ చెప్పించారు. ఈ విషయంపై రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో రిజిస్ట్రార్ స్పందిస్తూ ఆ వైద్యున్ని విధులకు రావద్దని సూచించారు. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పార్ట్ టైం అధ్యాపకుల సర్వీసులను ప్రభుత్వం ధ్రువీకరించాలి



- టీజీఆప్టా

నవతెలంగాణ-ఓయూ
తెలంగాణ ఆల్ యూనివర్శిటీ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ (టీజీఆప్టా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రం నాగేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్ట్ టైం లెక్చరర్లకు ఇచ్చిన హామీ రూ 50,000 వేతనం 12 నెలలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా 13 యూనివర్సిటీలలో పనిచేస్తున్న 800 పార్ట్ టైం లెక్చరర్లను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పార్ట్ టైం లెక్చరర్లుగా పేపర్ కటింగ్ చేస్తున్నామని, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యవర్గ సభ్యులు డా. మంచాల లింగస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే మ్యానిఫెస్టోలో ఇవ్వబడిన పార్ట్ టైం లెక్చరర్లను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యవర్గ సభ్యులు డా. బి.శ్రీనివాస్ మాట్లాడుతూ....ప్రభుత్వం వెంటనే పార్ట్ టైం లెక్చరర్ సర్వీసును ధ్రువీకరణ చేయాలన్నారు. టీజీఆప్టా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎర్రం నాగేందర్, ఉపాధ్యక్షులు డా.పరిపాల కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. శ్రీకృష్ణరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డా. మంచాల లింగస్వామి, డా. అల్లం చైతన్య, డా. మహేష్ మొల్లాడ్,డా. సురాపు వెంకట్, డా. కాటేపాగ యుగంధర్ డా. శ్రీనివాస్,డా. తాళ్ల అజయ్, డా. యుగంధర్, డా. సుభాష్, డా ఎర్రోళ్ల లక్ష్మణ్, డా. శేఖర్ పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి



నవతెలంగాణ-ఓయూ
హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ మంత్రి రాజేష్ ధర్మాని నేతృత్వంలోని 13 మంది సభ్యుల ప్రభుత్వ ప్రతినిధి బృందం సోమవారం ఓయూను సందర్శించారు. ఓయూలోని ఆయా విభాగాలు, పరిశోధన కేంద్రాలు, పరీక్షల నిర్వహణ విభాగాన్ని వారు పరిశీలించారు. అంతకు ముందు పరిపాలనా భవన్‌లో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్ తో పాటు ఆయా విభాగాల డీన్లు, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లతో భేటీ అయ్యారు. ఓయూ విద్యా బోధన, పరిశోధన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకన పద్ధతులపై వీసీ హిమాచల్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి వివరించారు. పరస్పర అకడమిక్, సాంకేతిక సహకారాన్ని పెంపొందించే దిశగా చర్చలు జరిగాయి. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన, ఓయూకున్న ఖ్యాతి, చరిత్ర, పూర్వ విద్యార్థుల బలం, పరిశోధన, ఉత్తుత్తి కేంద్రాలు, డిజిటల్ విద్యావిధానాలపై ప్రొఫెసర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ప్రధానంగా ఓయూ పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలు, ఆన్ స్క్రీన్ మూల్యాంకనం, ఫలితాల ఖచ్చితత్వం, ఫలితాల నిర్వహణలో ఆటోమేషన్ విధానాలను నొక్కి చెప్పారు. విద్యారంగంలో రాష్ట్ర విధానం, పాఠ్యాంశాల అభివృద్ధి వ్యూహాలు, జాతీయ విద్యావిధానం లాంటి అంశాలపై ఓయూకున్న స్పష్టమైన దృక్పథాన్ని అభినందించారు.హిమాచల్ ప్రదేశ్ మంత్రి రాజేష్ ధర్మాని... ఓయూ సమగ్ర విద్యా విధానం, మౌళిక సదుపాయాలు, ముందుచూపు నిర్ణయాలు, సాదర ఆతిథ్యం పట్ల హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ఇంజనీర్ రాజేష్ ధర్మాని సంతోషం వ్యక్తం చేశారు. ఓయూలోని ఉత్తమ విధానాలను హిమాచల్ లో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇందుకోసం ఓయూ లాంటి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థతో కలిసి పనిచేసేందుకు, భవిష్యత్తు సహకారాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఉన్నత విద్య, సాంకేతిక సహకారాల కోసం మార్గాలను అన్వేషించడానికి సమీప భవిష్యత్తులో అవగాహన ఒప్పందాన్ని రూపొందించుకుంటామని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి బృందం ఓయూలో అనేక కీలక విద్యా, పరిశోధన కేంద్రాలను సందర్శించి అధ్యయనం చేసింది. బృందంలో ఆ రాష్ట్ర సాంకేతిక విద్య అనుబంధ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు ఉన్నారు. సాంకేతిక విద్యా కార్యదర్శి కదం సందీప్, సాంకేతిక విద్యా డైరెక్టర్ అక్షయ్ సూద్ ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ప్రణాళిక, ఇంజనీరింగ్, సాంకేతిక బోర్డుల బృందంలో ప్రభుత్వ హైడ్రో ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ప్రొ. హిమాన్షు మోంగా ఈ ప్రతినిధి బృందాన్ని సమన్వయం చేశారు.

ఇమ్మడి మహేందర్‌కు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ
ఓయూ తెలుగు శాఖలో "తెలంగాణ సాహిత్య విమర్శ వికాసం" అనే అంశంపై ప్రొఫెసర్. సి. కాశీం పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్న డాక్టర్ ఇమ్మడి మహేందర్‌కు ప్రొఫెసర్, విద్యార్థులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. పరిశోధక విద్యార్థిగా ఒక్కోప్పు పరిశోధన కొనసాగిస్తూనే సామాజిక స్పృహతో విద్యార్థి ఉద్యమాలకు పాల్గొంటూ అవసరమైనప్పుడు తన ఆక్షరాలతో కదనరంగాన, తాము రాసే వ్యాసాలకు తుదిమెరుగులు దిద్దేవారు అన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన కవిగా, సాహిత్య విమర్శకునిగా, అధ్యాపకునిగా సామాజిక బాధ్యతతో ముందుకు రాణించాలని సామాజిక ఉద్యమాలకు భవిష్యత్తు లో కలిసి నడవాలని ఆయనకు హార్దిక శుభాకాంక్షలు.

మొదటి ప్రయత్నంలో సివిల్స్ సాధ్యం

- 21 సెంచరీ అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్
- మల్లారెడ్డి మహిళా వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో
మొదటి ప్రయత్నంలోనే విద్యార్థులు సివిల్స్ సాధించడం అంత కష్టమేమీ కాదని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్ అన్నారు. సోమవారం మల్లారెడ్డి మహిళా వైద్య కళాశాలలో 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ, విన్నర్స్ మీడియా, జీ5 మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి. కృష్ణ ప్రదీప్, డాక్టర్లు ఎలా పరిపాలనా రంగంలో విశేషంగా రాణించగలరో తెలియజేస్తూ, డాక్టర్ దరిశ్ ఆర్ అనే ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్ జిల్లా కలెక్టర్‌గా మారి, చైల్డ్ మ్యారేజెస్ నివారణ ద్వారా ప్రజారోగ్యంలో సంచలన మార్పులు తీసుకువచ్చిన ఉదాహరణను వివరించారు. మెడికల్ సైన్స్‌ను ఐచ్ఛిక విషయంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ, ఆత్మవిశ్వాసమే విజయానికి మూలం అని ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం చీఫ్ మెంటర్ భవాని శంకర్ మాట్లాడుతూ మహిళా శక్తి తక్కువేమీ కాదని దానికోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఇందులో భాగం గానే.... నారీ శక్తి ....ద్వారా ప్రభుత్వం వారికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రవేశ సమయంలో మహిళలకు ఫీజులో ప్రత్యేక రాయితీ ఉంటుందని కాని సమాన అవకాశం కల్పిస్తుందని, మహిళలు ప్రత్యేక హోదా కూడా ఉంటుందని ఈ అవకాశంతో సివిల్స్ సాధించడం సులభం అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 21 సెంచరీ ప్రత్యేకంగా రాసిన పుస్తకాలను ప్రారంభించి లైబ్రరీ అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రావు, డీన్ డాక్టర్ శ్రీలత, ఛాన్సలర్ డాక్టర్ సుధా రమణ, గిరి ప్రకాష్, ఎడిటర్ గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



నవతెలంగాణ-బంజారాహిల్స్
మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్,ఎంఎస్‌పీ ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు ఏడేలి నర్సింగ్ రావుతో పాటు పలువురు నేతలు సోమవారం ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే జరిగిన ఓ సమావేశంలో మందకృష్ణ మాదిగపై మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఏకవచన పనుల రామ్మూర్తి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. వెంటనే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ముఖ్య నాయకులైన బొల్లిగడ్డ కుమార్,కండె రామ్ కుమార్,బొప్పుల వేణు కుమార్,సురాని ప్రసాద్, కంచారి శేఖర్,లక్ష్మణ్,శివ,శంకర్,మాదిగలు ఉన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో
మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ మానక్ ప్రదర్శనలో పాల్గొని జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికయిన భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ జూబ్లీహిల్స్ విద్యార్థిని శ్రీ వైష్ణవి గోవర్ధన, సెయింట్ పీటర్స్ హైస్కూల్ బోయిన్‌పల్లి విద్యార్థిని కె.ఆర్య రెడ్డిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. అలాగే గైడ్ టీచర్లు, జిల్లా సైన్స్ అధికారి కె. ధర్మేందర్ రావును అభినందించారు. జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో ఉత్తమంగా ప్రదర్శించాలని విద్యార్థులకు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

24న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా ఉండనుంది. అపోలో ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డీ ఫారసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.11,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు హెచ్ఆర్ టి. రఘుపతి (మొబైల్ నెం : 8247656356) ను సంప్రదించాలని ఓ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఓయూ ఎంప్లాయిమెంట్ బ్యూరో,(యూఈఐ అండ్ జీబీ /ఎంసీసీ)వద్ద నేరుగా జనవరి 24న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పతంగులు ఎగరేస్తూ కాలుజారి బాలుడి మృతి

నవతెలంగాణ-నాగోల్

మేడపై పతంగి ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి పదేండ్ల బాలుడు మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్సై వి.రమేష్ అందించిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం మరిగూడెం గ్రామానికి చెందిన బర్ల బాలకృష్ణ కుమారుడు బర్ల మణిదీప్ (10) నాలుగో తరగతి చదువుతున్నాడు. బాలుడు సంక్రాంతి సెలవులు ఉండడంతో ఈ నెల 13న వాళ్ళ అమ్మ మమతతో కలిసి నాగోలు డివిజన్‌లోని దివ్యాంగుల కాలనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తన తాత గారి దగ్గరికివచ్చాడు. ఆదివారం లక్ష్మీ నరసింహ స్వామి కాలనీలో ఐదంతస్తుల మేడపై ఎక్కి పతంగులను ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయి తలకు తీవ్రమైన గాయమై మృతి చెందినట్టు ఎస్సై రమేష్ తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుని తండ్రి బర్ల బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారణతోనే సమస్యలకు పరిష్కారం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- పజావాణిలో మొత్తం 89

ఫిర్యాదుల పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో



నగరంతో పాటు ఓఆర్ ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్ టీఎల్) నిర్ధారణ పూర్తయితే చాలావరకు సమస్యలు పరిష్కారమౌతాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. నాలుగైదు నెలల్లో ఓఆర్ ఆర్ పరిధిలోని అన్ని చెరువులకు ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేకుండా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుందని.. భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మొత్తం 89 ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.

నేరుగా కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి.. అక్కడికక్కడే ఆయా ప్రాంతాలకు చెందిన అధికారులకు వాటిని కేటాయించడంతో పాటు.. క్షేత్ర స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో ఫిర్యాదుదారులు సంతోషం వ్యక్తం చేశారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి.. గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్) ఇమేజీలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి అందులో వాస్తవాలను వాకబు చేశారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి.. హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనేది గూగుల్ మ్యాప్స్, ఎన్ ఆర్ ఎస్ సీ ఇమేజీలను పరిశీలిస్తామన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన నిర్మాణాలను (అనుమతులు లేకుంటే) కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయి సర్వే చేయిస్తామన్నారు.

మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరలా పరిధిలో ఉండేదని.. క్రమీణ కబ్జాలు జరిగి చెరువు కుంచించుకుపోయిందని అక్కడ నివాసం ఉన్న వద్ధ దంపతులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మేడికుంట చెరువుకు హద్దులు నిర్ధారించి.. ప్రజావసరాలకు బఫర్ జోన్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల వరకూ ఉండే స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేసుకుంటూ వస్తున్నారని డిఫెన్స్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని.. అడ్డుకున్న తమపై దాడికి దిగుతున్నారని స్థానికంగా ఉండే భార్యాభర్తలు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ పార్కును అభివద్ధి చేయడానికి రూ. 50 లక్షలు ప్రభుత్వం విడుదల చేయడం, శిలాఫలకం వేయడం కూడా జరిగిందన్నారు. ప్రహరీ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తుంటే అడ్డుకున్నారని వాపోయారు.

ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు 'సగౌర' చేయూత

నవతెలంగాణ-సిటీబ్యూరో



మలక్‌పేట్‌లోని ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సగౌర చారిటబుల్ సోసైటీ వారు స్మార్ట్ టీవీ, స్పోర్ట్స్ డ్రెస్, బ్యాగ్ హెల్త్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఈ వస్తువులను సద్వినియోగం చేసుకోవాలనీ, అభివృద్ధి పథంలోకి వెళ్లాలని సూచించారు. సంస్థ సభ్యులు డాక్టర్ సూర్య ప్రకాష్. రావి పాపన్న, అనురాధ రెడ్డి విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు పరిమళా రెడ్డి, సంగీత, పరిమళ దేవి, పీఆర్‌టీయూటీఎస్ నాయకులు మందడి వెంకట్ రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడిని ఖండించిన టీఎస్‌యూటీఎఫ్



- వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ

పలు పాఠశాలల్లో నిరసన

నవతెలంగాణ-సిటీబ్యూరో



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై జరిగిన దాడిని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. గతనెల 23న హెడ్‌మాస్టర్‌పై అల్లరి మూకలు చేసిన దాడిని నిరసించడంతో పాటు వారిపై ఎఫ్ఐఆర్ బుక్ చేసి శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఉపాధ్యాయులపై జరుగకుండా నిలువరించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి శారద, మాజీ అధ్యక్షులు సంజీవ రావు, కార్యదర్శులు విశాలి, వంశీ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్, మాలతి, యుగంధరా చారిలతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 1415 దరఖాస్తులు

- అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



పెండింగ్ లో ఉన్న ప్రజావాణి అర్జీలను వచ్చే వారంలోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 1415 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అత్యధికంగా గహ నిర్మాణ శాఖకు 1272, రేషన్ కార్డుల కోసం87, పెన్షన్ 33, జీహెచ్ఎంసి8, డీఈఓ 9, ఇతర శాఖలకు సంబంధించినవి 6 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీఆర్ఓఈ వెంకట చారి, ఆర్డీఓలు రామకష్ణ, జిల్లా అధికారులు జి ఆశన్న,ఆర్ రోహిణి, పవన్ కుమార్, కోటజీ,సుబ్రహ్మణ్యం, ఇలియాజ్అహ్మద్, రాజేందర్ ,శ్రీరామ్,రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన మూడు రోజుల సమావేశం



- అసఫ్ జాహీ రాజవంశంపై నిర్వహణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం 1724 నుంచి 2024 వరకు 300 ఏండ్లలో రాజరికం నుంచి ప్రజాస్వామ్యానికి పరివర్తన చెందడాన్ని పురస్కరించుకుని అసఫ్ జాహీ రాజవంశంపై తన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును విజయవం తంగా ముగించింది. అసఫ్ జాహీ రాజవంశం 9వ నిజాం, మొదటి ప్రజాస్వామ్య నిజాం రౌనక్ యార్ ఖాన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ముగింపు కార్యక్రమంలో కవులకు అవార్డులు ప్రదానం చేస్తూ, "ఈ రోజు మనం నా పూర్వీకుల వారసత్వాన్ని మాత్రమే కాకుండా, మన ప్రియమైన హైదరాబాద్‌లో అభివద్ధి చెందుతున్న చైతన్యవంతమైన సంస్కతిని కూడా జరుపుకుంటాం" అని పేర్కొన్నారు. "డాక్టర్ అసఫ్ జాహీ రాజవంశం మా అన్వేషణలో ఉన్న అంకితభావం, పండితుల కఠినతను సిర్వండి కాగితం వివరిస్తుంది" అని వీసీఐడబ్ల్యుయూ వైస్ ఛాన్సలర్ సూర్య ధనంజయ్ వ్యాఖ్యానించారు. గౌరవనీయ అతిథి, తెలంగాణ రాష్ట్ర మైనారిటీల కమిషన్ చైర్మెన్ జనాబ్ తారీక్ అజీజ్, హైదరాబాద్ సాంస్కతిక ప్రకతి దశ్యంపై అసఫ్ జాహీ రాజవంశం తీవ్ర ప్రభావాన్ని నొక్కి చెప్పారు. ఈ సమావేశం ఉర్దూ సాహిత్యం, ముస్లిమేతర కవుల సమగ్ర రచనలపై సజీవ చర్చలకు వేదికను అందించింది. అసఫ్ జాహీ యుగం గొప్ప సాంస్కతిక వారసత్వాన్ని, సమకాలీన హైదరాబాద్‌లో వారి నిరంతర ప్రతిధ్వనిని జరుపుకుంటుంది.

ఎమ్మెల్యేను కలిసిన కనకరాజ్ గౌడ్



నవతెలంగాణ-కాప్రా

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కనకరాజ్ గౌడ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కనకరాజ్ గౌడ్‌కు కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బన్నాల ప్రవీణ్, వంజరి ప్రవీణ్ కరిపే, పెద్దాపురం కుమారస్వామి, నాగపురి రాజ్ గౌడ్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తా..

- కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-చర్లపల్లి

చర్లపల్లి డివిజన్‌లోని నేతాజీనగర్‌లో సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కాలనీ వాసులతో విస్తృతగా పర్యటించారు. కాలనీవాసులు యూజీడీ పైప్ లైన్, సీసీ రోడ్, ఎలక్ట్రికల్ పోల్స్ కావాలని కార్పొరేటర్‌ను కోరారు. ఎమర్జెన్సీ వర్క్స్ కింద యూజీడీ పనులను పూర్తి చేసిన తరువాత సీసీ రోడ్ పనులు పూర్తి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తానిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మహేష్, ట్రెజరర్ అశోక్, ఆర్గనైజర్ శ్రీనివాస్, భాస్కర్, స్థానిక నాయకులు ప్రభుగౌడ్, పాండు ముదిరాజ్, మల్లేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫుట్ వేర్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ హెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డులో అన్నపూర్ణ టిఫిన్ సెంటర్ దగ్గర ఫుట్ స్టైల్ ఫుట్ వేర్ షాప్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. షాపు యజమాని దినేష్‌కు కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి మంచి లాభాలతో వ్యాపారం సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మార్వాడి సంఘం అధ్యక్షులు కైలాష్ శర్మ, బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం అభివృద్ధి పనులకు తీర్మానం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో రూ.3కోట్ల 80 లక్షలతో 20 వార్డుల్లో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం జరిగిందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం నాగారం మున్సిపాలిటీలో చైర్మెన్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణాలకు తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాటాడుతూ.. నాగారం మున్సిపల్ అభివృద్ధికి ఈ ఐదేండ్ల కాలంలో సహకరించిన కౌన్సిలర్స్, నాగారం, రాంపల్లి పట్టణ ప్రజలకు అందరికీ ధన్యవాదాలు తెలియచేసారు. ఈ సమావేశంలో కమిషనర్ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలి



- కార్పొరేటర్ శ్రవణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, డివిజన్ అభివృద్ధికి సహకరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మల్కాజిగిరిలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్ పాల్గొని డివిజన్‌లోని పలు సమస్యలపై డీసీ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సఫిల్‌గూడ పార్క్‌లోని పాత ఆటవస్తువులు వెంటనే మరమ్మత్తు చెయ్యాలని, హెచ్ఎండీఏ నిధులతో చెప్పట్టిన ఫుట్‌పాత్ మరమ్మత్తులు వెంటనే చేసే విధంగా చూడాలన్నారు. ప్రతీ కాలనీ లేఫుట్‌లు ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దోమల పెరుగుదల అధ్యయనం, చర్యలు చెప్పట్టడం కోసం ఫాగ్గింగ్, శానిటైజేషన్ నుంచి నాలుగు మెన్ కమిటీ వేసి నివేదిక ఆధారంగా త్వరితగతిన చర్యలు చెప్పట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందు యాదవ్, మురళి గౌడ్, జోగు వెంకటేష్, రవి, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ పట్టణ ఐఎన్టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయ్ రావు తన జన్మదినం సందర్భంగా సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె విజయ్ రావుకు పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మంద కృష్ణపై చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికం



- పసుల రామ్మూర్తిని వెంటనే అరెస్ట్ చేయాలి
- వడ్డేపల్లి శివ మాదిగ, కొయ్యడ వెంకటేష్ మాదిగ

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగను ఉద్దేశించి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలు అప్రజాస్వామికమని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివ మాదిగ, జవహర్ నగర్ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్ మాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదయ్యను కలిసి మెమొరండం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగపైన అనవసరంగా ఇష్టానుసారంగా ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. అప్రజాస్వామికమైన మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగని ఏమైనా అంటే మాదిగలంతా పార్టీలకతీతంగా ఏకమై వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకునేంత వరకు పోరాడుతారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతునిచ్చే వారందరికీ ముఖ్యంగా బీసీల్లో ఉండబడే కవులు కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము ఆనంద్ మాదిగ, ఆనందాస్ ప్రకాష్, బిర్రు యాకస్వామి, గండి నరసయ్య, బూడిద వెంకటేష్, కొమ్ము ఆనంద్, మొగిలిపాక పరశురామ్, పులిపాక తిరుపతి, గుర్రం లక్ష్మయ్య, గుర్రం కొమురయ్య, కడారి గణేష్, ఎర్రోళ్ల ఆశయ్య, బిర్రు ఎల్లస్వామి, కొమ్ము ఇలాకాంత్, తిప్పగల్ల శ్రీరాములు, కలకొల్ల రమేష్, నూనెపాక శ్రీనివాస్, కలకొల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమాప్తం

- నేటి నుంచి గ్రామ సభలు
- అభిప్రాయ సేకరణ
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- 4 పథకాలపై స్పెషల్ ఫోకస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గణతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం చేపట్టిన సర్వే సోమవారంతో ముగిసింది. ఈ సర్వేలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది దాదాపు వారం రోజులు క్షేత్ర స్థాయి లో పర్యటించి లబ్దిదారులను గుర్తించారు. నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను రూపొందిం చనున్నారు. ఈ నెల 25న అర్హుల జాబితాకు ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర వేస్తే 26వ తేదీ నుంచి పథకాలను అమలు చేయనున్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని భూ భారతి, ధరణి పోర్టల్ సాఫ్ట్‌వేర్ నుంచి ఆర్ఓఆర్ రికార్డును తీసుకుని రెవెన్యూ, మండల పరిషత్, అగ్రికల్చర్ అధికారులు తుది సర్వేను నిర్వహించి జాబితాను సిద్ధం చేశారు. గృహాలు, కాలనీలుగా మారిన వ్యవసాయ భూములు, రియల్ ఎస్టేట్ లే అవుట్లు, పరిశ్రమలు, సాగునీటి కాలువలకు కేటాయించిన భూములు, ప్రభుత్వ అవసరాలకు సేకరించిన భూములు, సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించారు. అర్హుల జాబితాను సిద్ధం చేసేందుకు గ్రామ సభల నిర్వాహణకు ఇప్పటికే అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఈ వారం రోజులపాటు చేపట్టిన సర్వేలో గుర్తించిన లబ్దిదారులు అర్హులా..? కారా..? అని తేల్చేలందుకు నేటి నుంచి జిల్లాల్లోని రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సభలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ మండలంలో 24, మూడు చింతలపల్లి



సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ (ఫైల్)

మండలంలో 11, శామిర్‌పేట మండలంలో 11, ఘట్‌కేసర్ మండలంలో 11, కీసర మండలంలో 6 గ్రామ సభలు నిర్వహించనున్నారు. మున్సిపాల్టీలు, జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుల వారీగా సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో ఈ వారం రోజులపాటు సర్వేలో సేకరించిన వివరాలను డిస్‌ప్లే చేసి అభిప్రాయాలు సేకరించనున్నారు.

సాగుకు యోగ్యం లేని భూమి 14వేల ఎకరాలు

సాగుకు యోగ్యమైన భూమికే పరిహారం అందించాలనే లక్ష్యంతో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు, గుట్టలు, కాలువలు, ప్లాట్లు, ఇండ్లు తదితర ప్రాంతాలను గుర్తించారు. ధరణి పోర్టర్‌లో నమోదైన భూముల ఆధారంగా సర్వే చేపట్టినట్టు సమాచారం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 79,229 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో దాదాపు 64,800 ఎకరాల వరకు సాగు భూమి, దాదాపు 14,400 ఎకరాల వరకు సాగుకు యోగ్యం లేని భూమి ఉన్నట్టుగా అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఇందులో మేడ్చల్ మండలంలో దాదాపు 4వేల ఎకరాలు, కీసర మండలంలో దాదాపు 2,695 ఎకరాలు, మూడు చింతలపల్లి మండలంలో దాదాపు 661 ఎకరాలు, శామిర్‌పేట మండలంలో దాదాపు 2,821 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో దాదాపు 1,630 ఎకరాలు, గండి మైసమ్మ మండలంలో దాదాపు 1,284 ఎకరాల వ్యవసాయ భూమి సాగుకు యోగ్యం లేనట్టుగా అధికారులు గుర్తించినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ సాగుకాని భూములకు భరోసా దక్కే అవకాశం లేనట్టు తెలుస్తోంది. కాగా జిల్లాలో సాగులో ఉన్న పంట భూముల్లో పండ్లు, కూరగాయల తోటలు, ఆయిల్‌ఫాం తదితర ఉద్యానవన పంటలకు సైతం రైతు భరోసా ఇవ్వనున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ప్లాట్లు, పెట్రోల్ పంపులు, భవంతులు, మైనింగ్ అనుమతి పొందిన భూములకు కొన్ని చోట్ల పెట్టుబడి సాయం అందించారు. ఈ సారి అలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అర్హులకే రైతు భరోసా అందించాలనే కసరత్తు జరుగుతోంది. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో జిల్లా వ్యాప్తంగా 1,43,267 దరఖాస్తులు రాగా, అన్నింటినీ అధికారులు సర్వే పూర్తి చేసి గ్రామ సభల్లో డిస్‌ప్లే చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడుకి నివాళి

నవతెలంగాణ-కాప్రా



సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీనియర్ నాయకులు మహమ్మద్ ఆండాలి సంస్మరణ సభ జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జే చంద్రశేఖర్ అధ్యక్షతన ఏఎస్‌రావు నగర్‌లోని డాక్టర్ హోమీ జే బాబా కమ్యూనిటీ హాల్ నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యదర్శి పి సత్యం మాట్లాడుతూ.. ఆండాలి ఈసీఐఎల్‌లో ఉద్యమ నిర్మాణంలో భాగస్వామ్యం కావటమే కాక స్థానికంగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. పార్టీ పట్ల, సమాజం పట్ల, ప్రజల పట్ల నిబద్ధతతో కృషి చేశారని అన్నారు. ఆ తర్వాత కాలంలో జన విజ్ఞాన వేదిక కార్యకలాపాలలో ముందు పీఠిన నిలిచి ప్రజల్లో శాస్త్ర విజ్ఞానం విస్తృతంగా తీసుకు వెళ్లడం కోసం కృషి చేశారని చెప్పారు. ఆండాలి తమ కుటుంబాన్ని కూడా పార్టీ ఆశయాలకు అనుగుణంగా పెంచారని తెలిపారు. అయనకి పార్టీ తరపున నివాళులర్పిస్తూ.. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం జగ్గరాజు, డాక్టర్ బి.యస్.రెడ్డి, డాక్టర్ కోయా వెంకటేశ్వరరావు, మాణిక్యాలరావు, డాక్టర్ కొండారెడ్డి, ఏ కే దుర్గాచార్యులు, జన విజ్ఞాన వేదిక నాయకులు తదితరులు ప్రసంగించారు. ఆండాలి అమర్ రహే అని నినాదాలు చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికి కుటుంబ సభ్యులు జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన నమ్మకాలు వాస్తవాలు అనే పుస్తకాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, జగన్, సత్యం, యాదయ్య, శోభ, శారద, వినోద, సంతోష్, గౌడుగు యాదగిరిరావు, సిహెచ్ ప్రసాద్, సోమ యాచారి, గుమ్మడి హరిప్రసాద్, బసవ పున్న య్య, కేసీఆర్ దాస్, కర్రె మల్లేశం జెవివి శ్రీనివాస్, డాక్టర్ బి.యస్.రెడ్డి, కోయ వెంకటేశ్వర రావు, పిరాజా, మహేంద్రం, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించి సంతోషాన్ని పొందాను



- కౌన్సిలర్ వంగేటి లావణ్య హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

గిర్మాపూర్ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందినప్పటి నుంచి వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించి సంతోషాన్ని పొందినట్టుగా కౌన్సిలర్ వంగేటి లావణ్య హన్మంత్ రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డితో కలసి డ్వాక్రా మహిళా భవనాన్ని ప్రారంభించారు.ఇచ్చిన మాట ప్రకారం తన పదవి కాలం ముగిసేలోపు డ్వాక్రా భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలను సైతం ఎదుర్కొని ఐదేండ్ల పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నాయకులు మర్రి నర్సింహ రెడ్డి, హన్మంత్ రెడ్డి, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, చీర్ల సత్యనారాయణ, కొండం ఆంజనేయులు, రవిందర్ రెడ్డి, విష్ణు గౌడ్, అంజి రెడ్డి, రాఘవ రెడ్డి, రాగం అర్జున్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాగరాజు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ వినాయక్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్ల నాగరాజు ఆధ్వర్యంలో ధరణ్ పుట్టినరోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అడుగుజాడల్లో నడుస్తూనన్నారు. నాకు అత్యంత ప్రియమైన స్నేహితులు నాగరాజు ప్రత్యేకంగా నా పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలపడం చాలా ఆనందంగా ఉన్నదని తెలిపారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాండురంగా చారీ, సాయి నరేష్, బాలరాజు, తాళ్ల సందీప్, భరత్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్, పార్కు అభివృద్ధికి కృషి

- ఎంపీ ఈటల రాజేందర్
- ఎమ్మెల్యే, కార్పొరేటర్‌తో కలిసి నెహ్రూనగర్ కాలనీలో పర్యటన



నవతెలంగాణ-చర్లపల్లి

మల్లాపూర్ నెహ్రూనగర్ కాలనిలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. సోమవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ, ఎన్ఎఫ్‌సీ కంపెనీ ప్రహరీగోడను అనుకోని ఉన్న టీఎస్ఐఐసీ మౌలాలికీ సంబంధించిన మల్లాపూర్ గ్రామా సర్వే నెం 43, 44, 45లో ఖాళీ స్థలము ఉన్నది, ఇట్టి ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం వారు స్వాధీనం చేసుకొని, స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాలు, పార్కును అభివృద్ధి చేస్తే, స్థానిక ప్రజలకు చాల ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరారు. అందుచేత ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి స్థలన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలంలో జీహెచ్ఎంసీ వారు గతంలో నిర్మించిన డ్రయినేజ్, సెప్టిక్ టాంకులు, అలయాల్లను పరిశీలించారు. ఎన్ఎఫ్‌సీ కంపెనీ వారు ఖాళీ స్థలములో అభివృద్ధికి ఆటకం పడుతున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీ అధికారులతో చారవణిలో మాట్లాడారు. స్థల సమస్యను పరిష్కరించి స్థానికులకు ఉపయోగపడే విధంగా కృషి చేస్తానని, స్థానిక ప్రజలకు ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నెహ్రూ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నేస్ పార్క్ ప్రారంభం



నవతెలంగాణ-నాచారం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌ను రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ సునితా రావు మాట్లాడుతూ.. డీపీఎస్ పాఠశాలలో 20 సంవత్సరాలలో చేసిన ప్రగతిని తెలియజేశారు. పాఠశాల చైర్మెన్ మల్కా కొమరయ్య పల్లవి డీపీఎస్ స్కూల్స్ విద్యా ప్రయాణం గురించి, పర్యావరణం, సమాజం కోసం భవిష్యత్ అభివద్ధి ప్రణాళికలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ పీజీఓఎస్ బ్రాంచీల కోసం రీసెర్చ్ అండ్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ (ఆర్ఆర్) అధికారిక ప్రారంభంగా నిలిచింది. ఈ విభాగం ఉత్తమ విద్యను ప్రోత్సహించడంలో సహాయపడగలదని, అందరికీ నిరంతర అభివద్ధి జరగాలని సంకల్పించింది. ప్రతి సంవత్సరం డీపీఎస్ విద్యార్థులు వారి దాతత్వాన్ని చాటే "జాయ్ ఆఫ్ గివింగ్" అనే వార్షిక డీపీఎస్ సాంప్రదాయంలో భాగంగా ఫస్ట్ ఎయిడ్ కిట్స్, రీయూజబుల్ వాటర్ బాటిల్స్, టవల్స్, నాప్కిన్స్, స్టేషనరీ సరఫరాలు, ముడి ఆహారం, స్టీల్ పాత్రలు, శీతాకాల దుస్తులు, శానిటర్ ఉత్పత్తులను విరాళంగా 15 పైగా ఎన్‌జీఓలకు అందజేశారు. విశిష్ట అతిథి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (టీఆర్‌బీ) వికాస్ రాజ్ విలువైన సందేశం ద్వారా సహానుభూతి, అప్రతిపత్తి, మానవత్వం ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, డీపీఎస్ సంస్థ డైరెక్టర్ పల్లవి, సీఈఓ, డైరెక్టర్ యశస్వి మల్కా, డైరెక్టర్ త్రిభువన, పాఠశాల ఉపాధ్యాయుల బందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాలుగో మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) నాలుగోవ మహాసభల పోస్టర్‌ను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆఫీస్ కమలానగర్‌లో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి సత్యం మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 25వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి భారీ ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, బి.వి. రాఘవులు హాజరవుతారన్నారు. ఈ ర్యాలీ బహిరంగ సభ మేడ్చల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు ప్రజలు పాల్గొనాలని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు రోజులు జరిగే మహాసభలలో భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకుంటామని తెలిపారు. మహాసభలలో రైతులు మహిళలు కార్మిక విద్యార్థి యువజనుల సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కార మార్గాలను ప్రత్యామ్య విధానాలను ప్రజల ముందు ఉంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జె చంద్రశేఖర్, ఎర్ర అశోక్, జి.శ్రీనివాసులు, రాజశేఖర్, ఎం వినోద, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ సంతోష్, నాయకులు బీవీ సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, జీవీ రావు, గోసియా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని బీఆర్ఎస్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు కరిపే ప్రవీణ్ వంజరి మర్యాదపూర్వకంగా కలిశారు. నవతెలంగాణ-కాప్రా



జై భీమ్ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడు చింతలపల్లి మండలం కేశ్వాపూర్ గ్రామంలో జై భీమ్ యూత్ సేవా సంఘం మొదటి వార్షికోత్సవం సందర్భంగా సంఘం సభ్యులు జై భీమ్ సేవా సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం డైరీ పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి జై భీమ్ సోదరులు బారి ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సంఘం సంయుక్త కార్యదర్శి, మాజీ సర్పంచ్ బుడిగే ఇస్తారి, ఉడుత వెంకటేశం, రైతు కమిటీ చైర్మెన్ ఎడ్ల సుధాకర్ రెడ్డి, రెడ్డి జాగృతి వ్యవస్థాపకులు బుట్టెమ్ మాధవ రెడ్డి, బిల్ల విజయ కుమార్, పల్లపు రాంబాబు, కేశ్వపూర్ జై భీమ్ యూత్ సేవా సంఘం అధ్యక్షుడు బుడిగే రఘు, ఉపాధ్యక్షుడు బుడిగే ముత్యాలు, జనరల్ సెక్రటరీ బుడిగే యాదగిరి, కోశాధికారి బుడిగే పరశురాం, కార్య నిర్వాహక సభ్యులు దాసరి నగేష్, కార్యక్రమము నిర్వాహక సభ్యులు దాసరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి వాడుకలోకి తేవాలి



- రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు రంగుల శంకర్
- ప్రజాదర్బార్‌లో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌లో కేటాయించిన క్రీడా మైదానంను అభివృద్ధి చేసి వాడుకలోకి తేవాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు రంగుల శంకర్ అన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసి ప్రజాదర్బార్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జవహర్ నగర్‌లో 2020లో ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం క్రీడా మైదానం కోసం కేటాయించి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం యొక్క సూచిక బోర్డు మాయం చేసిన విషయంలో తక్షణమే విచారణ చేపట్టి కారకులను శిక్షించాలని, ఆ స్థలానికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసి క్రీడాకారులకు ఉపయోగపడేలా చేయాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యం సుజాత రాష్ట్ర ఎస్సీ మోర్చా సెక్రటరీ, లక్ష్మీ రెడ్డి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు మహేష్ గౌడ్, సెక్రటరీ కే శివ కేశవ్, బీజేపీ మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, రాహుల్ సింగ్ బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్, నోముల సాయినాథ్, బాలకృష్ణ, భాను ప్రకాష్ బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

టీనేజ్‌లోకి అడుగుపెట్టే సమయంలో అమ్మాయిల్లో రకరకాల ఆలోచనలు మొదలవుతాయి. వారికే కాదు వారి తల్లిదండ్రుల్లోనూ కొంత ఆందోళన ప్రారంభమవుతుంది. పిల్లలకు ఏది ఎంతవరకు చెప్పాలి? ఏది చెప్పకూడదు? ఇలా ఎన్నో సందేహాలు, అపోహలు మదిలో ఉంటాయి. ఎందుకంటే బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగుపెడుతున్న ఈ దశ ఎంతో కీలకం. ఇప్పుడు ఏర్పరచుకునే అలవాట్లు, జీవనశైలి సూత్రాలే వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది. కనుక ఈ సమయంలో పేరెంట్స్ కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం.



టీనేజ్ అమ్మాయిలతో ఇలా..

పిల్లలు ప్రతి విషయాన్ని నేర్చుకునేదీ ఈ సమయంలోనే. అంతేకాదు భావోద్వేగాల పరిణతి కూడా ఇప్పుడే వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో వారిని విమర్శిస్తూ, కఠినంగా వ్యవహరిస్తే కుటుంబంతోనే కాకుండా, తోటి పిల్లలతోనూ వాళ్ళ ఎమోషనల్‌గా దూరమయ్యే అవకాశం వుంది. ఫలితంగా తమ సమస్యలను చెప్పడానికి ముందుకురాక ఇబ్బంది పడుతుంటారు. కాబట్టి, తప్పు సరిచేసేముందు వాళ్ల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. ఈ సమయంలో కుటుంబం, టీచర్లు వాళ్లను మరింతగా అర్థంచేసుకోవాల్సి వుంటుంది.

అపోహలు తొలగిస్తేనే

ముఖ్యంగా ఈ సమయంలో వచ్చే పీరియడ్స్.. శారీరకంగా, మానసికంగా అమ్మాయిల్లో చాలా మార్పులు సంభవిస్తాయి. కాబట్టి, వాటి గురించి పీరియడ్స్ మొదలవ్వకముందే అర్థమయ్యేలా లాజికల్‌గా, మనసు నొప్పించకుండా వివరించాలి. అప్పుడే వారి మనసులో ఉన్న భయాలు, అపోహలూ తొలగిపోయి.. వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటారు.

శుభ్రతా ముఖ్యమే

పీరియడ్స్ ప్రారంభమయ్యాక పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి. ముఖ్యంగా ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే.. ప్రతి 4-6 గంటలకొకసారి ప్యాడ్ మార్చుకునేలా చూడాలి. మెన్‌స్ట్రువల్ కప్స్ వంటివి వాడుతుంటే వాటిని శుభ్రపరచడం, స్టెరిలైజ్ చేయడం వంటివి నేర్పించాలి. క్రమం తప్పకుండా స్నానం, దుస్తులు, లోదుస్తులు వంటివి మార్చుకోవడం అలవాటు చేయాలి. అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉత్సాహంగా వుంటారు.

ఎదుగుదలకు తగినట్టు...

ఎదిగే వయసులో ఉన్న అమ్మాయిలకు పోషకాహారం తప్పనిసరి. ఎంత బిజీగా ఉన్నా సరే.. పిల్లలకు మంచి ఆహారం అందించడం మాత్రం మర్చిపోవద్దని నిపుణులు సలహా ఇస్తున్నారు. అధిక ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, లో ఫ్యాట్, లో కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం ఇవ్వాలని సూచిస్తున్నారు. దీని గురించి ఒకరోజు ముందుగానే ప్రణాళిక వేసుకుంటే వాటి తయారీ సులభం అవుతుంది.

నీళ్లు తాగాలి...

ఆహారం ఒక్కటే కాకుండా.. సరైన మోతాదులో నీళ్ల తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. చాలా మంది పిల్లలు చదువుల్లో పడి స్కూల్లో నీళ్ల తాగడం మర్చిపోతుంటారు. రోజుకి కనీసం 12గ్లాసుల నీళ్ల తాగేలా వారిని చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అలాగే చక్కెరలేని పండ్లరసాలు తాగించాలి. కాఫీ, టీ, కార్బొనేటెడ్ డ్రింక్‌లు, కృత్రిమ తీపి కలిగిన పానీయాలకు దూరంగా ఉంచాలి.

హార్మోనుల్లో మార్పులు

ముఖ్యంగా టీనేజ్ పిల్లలను ఇబ్బందిపెట్టే మరో సమస్య మొటిమలు. ఇవే వారిలో ఆత్మన్యూనతకూ దారితీస్తాయని నిపుణులు అంటున్నారు. కాబట్టి, ఇందుకు కారణం హార్మోనుల్లో మార్పులే అని పిల్లలకు అర్థమయ్యేలా చెబుతూనే వాటి గురించి జాగ్రత్తలూ వివరించాలి. వాటిని గిల్లడం, వత్తడం లాంటివి చేయనీయకుండా చూసుకోవాలి. పీహెచ్ సమతుల్యత ఉన్న ఫేస్‌వాష్‌ను రోజుకి రెండుసార్లు వాడాలి.. ఆయిల్ ఫేస్‌క్రీములకు దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా అమ్మాయిల్లో అండర్ ఆర్మ్స్, ప్రైవేట్ భాగాల్లోని అవాంఛిత రోమాలు చెమట, ఇన్ఫెక్షన్లకూ దారితీయొచ్చని.. కాబట్టి, షేవింగ్, వ్యాక్సింగ్ వంటి పద్ధతులను పిల్లలకు వివరించాలి. ఇకపోతే బ్రెస్ట్ ఎదుగుదల, బ్రా వేసుకోవడం లాంటి విషయాలు వాళ్లకు పూర్తిగా కొత్తగా ఉంటుంది. అందుకే వాళ్లలో వచ్చే ఈ మార్పులన్నింటి గురించి సిగ్గుపడకుండా, సౌకర్యంగా మనతో మాట్లాడగలిగేలా ప్రోత్సహించాలి.

అదీ చెప్పాలి

ఇవేకాకుండా.. టీనేజ్ పిల్లలకు వారి పరిధి మేరకు సెక్స్ ఎడ్యుకేషన్ గురించి అవగాహన కల్పించడమూ ముఖ్యమేనని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ లాంటి వాటి గురించీ తెలియజేయాలని సూచిస్తున్నారు. అప్పుడే వాళ్ల చైల్డ్ అబ్యూజింగ్ లాంటివి ఎదుర్కోకుండా ఉంటారని.. ఫలితంగా ఇలాంటి విషయాల గురించి ధైర్యంగా మనతో మాట్లాడతారు.

వ్యాయామంతో

సిగ్గు, బిడియం వల్ల టీనేజ్ పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి, ఆ ఫీలింగ్స్‌ను పోగొట్టి వాళ్ల బయటకు వచ్చేలా ప్రోత్సహించాలి. అందుకోసమే స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, వాకింగ్, రన్నింగ్ ఇలా ఏదో ఒకదాన్లో భాగమయ్యేలా చూడాలి. ముఖ్యంగా వ్యాయామం అలవాటు చేయడం వల్ల భవిష్యత్తులో పిల్లలకు జీవనశైలి వ్యాధులు రాకుండా ఉంటాయి.

ప్రశాంతంగా

శరీరంలో వచ్చే మార్పులు ఒకవైపు, చదువు మరోవైపు ఫలితంగా పిల్లల్లో ఒత్తిడి కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, రోజుకి ఒక గంటైనా వాళ్ల ప్రశాంతంగా కూర్చొనేలా సమయమివ్వాలి. ఇది వాళ్ల గురించి వాళ్ల ఆలోచించుకునేందుకు సాయపడుతుంది. డ్రాయింగ్, పెయింటింగ్, కథల పుస్తకాలు, క్రియేటివ్ క్రాఫ్ట్‌వర్క్ వంటివి చేసేలా పిల్లలను ప్రోత్సహించాలి. అప్పుడే మానసికంగా బ్యాలెన్స్‌డ్‌గా ఉండగలుగుతారు.

గాఢ నిద్ర ఉంటే

రాత్రిపూట కనీసం 7గంటలపాటు గాఢనిద్ర ఉండేలా చూసుకోవాలి. నిద్రించేటప్పుడు తాజా, పరిశుభ్రమైన దుస్తులు వేసుకునేలా చూడాలి. పడుకునే ముందు కాఫీ, టీలు వంటివి ఇవ్వకూడదు. ఇంకా పరీక్షల సమయంలో రాత్రంతా మేలుకుని చదవకుండా ముందు నుంచే సన్నద్ధమయ్యేలా చూడాలి. ఇవన్నీ నిద్ర నాణ్యతను పెంచేవని నిపుణులు వివరిస్తున్నారు. ■

ఈ గింజలతో...

గుమ్మడి గింజల్లో ఫైబర్, విటమిన్ ఏ, బీ, సీ ఈ తో పాటు ఐరన్, కాల్షియం, జింక్, ఫోలేట్ , ఫ్యాటీ యాసిడ్స్, ఫాస్ఫరస్, పొటాషియం, జింక్, అమైనో యాసిడ్స్ ఫినోలిక్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. తరచూ.. గుమ్మడి గింజలు తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గుతారు..

గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అధిక బరువు సమస్య ఉన్నవారు వీటిని తింటే.. మేలు జరుగుతుంది. రోజూ వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. పొట్ట నిండిన ఫీలింగ్ ఉంటుంది. దీనితో ఫుడ్ క్రేవింగ్ తగ్గుతుంది. ఫలితంగా బరువు కంట్రోల్‌లో ఉంటుంది. గుమ్మడి గింజలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

క్యాన్సర్‌కు చెక్..

గుమ్మడి గింజల్లోని కెరొటినాయిడ్లు, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుమ్మడి గింజలు తరచుగా తీసుకుంటే.. గ్యాస్ట్రిక్, ప్రోస్టేట్, బ్రెస్ట్, లంగ్, పేగు కేన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. నెలసరి నిలిచిన మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు తగ్గటానికీ గుమ్మడి గింజలు తోడ్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

గుండెకు మంచిది..

గుమ్మడి గింజల్లో మెగ్నీషియం మెండుగా ఉంటుంది. మెగ్నీషియం హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంచుతాయి. గుమ్మడి గింజలు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఒత్తిడిని నివారిస్తాయి.

కండరాల ఆరోగ్యానికి మంచిది..

గుమ్మడి గింజలు కండరాల ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. వీటిల్లో ప్రనాగమిక్ ఆసిడ్ ఉంటుంది. దీన్నే పనాగమేట్, విటమిన్ బి-15 అని కూడా అంటారు. ఇది జీవకణంలో జరిగే సెల్ రెస్పిరేషన్ సక్రమంగా జరిగేలా చేస్తుంది.

షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది..

షుగర్ పేషెంట్స్‌కు గుమ్మడి గింజలు మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో యాంటీడయాబెటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతాయి.

జుట్టు స్ట్రాంగ్‌గా ఉంటుంది..

రోజూ చెంచా గుమ్మడి విత్తనాలను తీసుకుంటే జుట్టు దృఢంగా ఉంటుంది. గుమ్మడి గింజల్లోని సెలెనియం, మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం, కాపర్, ఏ, బీ, సీ విటమిన్లు జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. ■



దావోస్‌కు సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందులో భాగంగానే భారీ పెట్టుబడుల లక్ష్యంతో పలు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరుపనుంది.

తెలంగాణలో కింగ్‌ఫిషర్ రీ ఎంట్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఊరటనిచ్చింది. ధరల పెంపునకు సంబంధించి కంపెనీ 33.1 శాతం పెంచాలని కోరగా, సర్కార్ 15 నుంచి 20 శాతం వరకు పెంచడంతో పాటు పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ నేపథ్యం లోనే బీర్ల సరఫరాను రాష్ట్రంలో పునరుద్ధరిస్తున్నట్టు ఆ కంపెనీ వెల్లడించినట్టు తెలుస్తోంది.

రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్, ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు ఆ నివేదికను అందజేయ నుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఆ కమిటీలో సభ్యులుగా మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎమ్మెసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ తదితరులను నియమించారు.



మరణించే వరకూ జైల్లోనే ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానిస్తూ ఈ కేసు అరుదైన కేసు అని తాను భావించడం లేదని చెప్పారు. 'జీవితంలో చివరి రోజు వరకూ సంజయ్ రాయ్‌ను జైలులో ఉంచాలి' అని తీర్పులో జడ్జి తెలిపారు. అలాగే బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం ఇవ్వాలని జడ్జి తెలిపారు. ఇందులో పది లక్షలు బాధితురాలి మరణానికి, ఏడు లక్షలు అత్యాచారానికిగా తెలిపారు. అలాగే దోషి సంజయ్‌రాయ్‌కు రూ. 50,00 జరిమానాను కూడా కోర్టు విధించింది.

అయితే తమకు ఎలాంటి పరిహారం అక్కర్లేదని బాధితురాలి తల్లిదండ్రులు కోర్టుకు తెలిపారు. 'మా కుమార్తెకు న్యాయాన్ని మాత్రమే మేం కోరుకుంటున్నాం. అంతకన్నా ఇకేం వద్దు' అని తల్లిదండ్రులు తెలిపారు. దీనికి జడ్జి స్పందిస్తూ 'ఈ మరణాన్ని పూడ్చలేమని నాకు తెలుసు. అయితే బాధితురాలు డ్యూటీ డాక్టర్ కావున ప్రభుత్వానికి బాధ్యత ఉంటుంది. అలాగే మేం చట్టానికి కట్టుబడి ఉన్నందున ఈ పరిహారం చెల్లించాలి' అని తెలిపారు. ఈ కేసులో ఈ నెల 18నే సంజయ్‌రాయ్‌ను కోర్టును దోషిగా నిర్ధారించిన సంగతి తెలిసిందే.

మైలారం మైనింగ్‌పై ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు దిగారు. రోడ్డుపై ముండ్ల కంప వేసి బైటాయించారు. గ్రామస్తులకు మద్దతుగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన ప్రొఫెసర్లు హరగోపాల్, లక్ష్మణ్‌ను పోలీసులు మధ్యలో అడ్డుకుని అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలు చేపట్టరాదని గతంలో 2003-2004లో తీవ్రంగా వ్యతిరేకించా మని గ్రామస్తులు గుర్తు చేశారు.

నాటి నుంచి కొంతకాలం సద్దుమణిగినా... మళ్లీ ఐదారేండ్లుగా మైనింగ్‌ను తవ్వాలంటూ కాంట్రాక్టర్లు రావడంతో వారిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మైనింగ్ తవ్వకాలను ఆపాలని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీలు తీసుకున్నామని, కానీ మైనింగ్‌పై ఎలాంటి నిలిపివేత చర్యలు తీసుకోకపో వడంతో పార్లమెంటు ఎన్నికలను బహిష్కరించి, అప్పుడు రాస్తారోకో కూడా చేశారు. ప్రస్తుతం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపేందుకు పోలీసు వారి అనుమతి కోరామని అయినప్పటికీ గ్రామంలో రాస్తారోకో నిర్వహించే సమయంలో ఉదయాన్నే గ్రామానికొచ్చి ముందస్తు అరెస్టులంటూ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ముండ్ల కంప వేసి బైటాయించారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన వారిని వెంటనే మా గ్రామానికి తీసుకొచ్చి తమకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి.. ముందస్తు అరెస్టులు చేస్తారా అంటూ ప్రశ్నించారు. సాయంత్రం వరకు అరెస్టు చేసిన వారిని పోలీసులు విడుదల చేయకపోవడంతో ఆందోళన కొనసాగించారు. అరెస్టు అయిన వారిలో గ్రామానికి చెందిన సుమిత్ర, పెద్ద లింగయ్య, చిన్న లింగయ్య, భాస్కర్ గౌడ్, సత్యం, వెంకటేశ్వర్లు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుంచి రాస్తారోకో నిర్వహించడంతో గ్రామానికి చెందిన శాంత అనే మహిళ స్పృహ తప్పి పడిపోయారు. దాంతో మైనింగ్ మా ప్రాణాలమీదకు వచ్చిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాస్తారోకో విషయం తెలుసుకున్న బీఎల్ఎఫ్ నాయకులు శ్రీశైలం, ఎంఎం గౌడ్ అక్కడికొచ్చి వారికి మద్దతు తెలిపారు. మైలారం గుట్ట మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరగా..వారిని వెల్దండ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కాగా, అచ్చంపేట బల్మూరు ప్రధాన రహదారి నుంచి, మైలారం గేటు నుంచి గ్రామం వరకు భారీగా పోలీసులు మోహరించారు. కొత్తవారిని ఎవరినీ రానివ్వడం లేదు.



ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాలకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తులో రైతుల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కోర్టుకు వెళ్తామని, నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలనా వ్యవస్థ గాడి తప్పిందని, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు దెబ్బతిని పోతున్నాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రయివేటుపరం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని దీనిపై ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు, దళితులు, మైనారిటీలపై అక్రమాలు పెరిగిపోతున్నాయని అన్నారు. సిద్దిపేటలో కార్మిక కర్షక భవన్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఈ భవనం పేద ప్రజలు, రైతులు, కార్మిక వర్గానికి, అన్యాయానికి గురైన వారికి అండగా నిలబడాలని సూచించారు. సమస్య వస్తే కార్మిక కర్షక భవన్ వైపు చూసేలా పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. సిద్దిపేటకు విచ్చేసిన బీవీ రాఘవులుకు సీపీఐ(ఎం) కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

కష్టజీవుల పక్షపాతి ఎర్రజెండా : చుక్క రాములు

కార్మికులు, ఉద్యోగులు, పేదలు, రైతులు, మహిళల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతున్నాయని, ఆ కష్టజీవుల పక్షపాతిగా ఎర్రజెండా పోరాడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. శ్రామిక ప్రజల పోరాటాల వేదికగా కార్మిక, కర్షక భవన్ పని చేస్తుందన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కనీస వేతనాలు అమలు చేసి, శ్రమకు తగిన ఫలితం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కార్మిక హక్కుల్ని పునరుద్ధరిస్తామని చెప్పిన పాలకులు అధికారంలోకి వచ్చాక వాటి గురించే పట్టించుకోవడంలేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఎన్నికలు నిర్వహించి వేతనాలు, ఇతర సదుపాయాల్ని మెరుగుపరచాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవలందిస్తున్న ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలకు కనీస వేతనాలు, పర్మినెంట్, తదితర హామీల్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విదేశీ పర్యటనలు పెట్టుబడుల కోసమా? తీర్థయాత్రలా? : బీవీ రాఘవులు

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తామని గతంలో రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, బీఆర్ఎస్ అది నాయకులు, ఇప్పుడు రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేయడం వల్ల ఇంత వరకు రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు రాలేదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సిద్దిపేటలో కార్మిక కర్షక భవన్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు అంటూ తీర్థయాత్రల్లా తిరుగుతున్నారని విమర్శించారు. నల్ల ఒప్పందాల కోసమే విదేశీ పర్యటన చేస్తున్నారని, ఈ పర్యటనలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. మోడీ రూ.50 లక్షల మందికి ల్యాండ్ కార్డు ఇస్తామని చెప్పడంతో రైతులు ధనవంతులుగా అయ్యే అవకాశం ఉందని చిత్రీకరించి లేనిపోని అపోహలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ల్యాండ్ కార్డుతో మన్యం భూములకు, సాదా బైనామాలకు, పోడు భూములు, పేదల భూములకు అన్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ల్యాండ్ కార్డు తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తమై కేంద్ర అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ, సహాయ కార్యదర్శి పద్మశ్రీ, రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభన్, సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, రవికుమార్, భాస్కర్, ప్రశాంత్, అరవింద్, శిరీష, నవీన, నక్కల యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఒప్పించండి.. లేదంటే మైనింగ్‌ను రద్దు చేయండి

ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ- వెల్దండ

ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రజలను ఒప్పించి భాగస్వామ్యం చేసుకుని అభివృద్ధి చేయాలి.. లేదంటే ప్రజలు వద్దనుకున్న మైలారం మైనింగ్‌ను రద్దు చేయాలని పౌరహక్కుల సంఘం సీనియర్ నేత, ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం మైలారం గ్రామంలో మైనింగ్ పనులకు వ్యతిరేకంగా సోమవారం నుంచి చేపట్టదలచిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌ను వెల్దండ వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైలారం గ్రామంలో మైనింగ్ పనులకు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన నిరసనకు మద్దతుగా వెళుతున్న తమను అరెస్టు చేసి నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. ఖనిజ వనరుల వ్యాపారంతో కొంతమంది వ్యాపారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా మైనింగ్ పనులు చేపడుతున్నారని చెప్పారు. ప్రజలు వద్దంటున్న మైనింగ్ పనులను ఆపాలని, లేదంటే దాని వల్ల రాష్ట్రానికి, ప్రజలకు ఏం ప్రయోజనం జరుగుతుందో వివరించి వారిని ఒప్పించాలని అన్నారు. అంతే తప్ప అక్రమ అరెస్టులతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదని హితవు పలికారు. ప్రజల జీవనాధారంపై ప్రభావం చూపే మైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు వద్దంటున్నా అభివృద్ధి పేరుతో ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకురావడం సరికాదన్నారు. కల్వకుర్తి సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారితో మాట్లాడారు.



రాహుల్‌కు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రాహుల్ చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించడంతో, రాహుల్.. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార్ఖండ్ కోర్టు నిరాకరించింది. అనంతరం రాహుల్ సుప్రీం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని కోరుతూ ... క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం వారిని ఆదేశించింది.

మూడో ప్రపంచ యుద్ధం రానివ్వను

- అక్రమ వలసదారులను బహిష్కరిస్తా
- బైడెన్ చర్యలు రద్దు
- టిక్‌టాక్‌లో 50 శాతం వాటా : ప్రమాణస్వీకారానికి ముందు ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. దేశ సరిహద్దుల అతిక్రమణను నిరోధిస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల వ్యవధిలోనే మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న కార్యనిర్వాహక చర్యలన్నింటినీ రద్దు చేస్తానని స్పష్టం చేశారు. టిక్‌టాక్ ఉమ్మడి భాగస్వామ్యంలో అమెరికాకు యాభై శాతం వాటా ఉంటుందని ప్రకటించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ వన్ అరేనాలో జరిగిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. 'అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడు చేయని విధంగా ప్రజలకు అత్యుత్తమమైన మొదటి రోజును, అతి పెద్ద మొదటి వారాన్ని, అత్యంత అసాధారణమైన తొలి వంద రోజులను అందించబోతున్నాము' అని ఆయన చెప్పారు.

ఇక భారీగా 'బహిష్కరణలు'

రేపు సాయంత్రం సూర్యాస్తమం అయ్యే లోగా మా దేశంపై అక్రమ వలసదారుల దాడిని నిలిపేస్తాం. సరిహద్దులను అతిక్రమించి అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారు తిరిగి స్వస్థలాలకు పోవాల్సిందే. మా సంపదను తిరిగి దక్కించుకుంటాం' అని ట్రంప్ అన్నారు. అధికార యంత్రాంగం త్వరలోనే దేశ సరిహద్దులను తన నియంత్రణలోకి తీసుకుంటుందని చెప్పారు. అమెరికా చరిత్రలోనే అతి పెద్దదైన 'బహిష్కరణ' ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. వేలాది మంది అక్రమ ఇమ్మిగ్రెంట్లను స్వదేశాలకు పంపుతామని ఆయన స్పష్టం చేశారు. 'దానికి ముందు బహిరంగ సరిహద్దులు, కారాగారాలు, మానసిక సంస్థలు, మహిళల క్రీడల్ని పురుషులు ఆడడం, ట్రాన్స్‌జెండర్ల గురించి కనీసం ఎవరూ ఆలోచించనైనా ఆలోచించరు. అమెరికా భూభాగంలో అక్రమంగా నివసిస్తున్న వారిని, వలస వచ్చిన నేరగాళ్లను బహిష్కరిస్తాం' అని చెప్పారు.

అదంతా నా ఘనతే

గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి కుదిరిన ఒప్పందం తన ఘనతేనని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే యుద్ధమే వచ్చి ఉండేది కాదని అన్నారు. 'మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం తొలి దశగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించాము. నవంబరులో మన చారిత్రక విజయం కారణంగానే ఇది సాధ్యపడింది. తొలి బందీ ఇప్పుడే విడుదలయ్యాడు. ఒప్పందాన్ని తానే కుదిర్చానని బైడెన్ చెబుతున్నాడు. మంచిదే...నేను అధ్యక్షుడిగా ఉండి ఉంటే గాజా యుద్ధం జరిగేదే కాదు' అని అన్నారు. బాధ్యతలు చేపట్టబోతున్న తమ అధికార యంత్రాంగం మూడు నెలల కంటే తక్కువ వ్యవధిలోనే ఇదంతా సాధించిందని చెప్పారు. 'వారు నాలుగు సంవత్సరాలు అధ్యక్షులుగా ఉండి చేసిన దాని కంటే అధ్యక్షుడిని కాకపోయినా నేను అంతకంటే ఎక్కువే సాధించాను' అని వ్యాఖ్యానించారు. 'ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేస్తాను. మధ్యప్రాచ్యంలో గందరగోళాన్ని నివారిస్తాను. మూడో ప్రపంచ యుద్ధం జరగకుండా అడ్డుకుంటాను' అని ట్రంప్ చెప్పుకొచ్చారు.

మళ్లీ వచ్చిన టిక్‌టాక్

టిక్‌టాక్‌ను ఆన్‌లైన్‌లోకి తెచ్చిన ఘనత కూడా తనదేనని ట్రంప్ చెప్పారు. చైనీయులకు చెందిన వీడియో-షేరింగ్ యాప్‌ను కాపాడేందుకు అమెరికా ఉమ్మడి భాగస్వామ్యాన్ని నెలకొల్పుతుందని తెలిపారు. 'నేను ప్రమాణస్వీకారం చేయకముందే మీరు ఊహించని ఫలితాలను చూస్తున్నారు. ఇదంతా ట్రంప్ ప్రభావమేనని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ రోజు టిక్‌టాక్ మళ్లీ వచ్చింది. దానిని మనం కాపాడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే దాని ద్వారా అనేక ఉద్యోగాలను కాపాడగలుగుతాం. మన వ్యాపారాన్ని చైనాకు అప్పగించబోవడం లేదు. టిక్‌టాక్‌లో అమెరికాకు 50 శాతం వాటా ఉండాలన్న షరతు పైనే టిక్‌టాక్‌కు అంగీకరించాను' అని ట్రంప్ తెలిపారు.

రాజ్యాంగంపై 26న తెలంగాణ జాగృతి సెమినార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో "గణతంత్ర భారత్ - జాగ్రత్త భారత్" పేరిట హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో సెమినార్ నిర్వహించనుంది. దీనిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడం, సవాళ్లు, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, మహిళా సాధికారత, మైనారిటీలు, బలహీన వర్గాలు, కులగణన వంటి మొత్తం 16 అంశాలపై ఈ సెమినార్ లో చర్చించనున్నారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం నేతలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



లక్నో కెప్టెన్‌గా రిషబ్ పంత్

కోల్‌కత : ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్‌కు రిషబ్ పంత్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ ఏడాది వేలంలో రికార్డు రూ. 27 కోట్లు దక్కించుకున్న రిషబ్ పంత్.. 2025 సీజన్‌లో లక్నోకు సారథ్యం వహించనున్నాడు. కోల్‌కతలో జరిగిన ఓ కార్యక్రమంలో లక్నో సూపర్‌జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా, మెంటార్ జహీర్ ఖాన్‌లు పంత్‌ను కెప్టెన్‌గా ప్రకటించారు. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం వహించిన పంత్‌ను ఆ ఫ్రాంచైజీ అట్టిపెట్టుకునేందుకు సిద్దమైనా.. నాయకత్వ బాధ్యతల అంశంలో బేధాభిప్రాయాలు రావటంతో స్టార్ వికెట్ కీపర్ వేలంలోకి వచ్చాడు. లక్నోలో నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్, ఎడెన్ మార్‌క్రామ్ వంటి ఆటగాళ్లు ఉన్నప్పటికీ పంత్‌పై యాజమాన్యం నమ్మకం ఉంచింది.

కొల్లూరు డీపీఎస్‌లో ఉత్సాహంగా ఆర్చరీ పోటీలు

వరల్డ్‌కప్‌కు ఎంపికైన చికితకు సత్కారం



హైదరాబాద్ : రాష్ట్ర జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో ఘనంగా జరిగాయి. ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో సుమారు 200ల మందికి పైగా ఆర్చర్లు పాల్గొన్నారు. కాంపౌండ్ విభాగంలో పెద్దపల్లి ఆర్చర్ టి.చికితరావు 697 పాయింట్లు సాధించి, స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఎస్.మానస (రంగారెడ్డి) రజతం, ఎం.శ్రేష్ట రెడ్డి (హైదరాబాద్) కాంస్యం దక్కించుకున్నారు. గత వారం జరిగిన జాతీయ ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చి ఆర్చరీ వరల్డ్‌కప్, ఆసియాకప్‌కు ఎంపికైన చికితను రాష్ట్ర ఆర్చరీ సంఘం అధ్యక్షుడు టి.రాజు, సంగారెడ్డి జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు, డీపీఎస్ కరస్పాండెంట్ టి.ఎస్ పవన్ కళ్యాణ్ సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కొల్లూరు డీపీఎస్‌లో ఆర్చరీ అకాడమీ నెలకొల్పి దేశం గర్వించే యువ ఆర్చర్లను తయారు చేస్తున్నామని రాబోయే కాలంలో రాష్ట్రం నుంచి మరింత మంది అంతర్జాతీయ స్థాయి ఆర్చర్లు వస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ చైర్మన్ టి.భీమ్‌సేన్, వైస్ చైర్మన్ టీ.వీ ప్రణయ్ కుమార్ రాష్ట్ర ఆర్చరీ సంఘం కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ధనాధన్‌కు వేళాయె!

రేపటి నుంచి భారత్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్

వైట్‌బాల్ ఫార్మాట్‌లో అరివీర భయంకర జట్లు భారత్, ఇంగ్లాండ్. కుర్రాళ్ల మెరుపులతో టీమ్ ఇండియా ఈ ఫార్మాట్‌లో పరుగుల సునామీ సృష్టిస్తోంది. మరోవైపు బ్రెండన్ మెక్‌కల్లమ్ శిక్షణ సారథ్యంలో ఇంగ్లీశ్ బ్యాటర్లు టెస్టుల్లో సైతం చెలరేగిపోతున్నారు, ఇక టీ20ల్లో సంగతి చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఈ రెండు జట్లు పొట్టి ఫార్మాట్‌లో తలపడేందుకు సిద్ధమవుతుంటే.. రికార్డులు బద్దలయ్యేందుకు ఎదురుచూస్తున్నాయి!.

నవతెలంగాణ క్రీడావిభాగం



ఆధునిక క్రికెట్ ధనాధన్‌కు చిరునామా. అటువంటి మోడ్రన్ క్రికెట్‌లోనే దంచికొట్టేందుకు సరికొత్త ప్రణాళికలతో హడలెత్తిస్తున్న జట్లలో భారత్, ఇంగ్లాండ్ ముందంజలో ఉంటాయి. గత ఏడాది కాలంగా భారత్, ఇంగ్లాండ్‌లు పరుగుల సునామీ సృష్టించటంలో పోటీ పడుతున్నాయి. ఇటీవల వరుసగా టెస్టు క్రికెట్ అభిమానులను అలరించగా.. ఇప్పుడు టీ20 ధమాకా ముందుకొచ్చింది. భారత్, ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల టీ20 సిరీస్ బుధవారం నుంచి ఆరంభం కానుంది. దీంతో, ఐపీఎల్‌కు ముందే భారత్‌లో ధనాధన్ హంగామా మొదలు కానుంది.

దంచుడే దంచుడు

సంప్రదాయ బ్యాటింగ్ శైలిలో భారత్ టీ20ల్లో దూకుడుగా ఆడటం లేదనే విమర్శ చేయడానికి ఇప్పుడు ఎవరూ సాహసించరు. టీ20 ప్రపంచకప్ విజయం అనంతరం సీనియర్లు ఈ ఫార్మాట్‌కు దూరం కాగా... కుర్రాళ్లు కొత్తగా రెచ్చిపోతున్నారు. టీ20 ప్రపంచకప్ తర్వాత భారత్ 11 మ్యాచుల్లో తొలుత బ్యాటింగ్ చేయగా అందులో ఏడు సార్లు 200కి పైగా పరుగులు చేసింది. అందులో 297, 283 వంటి రికార్డు స్కోర్లు ఉన్నాయి. ప్రతి 4.27 బంతులకు ఓ బౌండరీ బాదుతున్నారు. ప్రతి 2.18 బంతులకు ఓ బౌండరీ ప్రయత్నం చేస్తున్నారు. ఛేదనలోనూ మనోళ్లు అదరగొడుతున్నారు. 132 పరుగుల టార్గెట్‌ను 11.5 ఓవర్లలో ఊదేయగా.. 156 పరుగుల లక్ష్యాన్ని 15.2 ఓవర్లలో ముగించారు. భారత జట్టులో సూర్య కుమార్ యాదవ్, సంజు శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, రింకు సింగ్‌లు ఉండగా.. ఇంగ్లాండ్ శిబిరంలో జోశ్ బట్లర్, ఫిల్ సాల్ట్, లియాం లివింగ్‌స్టోన్, జాకబ్ బెతెల్, హ్యారీ బ్రూక్‌లు ఉన్నారు. ఇంగ్లాండ్ సైతం ప్రతి 2.32 బంతులకు బౌండరీ ప్రయత్నం చేస్తోంది. ధనాధన్ హిట్టర్లు క్రీజులో నిలిచే సిరీస్‌లో ఓవర్‌కు పదిలోపు పరుగులిచ్చే బౌలర్లు మ్యాచ్ ఫలితాన్ని శాసించనున్నారు.

రికార్డులు బహు పరాక్!

2023 మార్చిలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలు మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో తలపడ్డాయి. టీ20 క్రికెట్ చరిత్రలో ఆ సిరీస్‌కు ఓ ప్రాముఖ్యత ఉంది. నాలుగు రోజుల వ్యవధిలో ముగిసిన ఈ సిరీస్‌లో పరుగుల ప్రవాహానికి అడ్డు లేదు. తొలి మ్యాచ్‌లో సఫారీలు 11 ఓవర్లలో 131 పరుగులు చేసినా ఓడారు. రెండో మ్యాచ్‌లో సఫారీలు 259 పరుగుల లక్ష్యాన్ని ఛేదించారు. మూడో మ్యాచ్‌లో విండీస్ 220 పరుగులను పడుతూ లేస్తూ కాపాడుకుంది. ఈ సిరీస్‌లో ఇరు జట్ల స్కోరింగ్ రేట్ 12.08. ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనే ఇదే అత్యధికం. అగ్ర జట్లు తలపడిన టీ20 సిరీస్‌లో రెండో ఉత్తమ స్కోరింగ్ రేట్ 10.69. తాజా భారత్, ఇంగ్లాండ్ సిరీస్‌లో ఈ రికార్డు బద్దలు అయ్యే ప్రమాదం ఉంది. టీ20 మ్యాచులు వేదికలు కోల్‌కత, ముంబయి, రాజ్‌కోట్‌లు భారీ స్కోర్లకు నెలవు. రెండు జట్లలో భారీ హిట్టర్లు, రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం నేపథ్యంలో పొట్టి ఫార్మాట్‌లో పలు రికార్డులు బద్దలు కావటం లాంఛనమే.

ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్

రామ్‌రెడ్డి, ఈశ్వర్‌సాయిలకు సింగిల్స్ టైటిల్స్



హైదరాబాద్ : మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. దేశవ్యాప్తంగా 220 మంది క్రీడాకారులు పోటీపడిన ఈ టోర్నీలో విజేతలకు రూ. 2 లక్షల నగదు బహుమతి అందజేశారు. మెన్స్ 30 ప్లస్ సింగిల్స్ ఫైనల్లో విజయ్ ఆనంద్‌పై ఈశ్వర్ సాయి విజేతగా నిలువగా.. డబుల్స్‌లో మంజునాథ ప్రసాద్, సురేశ్ రెడ్డిలపై ఈశ్వర్ సాయి, విశాఖ్ లు 10-9, 7-1తో పైచేయి సాధించి టైటిల్ సాధించారు. 40 ప్లస్ సింగిల్స్‌లో జి రాజ 10-0తో మురళీధర్‌పై గెలుపొందగా... డబుల్స్ విభాగంలో జి రాజు, లగ్గాని శ్రీనివాస్ జోడీ 10-8తో రామచంద్ర కిరణ్, అశ్విన్ కుమార్‌లపై విజయం సాధించారు. 50 ప్లస్ సింగిల్స్‌లో సాంబ శివా రెడ్డిపై 10-8తో శ్రీధర్ గెలుపొందగా.. డబుల్స్‌లో నంద్యాల నరసింహారెడ్డి రన్నరప్‌గా నిలిచింది. కుమారస్వామి, వెంకటేశ్వర్లు 10-8తో నరసింహారెడ్డి,ధర్మెలపై గెలుపొందారు. 60 ప్లస్ సింగిల్స్‌లో ప్రియదర్శిని రామ్‌రెడ్డి చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో రమేశ్‌పై అలవోక విజయం సాధించాడు. డబుల్స్‌లో పాల్ మనోహర్, రమేశ్‌లు శ్రీనివాస్, ఆనందస్వరూప్‌లపై 10-5తో పైచేయి సాధించారు. 70 ప్లస్ సింగిల్స్‌లో వెంకట సన్యాసి రాజు 10-2తో సాయిరామ్ బాబుపై గెలుపొందగా.. డబుల్స్‌లో కల్నల్ అంకయ్య, గజపతి నాయుడు జోడీ 10-3తో రవి కుమార్, కష్ణమోహన్‌లపై గెలుపొంది చాంపియన్లుగా నిలిచారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ) అధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి, క్యాప్‌స్టోన్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ కొడాలి శ్రీకాంత్‌లు సింగిల్స్, డబుల్స్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

కేవలం అవార్డుల సినిమా కాదు



పద్మావతి మల్లాది

'ఒక అమ్మాయి అహింస వాదంతో ఊరిని, చెట్టును ఎలా కాపాడింది? అనేది కథ ఇది. సందేశంతో పాటు కమర్షియాలిటి ఉన్న సినిమా. తప్పకుండా అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఇది కేవలం అవార్డుల సినిమా కాదు. అందరికి నచ్చే వాణిజ్య అంశాలు, భావోద్వేగాలు ఉన్నాయి' అని దర్శకురాలు పద్మావతి మల్లాది చెప్పారు.

దర్శకుడు సుకుమార్ తనయురాలు సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి తబితా సుకుమార్ సమర్పకురాలు. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. ఇప్పటికే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడి ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంది. ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి కూడా పురస్కారం పొందింది. ఈ చిత్రాన్ని ఈనెల 24న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మల్లాది మీడియాతో ముచ్చటించారు.

- 'మనమంతా', 'రాధేశ్యామ్', 'మహానటి', 'చూసి చూడంగానే', 'అమ్ము', 'బృంద' ఇలా సినిమాలకు, వెబ్ సీరిస్‌లకు రచయితగా వర్క్ చేశాను. నా స్నేహితుడు చెట్టుకు, మనిషికి లవ్‌స్టోరీ రాస్తే బాగుంటుంది అనడంతో నాకు ఆ ఐడియా బాగా నచ్చింది. మొక్కల గురించి తదుపరి తరం వాళ్లకు చెప్పాలనే సంకల్పంతో ఈ కథ రాసుకున్నాను.
- గాంధీ పాత్రకు సుకృతి పర్‌ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. గాంధీ అనే అమ్మాయి గురించి ఈ కథ. గాంధీ సిద్దాంతాలు ఆ పాత్రలో ఉంటాయి. ఈ సినిమాతో అహింస గురించి చెప్పాను. మనుషుల మధ్య, నేచర్ మధ్య అహింస చాలా అవసరం. ఇందులో పాటలు, రీ రికార్డింగ్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి పంపాలనేది సుకుమార్ ఐడియా. ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో మంచి అప్లాజ్ వచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన వస్తుందని అనుకుంటున్నాను.

థ్రిల్ చేసే 'హత్య'



ధన్య బాలకృష్ణ, శ్రీవిద్యాబసవ, పూజా రామచంద్రన్

మహాకాల్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ప్రశాంత్ రెడ్డి నిర్మాణంలో శ్రీ విద్యా బసవ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హత్య'. ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 24న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, 'కరోనా వల్ల నా తొలి సినిమా 'మధ' సక్సెస్‌ను ఎంజాయ్ చేయలేకపోయాను. ప్రశాంత్ వల్ల ఈ సినిమా ఈ స్థాయికి వచ్చింది. అలాగే మా ట్రైలర్ రిలీజ్ అయ్యాక డిస్ట్రిబ్యూటర్లే వచ్చి మా సినిమాను అడిగారు. మేం సినిమా చూశాం. మాకు నమ్మకం పెరిగింది. ఈ సినిమా పట్ల నేను చాలా గర్వంగా ఉన్నాను. ఈ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని తెలిపారు.

నిర్మాత ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'మా డైరెక్టర్ శ్రీవిద్యకు థ్యాంక్స్. ఈ సినిమాకు నేను ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశాను. మా సినిమాని అందరూ చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు.

నయా యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్



లూయిస్ కూ

హాంగ్ కాంగ్ సినీ చరిత్రలో వెయ్యి కోట్ల రూపాయల్ని వసూలు చేసిన సంచలన చిత్రం 'హాంగ్ కాంగ్ వారియర్స్'. లూయిస్ కూ, సమ్మో కామ్-బో హంగ్, రిచీ లీడ్ రోల్స్ నటించిన ఈ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌కి సోయ్ చీయాంగ్ దర్శకత్వం వహించారు. కిన్-యీ ఔ, తై-లీ చాన్, లి జున్ రైటర్స్.

హాంగ్‌కాంగ్‌లో విశేష ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రం ఈనెల 24న తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళంలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్‌వీఆర్ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తోంది. లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ యాక్షన్ మోడ్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అందరిలోనూ మరింత క్యూరియాసిటీని రైజ్ చేసింది.

నవచిత్రం

వేసవి కానుకగా విడుదల




అక్షయ్‌కుమార్

విష్ణు మంచు నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'కన్నప్ప'. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శివుడిగా అక్షయ్ కుమార్ పాత్ర తాలూకా పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఆగ్రహంతో శివ తాండవం చేస్తున్నట్టుగా ఉన్న అక్షయ్‌కుమార్ పోస్టర్‌లో అందరిలోనూ అమితాసక్తిని రేకెత్తిస్తోంది.

'ఇలాంటి ఓ అద్భుతమైన సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని, శివుని ఆశీస్సులతో ఆడియెన్స్ ముందుకు ఏప్రిల్ 25న రాబోతున్నాం' అని అక్షయ్ కుమార్ చెప్పారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, ప్రభాస్, మోహన్ బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్ వంటి తదితర భారీ తారాగణం నటించింది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.

నటుడు విజయ్ గంగరాజు కన్నుమూత



విజయ్ గంగరాజు

పలు వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను విశేషంగా అలరించిన నటుడు విజయ్ గంగరాజు కన్నుమూశారు.

వారం రోజుల క్రితం ఓ సినిమా షూటింగ్‌లో గాయపడిన ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన సోమవారం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. మోహన్‌లాల్ నటించిన 'వియత్నాం కాలనీ' మలయాళ సినిమాలో సినీ రంగ ప్రవేశం చేశారు విజయ్ గంగరాజు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. దీంతో ఆయనకు తమిళంతోపాటు తెలుగులోనూ అవకాశాలొచ్చాయి. 'భైరవద్వీపం'లో చేసిన విలన్ పాత్ర ఆయనకు తెలుగునాట మరింత మంచి గుర్తింపు తీసుకొచ్చింది. విజయ్ గంగరాజు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా సంతాపం తెలిపారు.



నారా రోహిత్, మంచు మనోజ్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్‌పై డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సోమవారం ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశారు మేకర్స్.

ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ,"భైరవం' లాంటి మంచి కథ దొరికినందుకు చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్ విజయ్ చాలా హార్డ్ వర్క్ చేశారు. నారా రోహిత్, మంచు మనోజ్‌తో వర్క్ చేసే అవకాశం రావడం ఒక బ్లెసింగ్‌గా భావిస్తున్నాను. ఈ సినిమా అందరికీ మంచి పేరు తీసుకొచ్చి, మమ్మల్ని మరో మెట్టు పైకి తీసుకెళ్తుందని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'ఇది జస్ట్ టీజర్ మాత్రమే. ట్రైలర్ అదిరిపోతుంది. సినిమా దుమ్ము లేచిపోతుంది. మీ అందరి బ్లెస్సింగ్స్ ఉంటాయని ఆశిస్తున్నాను' హీరో మనోజ్ మంచు అన్నారు.

హీరో నారా రోహిత్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఎప్పుడూ చేయని ఒక క్యారెక్టర్ ఇందులో చేశా. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది' అని చెప్పారు. దర్శకుడు విజయ్ కనకమేడల మాట్లాడుతూ,'శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. 'వెన్నెల..' పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఈ సినిమా మాస్ యాక్షన్ ఆడియన్స్‌కి పండగలా ఉంటుంది. ముగ్గురు హీరోలతో కలిసి పని చేయడం నాకు చాలా అద్భుతమైన అనుభూతినిచ్చింది. నా 'నాంది' సినిమాని చూసినప్పుడు ప్రేక్షకులు ఎంతగా ఫీల్ అయ్యారో, అలాగే ఈ సినిమా చూసినప్పుడు కూడా అలాగే ఫీల్ అవుతారు. 'నాంది' కంటే మంచి పేరు ఈ సినిమా తీసుకొస్తుందనే నమ్మకంతో ఉన్నాను' అని తెలిపారు. 'మా బ్యానర్ మొదలుపెట్టి 15 ఏళ్ళు అవుతుంది. దర్శకుడు విజయ్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశారు' అని నిర్మాత కేకే రాధా మోహన్ చెప్పారు.

తెలుగులోనూ విజయం ఖాయం



అఖిల్ పాల్, అనాస్ ఖాన్ రచన, దర్శకత్వంలో రాజు మల్లియాత్, రాయ్ సిజె నిర్మాతలుగా టోవినో థామస్, త్రిష ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఐడెంటిటీ'.

మలయాళంలో విడుదలైన ఈ చిత్రం రెండు వారాలలో 50 కోట్లకు పైగా వసూలు చేసి ఈ ఏడాది తొలి హిట్ సినిమాగా నిలిచింది. ఈచిత్రాన్ని మూవీ మాక్స్ శ్రీనివాస్ మామిడాల సమర్పణలో శ్రీ వేదాక్షర మూవీస్ చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలలో ఈనెల 24వ తేదీన రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు ట్రైలర్‌ను సోమవారం లాంచ్ చేశారు. మామిడాల శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో యాక్షన్ కంటెంట్ చాలా బాగుంటుంది. ఇప్పటికే ఈ చిత్రం మలయాళంలో విశేష ఆదరణ పొందింది. తెలుగులోనూ ఈ సినిమా భారీ విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'ఈ నూతన సంవత్సరంలో సంచలన వసూళ్ళతో గొప్ప విజయం సాధించిందీ సినిమా. ఈ యాక్షన్ థ్రిల్లర్ తెలుగు ప్రేక్షకులను సైతం కచ్చితంగా వినోదపరుస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని చింతపల్లి రామారావు అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

రాణించిన సెంట్రల్ బ్యాంక్

- క్యూ3 లాభాల్లో 33 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 33 శాతం వృద్ధితో రూ.958.93 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.717.86 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3151 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ3లో 12.31శాతం పెరిగి రూ.3,540 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.10,459.89 కోట్లకు తగ్గి.. 3.86 శాతంగా చోటు చేసుకున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 4.50 శాతం స్థూల నిరర్థక ఆస్తులు నమోదయ్యాయి. క్రితం క్యూ3 నాటికి నికర నిరర్థక ఆస్తులు 1.27 శాతం నుంచి 0.59 శాతానికి దిగివచ్చాయి. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం వ్యాపారం 8.31 శాతం పెరిగి రూ.6,68,686 కోట్లకు చేరింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.6,17,368 కోట్ల వ్యాపారం నమోదయ్యింది. బ్యాంక్ డిపాజిట్లు 5.34 శాతం పెరిగి రూ.3,97,907 కోట్లకు చేరగా.. అడ్వాన్సులు 12.99 శాతం వృద్ధితో రూ.2,70,779 కోట్లుగా నమోదయ్యాయి.

తగ్గిన ఐడిబిఐ బ్యాంక్ ఎన్‌పిఎలు

ప్రయివేటు రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 31 శాతం వృద్ధితో రూ.1,908 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,458 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.7,514.27 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో రూ.8,564.92 కోట్లకు చేరింది. ఇదే సమయంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.7,815.57 కోట్లకు పెరిగింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.6,540.86 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.69 శాతంగా ఉండగా.. 2024 డిసెంబర్ ముగింపు నాటికి 3.57 శాతానికి తగ్గాయి. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 0.34 శాతం నుంచి 0.18 శాతానికి పరిమితమయ్యాయి.

తగ్గిన జొమాటో లాభాలు..

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 57 శాతం పతనంతో రూ.59 కోట్ల నికర లాభాలకు పరిమితమయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.138 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో జొమాటో గ్రాస్ ఆర్డర్ విలువ (జిఒవి) మాత్రం 57 శాతం పెరిగి రూ.20,206 కోట్లుగా చోటు చేసుకుంది.

టవర్ ఏదైనా సెల్ సిగ్నల్ పొందచ్చు

- ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్ ప్రారంభం



న్యూఢిల్లీ : నెట్‌వర్క్ ఏదైనా 4జి మొబైల్ సేవలు పొందేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌ను ప్రారంభించింది. డిజిటల్ భారత్ నిధి (డిబిఎన్) క్రింద ఏర్పాటు అయినటువంటి టవర్ల ద్వారా బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ కలిగిన ఏ వినియోగదారులు అయినా 4జి సేవలను పొందవచ్చు. ఈ సేవలను కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా లాంచనంగా ప్రారంభించారు. ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌తో వినియోగదారులు ఇప్పుడు భాగస్వామ్య నెట్‌వర్క్‌లను వినియోగించుకుని అంతరాయం లేని మొబైల్ సేవలు పొందవచ్చని కేంద్రం పేర్కొంది. దీంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో కనెక్టివిటీ అంతరాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా 4జి సేవలను అందించడానికి 35,400 గ్రామాలకు గాను దాదాపు 27,000 మొబైల్ టవర్‌లకు నిధులు సమకూర్చింది. ఈ విధానం విస్తతమైన కవరేజీని అందించడంలో భాగంగా అనవసరమైన మౌలిక సదుపాయాల కొరతను తగ్గిస్తుందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 27,836 ప్రాంతాలను కవర్ చేస్తుందని మంత్రి సింధియా పేర్కొన్నారు. ఈ ఉమ్మడి ప్రయత్నం దేశవ్యాప్తంగా వినియోగదారులకు కనెక్టివిటీ అవకాశాలను పెంచుతుందన్నారు.

భారత వృద్ధి అంచనాలకు మూడీస్ కోత

న్యూఢిల్లీ: భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 7 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. ఇంతక్రితం 2023-24లో 8.2 శాతం వృద్ధి చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. 2025 మార్చితో ముగియనున్న ఏడాదిలో భారత జిడిపి 6.4 శాతానికే పరిమితం కావొచ్చని ఇటీవల స్వయంగా కేంద్ర గణంకాల శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుత 2024-25లో ప్రధానంగా అంతర్జాతీయ మందగమనం, దేశీయ బలహీనతలు వృద్ధి రేటు తగ్గుదలకు ప్రధాన కారణమని మూడీస్ పేర్కొంది. ఫిక్కీ, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇతర ఏజెన్సీలు 6.5 శాతం దిగువనే వృద్ధి ఉండొచ్చని ఇటీవల అంచనా వేశాయి.


ఎటిఎస్ ఇఎల్‌జిఐ

తదుపరి తరం ఆటోమోటివ్ సొల్యూషన్స్

న్యూఢిల్లీ : భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో నెక్ట్స్ జనరేషన్ ఆటోమోటివ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించినట్లు ఎటిఎస్ ఇఎల్‌జిఐ వెల్లడించింది. ప్రముఖ గ్యారేజీ పరికరాల తయారీదారు అయినా ఎల్గి ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎటిఎస్ ఇఎల్‌జిఐ ఆటో ఎక్స్ పో కాంపోనెంట్స్ షోలో ఎటిఎస్ టచ్ లెస్ వీల్ అలైన్, హై పెర్ఫార్మెన్స్ కొలిషన్ రిపేర్ సిస్టం (సిఆర్ ఎస్), అడ్వాన్స్ డ్ వెల్డింగ్ ఎక్విప్ మెంట్, స్పెషలైజ్డ్ ఇవి ఎక్విప్ మెంట్, వీఆర్ టెక్నాలజీని ఉపయోగించి అధునాతన డయాగ్నోస్టిక్స్ ఎక్విప్‌మెంట్ తదితర నూతన ఆవిష్కరణలను ప్రదర్శించినట్లు పేర్కొంది.


దేశీయ తయారీని ప్రోత్సహించాలి

- వచ్చే బడ్జెట్‌పై ఎంబిసి ఎలక్ట్రానిక్స్ సిఇఒ



న్యూఢిల్లీ : కేంద్రం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ భారతీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు అత్యంత కీలకం కానుందని ఎంబిసి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సిఇఒ రక్షిత్ మాథుర్ పేర్కొన్నారు. రాబోయే 2025 ఫిబ్రవరి1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో వృద్ధి, ఆవిష్కరణలను పెంపొందించడానికి పరిశ్రమ స్నేహపూర్వక విధానాలు అవసరమన్నారు. దేశీయ తయారీని బలోపేతం చేసే విధంగా ఆర్‌అండ్‌డి కార్యక్రమాలను ప్రోత్సహించే రీతిలో ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టాలని కోరారు. అప్పుడే ప్రపంచవ్యాప్తంగా భారత ఉత్పత్తులు పోటీ పడటానికి వీలు కలుగుతుందన్నారు.

ఐషర్ నుంచి ప్రో ఎక్స్ ఇవి వాహనాలు



న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఐషర్ ట్రక్స్ అండ్ బస్సెస్ కొత్తగా ప్రో ఎక్స్ విద్యుత్ వాహనాల శ్రేణీని ఆవిష్కరించినట్లు తెలిపింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో 2,3,5 టన్నుల విభాగంలో చిన్న వాణిజ్య వాహనాలను భారత మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శించింది. ఇవి పెరుగుతున్న ఇ-కామర్స్, రవాణ అవసరాలను తీర్చనున్నాయని తెలిపింది. వీటిని తమ భోపాల్ ప్లాంట్‌లో తయారు చేసినట్లు పేర్కొంది.

కిస్నా డైమాండ్ 100 కార్ల బహుమతి

ఇండోర్ : జ్యూవెలరీ రిటైల్ చెయిన్ సంస్థ కిస్నా డైమండ్ అండ్ జ్యూయలరీ తమ వినియోగదారులకు 100 కార్లను బహుమతిగా ఇచ్చినట్లు తెలిపింది. ఇటీవల నిర్వహించిన 'ఈ సారి మీ కోసం' (అబ్‌కీ బార్ ఆప్కే లియే) క్యాంపెయిన్‌లో గెలుపొందిన వారికి మారుతి సెలెరియో కార్లను అందించినట్లు పేర్కొంది. సెప్టెంబర్ 1 నుంచి జనవరి 18 మధ్య జరిగిన ఈ క్యాంపెయిన్‌లో 51,219 పాల్గొన్నారని తెలిపింది. తమ స్టోర్‌లో వజ్రాలు, బంగారం, ప్లాటినం కొనుగోలు చేసిన వారిలో విజేతలను ఎంపిక చేసినట్లు హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండి ఘనశ్యామ్ ధోలాకియా పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

'ఉపాధి'తో సంబంధం లేకుండా పేదలందరికీ రూ.12వేలివ్వాలి

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులివ్వాలి
- వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెంచిన పింఛన్లు ఇవ్వాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం
- పార్టీ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా



నవతెలంగాణ-వైరాటౌన్

మున్సిపాలిటీల్లోని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటినీ పేదలందరికీ అందించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట వందలమంది పేదలతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఉపాధి హామీతో సంబంధం లేకుండా అమలుచేయాలని, మున్సిపాలిటీలోని పేదలకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ రూ.12 వేలు ఇవ్వాలని, మున్సిపాలిటీ వార్డుల వారీగా సభలు ఏర్పాటు చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెంచిన పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలన్నారు. మహిళలకు రూ.2500 పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఉపాధిహామీ చట్టం అమలు చేయకపోవడంతో రెక్కల కష్టం మీద బతికే పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో విలీన గ్రామాల మహిళలు ఉపాధి లేక ఇతర గ్రామాలకు రోజు వారీగా కూలి పనులకు వెళుతున్నారని, పేద మహిళలను ప్రభుత్వం ఆదుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఉపాధి హామీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మున్సిపాలిటీలోని పేదలందరికీ వర్తింపజేయాలని, లేనిపక్షంలో పేదలను సమీకరించి భారీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని మున్సిపాలిటీల్లో వర్తింపజేయాలన్న తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అలాగే వైరా మున్సిపాల్టీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెట్టిస్తానని హామీ ఇచ్చారు. అలా జరగని పక్షంలో మున్సిపాలిటీలోని పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం వైపు నుంచి ప్రజలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, మండల కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, చెరుకుమల్లి కుటుంబరావు, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, పారుపల్లి కృష్ణారావు, హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, సంక్రాంతి నర్సయ్య, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మ నరసింహారావు, షేక్ నాగుల్ పాషా, మల్లెంపాటి రామారావు, వాసిరెడ్డి విద్యా సాగర్‌రావు, బాజోజు రమణ బెజవాడ వీరభద్రం, సంక్రాంతి పురుషోత్తం, యనమద్ది రామకష్ణ, చిత్తారు నాగరాజు, మల్లెంపాటి ప్రసాదరావు, పారుపల్లి శ్రీనాథ్‌బాబు, కొత్త సీతారామయ్య, మాడపాటి మల్లికార్జున్, మాడపాటి వెంకటి, అమరనేని కృష్ణ, కురుగుంట్ల శ్రీనివాసరావు, రుద్రాక్షల నరసింహచారి, వడ్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు, చావా కళావతి, ఎస్‌డీ పాషా, దేవుళ్ళ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ వైపు అడుగులు

- జనన,మరణ ధృవీకరణ పత్రాలు అందులోనే
- తెనాలిలోప్రయోగాత్మక పరిశీలన
- సమీక్షలో సిఎస్ విజయానంద్



అమరావతి

రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. 150 రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్-2047లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నెల 18వ తేది నుంచి దీనిని అమలు చేస్తామని ఆయన ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. వాట్సాప్ గవర్నెన్స్‌ను ద్వారా పౌరులకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సేవలను ముందుగా తెనాలిలో అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను పౌరులకు మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో వాట్సాప్ గవర్నెన్స్ సదుపాయాన్ని ప్రజలకు ముఖ్యమంత్రి అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సేవలు కల్పించడం కీలకమని, ఇందుకు సంబంధించిన పనులు త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పగడ్బందీగా సేవలు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెనాలిలో ముందుగా దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికంగా ఇబ్బందులను సునిశితంగా పరిశీలించి అధ్యయనం చేయాలని చెప్పారు. అందుకు అనుగుణంగా ఈ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఇందుకు కావాల్సిన అన్ని విధాల సహకారాన్ని పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, పురపాలకశాఖలు ఆర్‌టిజిఎస్ అధికారులకు అందించాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేశామని ఆర్‌టిజి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ చెప్పారు. సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పేరుతో ఒక పోర్టల్‌ను రూపొందించామని ఆర్టీజి ముఖ్య కార్యనిర్వహణధికారి కె దినేష్‌కుమార్, అన్నారు. వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, పురపాలక కార్యదర్శి కె కన్నబాబు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారి, పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డేటా రక్షణ చట్టం లేకుండా పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించడం పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎం రాములుపై దాడిచేసిన వారిని శిక్షించాలి

- టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి తిరుపతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) కె రాములుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాములుపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ సోమవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో తిరుపతి పాల్గొని ప్రసంగించారు. హెచ్‌ఎం రాములుపై దాడి జరిగిన తర్వాత విద్యాశాఖ, పోలీసులు స్పందించిన తీరు సరైన పద్ధతిలో లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం ప్రకాశ్‌రావు, టీపీటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పి వెంకటప్రసాద్ వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామక కేసులో

ఫిబ్రవరి 12న తుది వాదనలు వింటాం

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- దాసోజు, సత్యనారాయణల పిటిషన్‌లో విచారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించిన వ్యవహారంలో ఫిబ్రవరి 12న తుది వాదనలు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. అయితే వీరికి రాజకీయ నేపథ్యం ఉన్నదంటూ ఆ ప్రతిపాదనలను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్య నారాయణ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు.

ఆ పిటిషన్లు పెండింగ్‌లో ఉండగానే.. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం ఖాళీగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు గతేడాది జనవరి 13న కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల పేర్లను సిఫారసు చేయగా, గవర్నర్ ఆమోదించారు. అయితే, తమ పిటిషన్లు విచారణలో ఉండగా గవర్నర్ మరో ఇద్దరిని తమ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం హైకోర్టు సీజే ధర్మాసనం గతేడాది మార్చి 17న తన తీర్పునిచ్చింది. దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణల నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వుల రద్దుతో పాటు.. ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా పక్కన పెడుతున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించింది. దీంతో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేయగా, గవర్నర్ ఆమోదంతో వారు ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టు 4న తమకు న్యాయం చేయాలని కోరుతూ దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాల్ చేశారు.

ఆ పిటిషన్ పై గత విచారణ సందర్భంగా ఫిబ్రవరి 12న తుది వాదనలు వింటామని, అదేరోజు తీర్పు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తెలంగాణ గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా... ఇదే కేసుకు సంబంధించి ఫిబ్రవరి 12న తుది వాదనలు ఉంటాయని సుప్రీంకోర్టు గతంలో తెలిపిందని ఇరు వర్గాల న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... అదేరోజు గవర్నర్ కార్యాలయం పిటిషన్‌పై కూడా వాదనలు వింటామని తెలిపింది. అయితే ఈ పిటిషన్‌లో తుది వాదనలు వినిపించేందుకు ఇరు వర్గాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించింది.

ఏపీలో బదిలీల పర్వం

అమరావతి : రాష్ట్రంలో 25 మంది ఐఎఎస్‌లకు, 27 మంది ఐపిఎస్‌లకు స్థానచలనం కలిగింది. ఐఎఎస్‌ల బదిలలకు సంబంధించి సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 126ను విడుదల చేసింది. జలవనరులశాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ జి.సాయిప్రసాద్‌ను సిఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సిఆర్‌డిఎ కమిషనరుగా కన్నబాబును ప్రభుత్వం నియమించింది. పశుసంవర్ధకశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బి రాజశేఖర్, జివిఎంసి కమిషనరుగా సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గృహ నిర్మాణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న అజయ్‌జైన్‌కు టూరిజం అండ్ కల్చరల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

సికింద్రాబాద్ నుంచి కుంభమేళాకు ప్రత్యేక రైలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు సికింద్రాబాద్ నుంచిప్రత్యేక రైలును నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సోమవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. భారతీయ రైల్వేలు ప్రారంభించిన థీమ్-ఆధారిత టూరిస్ట్ సర్క్యూట్ భారత్ గౌరవ్ రైలును ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ గ్రూప్ జనరల్ మేనేజర్ పీ రాజ్‌కుమార్ పచ్చ జెండా ఊపి ఈ రైలును సోమవారం ప్రారంభించారు. వారణాసి - ప్రయాగ్‌రాజ్ - అయోధ్యలోని దివ్య తీర్థ స్థలాలను దర్శింపజేస్తూ, 7 రాత్రులు, 8 రోజులపాటు ఈ రైలు నడుస్తుందని వివరించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మరో రైలు బయల్దేరుతుందనీ, ప్రయాణీకులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు హైదరాబాద్‌లో లెనిన్ శతవర్ధంతి ముగింపు సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లెనిన్ శతవర్ధంతి ముగింపు సభను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉదయం పది నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు నిర్వహించనుంది. ఈ మేరకు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం హన్మేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాస్‌లైన్ అఖిల భారత కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెజి రాంచందర్, సోషలిస్టు ఇనిషియేటివ్ కేంద్ర నాయకులు జి భార్గవ, వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, ప్రముఖ రచయిత సతీశ్ చందర్ పాల్గొంటారని తెలిపారు.

మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దు

కేసు విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ బదిలీ చేయాలనే పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మరోసారి ఈ కేసు విచారిస్తున్న ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మార్పు చేసింది. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం నుంచి, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మార్చింది. తొలుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారించగా, కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకున్నారు. దీంతో పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనానికి మార్చారు.

అదనపు సొలిసిటర్ జనరల్ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున విచారణను వాయిదా వేయాలని, అదే విధంగా కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు. ఈనేపథ్యంలో వచ్చే సోమవారం విచారణ చేపట్టనున్నట్టు జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మల ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే అప్పటిలోపు అదనపు సొలిసిటర్ జనరల్ రాకపోతే, తానే వాదనలు వినిపిస్తానని ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీనికి ధర్మాసనం అంగీకరించి, కేసు విచారణ వాయిదా వేసింది.

'ఢిల్లీలో బీజేపీ విజయాలు'

ఖాళీ పుస్తకాన్ని ఆప్ ఆవిష్కరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఢిల్లీలో బీజేపీ విజయాలు' అనే ఖాళీ పేజీలతో ఉన్న పుస్తకాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిష్కరించింది. సోమవారం నాడిక్కడ ఆప్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుస్తకావిష్కరణ అనంతరం ఆప్ సీనియర్ నేత, రాజ్యసభ పక్షనేత సంజయ్‌సింగ్ మాట్లాడుతూ గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వివిధ వాగ్దానాలను ప్రస్తావించారు. బీజేపీపై దాడిని తీవ్రతరం చేస్తూ "మొదటి పేజీలో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు (బీజేపీ) ఎలా ఇచ్చారో, రెండవ పేజీలో ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు ఎలా జమ అయ్యాయో, ప్రజలు ఎలా సంతోషంగా ఉన్నారో, మూడో పేజీలో దేశంలోని ప్రతి రైతు ఆదాయం ఎలా పెరిగిందో వివరాలు ఉన్నాయి" అని అన్నారు. "ఐదో పేజీలో దేశంలో డీజిల్ ధర లీటరుకు రూ. 40, పెట్రోల్ లీటరుకు రూ.50 ఎలా ఉందో వివరాలు ఉన్నాయి. బీజేపీ నాయకులు నిరసన తెలిపే గ్యాస్ సిలిండర్‌ను రూ.250కు ఎలా అమ్ముతున్నారో ఆరో పేజీలో ఉంది" అని ఆయన అన్నారు. "దేశీయ రూపాయిని బలోపేతం చేయడానికి మోడీ రోజుకు 18 గంటలు ఎలా కష్టపడ్డారో ఎనిమిది పేజీలో వివరాలు ఉన్నాయి" అని మరో ఖాళీ పేజీని చూపిస్తూ ఆయన తెలిపారు